సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+16+40 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 6.00 సంపుటి: 12 సంచిక: 99

SUNDAY Special ఆదివారం 30-6-2019

'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సమంతర రేఖ

ప్రముఖ నటి సమంతతో 'సాక్షి' ఎక్స్‌క్లూజివ్ ఇంటర్వ్యూ

- ఫ్యామిలీలో

సెమీ ఫైనల్ లక్ష్యంగా...

నేడు ఇంగ్లండ్‌తో భారత్ పోరు.. ఆరెంజ్ జెర్సీలతో బరిలోకి దిగనున్న టీమిండియా

- స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

పెరగనున్న బీటెక్ ఫీజు!

వృత్తి విద్యాకోర్సులకు కూడా..

- రూ. 50 వేల లోపు ఫీజున్న కాలేజీల్లో 20% పెంపు
- రూ. 50 వేలకు పైగా ఫీజున్న కాలేజీల్లో 15% పెంపు
- కాలేజీ యాజమాన్యాలకు ఏఎఫ్ఆర్‌సీ, ఉన్నత విద్యామండలి ప్రతిపాదన
- అంగీకరించిన మెజారిటీ కాలేజీ యాజమాన్యాలు
- కోర్టు తీర్పు అమలు చేయాలనే కాలేజీలకు ఫీజుల ఖరారు త్వరలో... దీంతో మరో 2-3 రోజులు వెబ్ ఆప్షన్లు వాయిదా!
- ఈ పెంపు కొత్త ఫీజులు ఖరారు చేసే వరకేనన్న అధికారులు
- 280% పెంపును ప్రతిపాదించిన కొన్ని యాజమాన్యాలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో ఇంజనీరింగ్, ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్ తదితర వృత్తి విద్య కోర్సుల ఫీజులు పెరగనున్నాయి. ఇప్పటివరకు రూ.50 వేల లోపు వార్షిక ఫీజున్న కాలేజీల్లో 20%మేర, రూ.50 వేలకు పైగా వార్షిక ఫీజు ఉన్న కాలేజీల్లో 15% మేర ఫీజులు పెరగనున్నాయి. ఇంజనీరింగ్, ఫార్మసీ తదితర వృత్తి, సాంకేతిక విద్య కాలేజీ యాజమాన్యాలతో శనివారం విశ్వేశ్వరయ్య భవన్‌లో ఫీజులు, ప్రవేశాల నియంత్రణ కమిటీ (ఏఎఫ్ఆర్‌సీ), తెలంగాణ ఉన్నత విద్యామండలి సమావేశం నిర్వహించింది. ఈ సమావేశంలో ఏఎఫ్ఆర్‌సీ చైర్మన్ జస్టిస్ స్వరూప్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ కాలేజీ యాజమాన్యాల సంఘం చైర్మన్ గౌతంరావు, కార్యదర్శి సునీల్, వివిధ కాలేజీ యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు. ఫీజుల ఖరారులో ఆలస్యం, ఫీజుల ఖరారులో న్యాయవివాదం తలెత్తడంతో యాజమాన్యాలతో సమావేశమై ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో కొత్త ఫీజులను అమలు చేసేందుకు ప్రవేశాల కమిటీ చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు ఆయా కాలేజీల్లో ఉన్న ఫీజులపై 20%, 15% ఫీజులను పెంచేందుకు ఒకట్రెండు రోజుల సమయం పట్టనున్నందున.. జూలై 1వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన ఇంజనీరింగ్ వెబ్‌ఆప్షన్ల ప్రక్రియను మరో రెండు మూడ్రోజులు వాయిదా వేయాలని ప్రవేశాల కమిటీ నిర్ణయించింది. కాలేజీల వారీగా ఫీజులను మిగతా 2వ పేజీలో ▶

మెడికల్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌లో మార్పు

- ప్రైవేటులో ఈడబ్ల్యూఎస్ కోటా నేపథ్యంలో కేంద్రం నిర్ణయం
- ఒకటో తేదీన మొదటి విడత జాబితా విడుదల... చేరేందుకు ఆరో తేదీ గడువు

- వివరాలు 2లో

వీడుతున్న చిక్కుముళ్లు!

- విభజన సమస్యల పరిష్కారంపై ఇరు రాష్ట్రాల సీఎస్‌ల మధ్య చర్చలు
- సొంత రాష్ట్రానికి ఏపీలోని తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగులు
- ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల సమావేశంలో నిర్ణయం
- ప్రగతి భవన్‌లో రెండోరోజు సమావేశమైన ఉన్నతాధికారులు
- ఇరువురు సీఎంల అనుమతులు తీసుకున్నాక ఉత్తర్వులు జారీ!
- వారంలోగా మరోసారి భేటీ

సాక్షి, హైదరాబాద్: ఏపీ, తెలంగాణ రాష్ట్రాల మధ్య విభజన సందర్భంగా నెలకొన్న చిక్కుముడుల పరిష్కార ప్రక్రియ వేగవంతమైంది. ఉద్యోగులతోపాటు, నిధులు, ఆస్తుల పంపకాలకు సంబంధించిన వివాదాలను సత్వరమే పరిష్కరించుకోవాలని ఇరు రాష్ట్రాల ఉన్నతాధికారుల బృందం నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా ఏపీలో పనిచేస్తున్న తెలంగాణ ప్రాంత నాలుగో తరగతి ఉద్యోగులను.. సొంత రాష్ట్రానికి కేటాయించే అంశంపై ఏకాభిప్రాయం వ్యక్తం చేసింది. శనివారం సాయంత్రం ప్రగతి భవన్‌లో జరిగిన ఈ సమావేశంలో తెలంగాణ నుంచి ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఆర్థిక శాఖ, రాష్ట్ర విభజన వ్యవహారాల ముఖ్యకార్యదర్శి రామకృష్ణారావు, ఏపీ నుంచి ప్రభుత్వ సలహాదారు అజయ్ కల్లమ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం ఈ చర్చల్లో పాల్గొన్నారు. ప్రధానంగా విభజన చట్టం 9, 10వ షెడ్యూల్ మిగతా 2వ పేజీలో ▶

బలోపేతంపై కసరత్తు

- సాగర్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం
- రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాలకు ప్రణాళిక
- కాళేశ్వరం ప్రాజెక్టుపై సవివరమైన సమీక్ష
- పార్టీ భవిష్యత్, క్షేత్రస్థాయిలో బలోపేతంపై చర్చ
- ప్రభుత్వ విధానాలపై పోరాటాలు: టీపీసీసీ చీఫ్ ఉత్తమ్
- ప్రతినెలా ఇలాంటి సమావేశాలు నిర్వహించాలి: కుంతియా

3 లో

నేటి నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం..
- తర్వాత వాయుగుండం

- వివరాలు 2లో

గోడ కూలి 15 మంది మృతి

మహారాష్ట్రలో దుర్ఘటన

- మహారాష్ట్రలో శనివారం ఘోర ప్రమాదం సంభవించింది. భారీ వర్షాల కారణంగా కొడ్వా ప్రాంతంలో నిర్మాణంలో ఉన్న ఓ హౌసింగ్ సొసైటీ గోడ కూలింది. ఈ దుర్ఘటనలో నలుగురు చిన్నారులు సహా 15 మంది మృతి చెందారు. ఇద్దరు గాయపడ్డారు. మృతుల్లో ఎక్కువ మంది బిహార్ రాష్ట్రానికి చెందిన వారే ఉన్నారు.

- వివరాలు 5లో

ఒకే దేశం ఒకే రేషన్ కార్డు

- 2020, జూన్ 30 నుంచి అమలు చేయాలన్న కేంద్రం
- నకిలీ రేషన్ కార్డులు తగ్గుతాయన్న కేంద్ర మంత్రి పాశ్వాన్

- వివరాలు 5లో

బ్రిటిష్ కాలనీగా 156 ఏళ్లపాటు ఉన్న హాంగ్‌కాంగ్‌ను 1997 జూలై 1న చైనాకు తిరిగి అప్పగించారు.

అలెక్సా బూతులు తిడుతోంది!

29 ఏళ్ల మైఖేల్ స్లడే ఎప్పటిలాగే ఇంటికొచ్చి అలెక్సాని ఆన్ చేసి ఏదైనా మంచి సంగీతం వినిపించమని అడిగాడు. అయితే అది సంగీతం వినిపించడానికి బదులు బూతులు తిట్టడం మొదలెట్టింది. ఎప్పుడడిగినా పాటలు వినిపించే ఈ వర్చువల్ అసిస్టెంట్... ఉన్నట్టుండి బూతులందుకోవడంతో మైఖేల్ షాక్ తిన్నాడు. ఏం జరిగిందో తెలియక కంగారు పడ్డాడు. అంతకు ముందురోజే మైఖేల్ తన అమెజాన్ ప్రైమ్ సభ్యత్వం రద్దు చేసుకున్నాడు. దాని విషయమై కస్టమర్ కేర్‌కు చెందిన వ్యక్తితో మాట్లాడాడు. సభ్యత్వం రద్దు చేసుకున్నప్పటి నుంచి అలెక్సా ఇలా వింతగా ప్రవర్తించడంతో దానికీ దీనికీ ఏదైనా సంబంధం ఉందేమోనని అనుమానించాడు. అమెజాన్‌ను సంప్రదిస్తే అలాంటిదేమీ లేదన్నారు. అలెక్సా ఎందుకలా అనుచిత పదాలు వాడుతోందో తమకూ అర్థం కావడం లేదన్నారు. అలెక్సా ఖాతా వివరాలు ఇస్తే ఏం జరిగిందో పరిశీలించి చెబుతామని చెప్పారు. జరిగిన పొరపాటుకు పరిహారంగా అమెజాన్ మైఖేల్‌కు 5 పౌండ్ల నగదు, ఏడాది అమెజాన్ ప్రైమ్ సభ్యత్వం ఉచితంగా ఇచ్చింది.'ఇంటికొచ్చాకా రోజూలాగే అలెక్సాను ఏదైనా సంగీతం వినిపించమని అడిగాను. 'తప్పకుండా. మీ పాటల జాబితా ఇది.....(అని ఓ బూతు పదం వాడింది). తర్వాత క్షమించండి ఏదో పొరపాటు జరిగింది' అని అలెక్సా చెప్పే సరికి షాక్ తిన్నా. అలెక్సా అలా మాట్లాడటం నమ్మలేకపోయా' అన్నాడు సౌత్‌వేల్స్‌కు చెందిన మైఖేల్. అమెజాన్ సాంకేతిక నిపుణులు కూడా ఇలా ఎందుకు జరిగిందో చెప్పలేకపోయారన్నాడు.

17వ శతాబ్దానికి చెందిన అరుదైన వాచీ, వంపు తిరిగిన 'కీ' ఇది. పారిస్‌కు చెందిన జెహాన్ క్రెమ్స్‌డార్ఫ్ అనే వ్యక్తి బంగారం, వజ్రాలతో ఈ వాచీని తయారు చేశాడు. ప్రముఖ వేలం సంస్థ సూత్‌బీస్ లండన్‌లో వీటిని ప్రదర్శనకు ఉంచింది. జూలై 3న నిర్వహించే వేలంపాటలో ఈ వాచీ సుమారు రూ. 6 కోట్ల నుంచి రూ. 8.7 కోట్ల వరకు ధర పలకవచ్చని అంచనా వేస్తున్నారు.

ద స్పేస్ ట్రావెలర్-1 పేరిట లండన్‌కు చెందిన జార్జ్ డేనియల్స్ 1982లో తయారు చేసిన బంగారు వాచీ ఇది. 1969లో అమెరికా చంద్రుడిపై కాలుమోపిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ రూపొందించిన ఈ వాచీని సైతం సూత్‌బీస్ వేలం సంస్థ ప్రదర్శనకు ఉంచింది. జూలై 2న నిర్వహించే వేలంపాటలో ఈ వాచీ కూడా 6 కోట్ల నుంచి రూ. 8.7 కోట్ల వరకు ధర పలకవచ్చని భావిస్తున్నారు.

హజ్-2019 షెడ్యూల్ విడుదల

- వచ్చే నెల 26 నుంచి ఆగస్టు 4 వరకు ప్రయాణం
- తెలంగాణ, ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక యాత్రికులు నగరం నుంచే ప్రయాణం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ హజ్ కమిటీ ద్వారా ఎంపికైన యాత్రికులు వచ్చే నెల 26 నుంచి ఆగస్టు 4 వరకు హజ్‌కు వెళ్తారని రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ మహ్మద్ మసీవుల్లాఖాన్ వెల్లడించారు. ఈమేరకు హజ్ యాత్ర-2019 షెడ్యూల్‌ను శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నాంపల్లి హజ్‌హౌస్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ...ఈ ఏడాది తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ అన్ని జిల్లాలతో పాటు కర్ణాటక నాలుగు జిల్లాల, మహారాష్ట్ర రెండు జిల్లాల యాత్రికులకు కూడా హైదరాబాద్ నుంచే హజ్‌కు బయల్దేరనున్నట్లు ఆయన తెలిపారు. ఈ ఏడాది హజ్ యాత్రకు 13,368 మంది దరఖాస్తు చేసుకోగా 70 ఏళ్లు వయస్సు పైబడిన వారు 484 మంది ఉన్నారన్నారు. దీంతో 484 మందికి నేరుగా హజ్‌కు ఎంపికయ్యా రన్నారు. మిగిలిన 12,884 మంది దరఖాస్తులను డ్రా నిర్వహించి 3,685 మంది ఎంపిక చేశామన్నారు. వచ్చేనెల 24 నుంచి హజ్ క్యాంప్ ప్రారంభిస్తామని తెలిపారు. యాత్రకు సంబంధించిన అన్ని ప్రక్రియల కోసం హజ్ హౌస్‌లో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. యాత్రికులకు లగేజ్, నగదు, ఇమిగ్రేషన్, కస్టమ్స్‌తో పాటు బోర్డింగ్ పాస్‌లు కూడా హజ్ హౌస్‌లోనే అందజేస్తున్నట్లు చెప్పారు. యాత్రికులకు ఆర్టీసీ బస్సుల్లో నేరుగా ఎయిర్‌పోర్టులోని హజ్ టెర్మినల్‌కు తీసుకెళ్లి అక్కడి నుంచి విమానాల్లో ఎక్కిస్తామన్నారు. హజ్ యాత్రికుల హజ్‌హౌస్‌లోనే అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

ఈఎన్‌సీ మురళీధర్ పదవీ కాలం పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: నీటి పారుదల శాఖ ఇంజనీర్ ఇన్ చీఫ్‌గా (ఈఎన్‌సీ) సి.మురళీధర్ పదవీ కాలాన్ని మరింత కాలం పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సోమేశ్‌కుమార్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. అయితే పదవీకాలాన్ని ఎంత కాలం పెంచారన్నది జీవోలో పేర్కొనలేదు.

'నీతి ఆయోగ్ ర్యాంకుల్లో ఎందుకు వెనకబడ్డాం'

సాక్షి, హైదరాబాద్: నీతి ఆయోగ్ ఇటీవల ప్రకటించిన ర్యాంకుల్లో తెలంగాణకు పదో స్థానం వచ్చిన నేపథ్యంలో దీనికి గల కారణాలపై వైద్యారోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శాంతికుమారి శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆస్పత్రుల్లో వైద్యులు, నర్సులు, సిబ్బంది కొరతే ముఖ్య కారణంగా అధికారులు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. మొత్తం 23 అంశాలను ప్రామాణికంగా తీసుకొని నీతి ఆయోగ్ ఈ ర్యాంకులు ప్రకటించింది. ఇందులో డాక్టర్లు, నర్సులు, తదితర సిబ్బంది లేకపోవడాన్నీ కీలకాంశంగా తేల్చారు. అలాగే, వివిధ అంశాల్లో మెరుగ్గానే ఉన్నప్పటికీ డేటా ఎంట్రీలో పలు లోపాలున్నట్టు వైద్యారోగ్య శాఖ భావిస్తోంది. కొన్ని అంశాల్లో రాష్ట్రం ఇచ్చిన డేటానే నీతి ఆయోగ్ ప్రామాణికంగా తీసుకోవడంతో, ఆయా అంశాల్లో డేటాను సరిగా మెయిన్‌టెయిన్ చేయకపోవడం వల్ల కూడా నష్టం జరిగిందంటున్నారు.

బార్ కౌన్సిల్ వెబ్‌సైట్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ వెబ్‌సైట్‌ను హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ రాఘవేంద్ర సింగ్ చౌహాన్ శనివారం ప్రారంభించారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ బార్ కౌన్సిల్ ఏర్పాటు కావడంతో, దీనికి ప్రత్యేకంగా వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ వెబ్‌సైట్‌లో న్యాయవాదుల పేర్లు, సంక్షేమ నిధి వివరాలతో పాటు ఇతర వివరాలను పొందుపరిచారు. హైకోర్టులోని బార్ కౌన్సిల్ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ.నర్సింహారెడ్డి, సభ్యులు ఎన్.హరినాథ్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సునీల్‌గౌడ్, బార్ కౌన్సిల్ కార్యదర్శి రేణుక తదితరులు పాల్గొన్నారు.

108 వాహనాలకు కొత్త టెండర్లు

సాక్షి, హైదరాబాద్: ఆరోగ్యశాఖ పరిధిలోని 108 వాహనాల నిర్వహణకు జీవీకే ఈఎంఆర్‌ఐ సంస్థతో ఉన్న కాంట్రాక్ట్ కాల పరిమితి ముగిసినందున కొత్తగా టెండర్లు పిలవనున్నారు. ఈ మేరకు టెండర్ల ప్రక్రియకు నిబంధనలు రూపొందించేందుకు ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ నేతృత్వంలో కమిటీని నియమిస్తూ ప్రభుత్వం శనివారం జీవో జారీ చేసింది. హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్ కమిషనర్ చైర్‌పర్సన్‌గా ఉండే ఈ కమిటీలో పబ్లిక్ హెల్త్ విభాగం డైరెక్టర్, వైద్య విధాన పరిషత్ కమిషనర్, టీఎస్ఎంఐడీసీ చీఫ్ ఇంజనీర్, స్టేట్ హెల్త్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్, రవాణాశాఖ జాయింట్ సెక్రటరీ తదితరులు సభ్యులుగా ఉంటారు. మొత్తం 3 నెలల్లో కాంట్రాక్ట్ ప్రక్రియంతా ముగించాలని కమిటీకి ప్రభుత్వం సూచించింది.

నేటి నుంచి రాష్ట్రంలో భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో నేడు అల్పపీడనం.. తర్వాత వాయుగుండం

సాక్షి, హైదరాబాద్: ఉత్తర బంగాళాఖాతంలో ఆదివారం అల్పపీడనం ఏర్పడనుందని, ఆ తర్వాత రెండు రోజులకు అది వాయుగుండంగా మారనుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం సీనియర్ అధికారి రాజారావు తెలిపారు. దీంతో రాష్ట్రంలో ఆదివారం నుంచి 5 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశముందని ఆయన వెల్లడించారు. రుతుపవనాలు మొదలయ్యాక అల్పపీడనం కారణంగా రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని తెలిపారు. దీంతో రాష్ట్రంలో ఖరీఫ్ సీజన్ మరింత ఆశాజనకంగా ఉంటుందని వ్యవసాయ శాఖ వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా 24 గంటల్లో రాష్ట్రంలో అనేకచోట్ల భారీ వర్షాలు కురిశాయి. కొమురం భీం జిల్లా బెజ్జూరులో అత్యధికంగా 10 సెంటీమీటర్ల భారీ వర్షం కురిసింది. సారంగాపూర్, బజార్హత్నూర్‌ల్లో 7 సెం.మీ., దిల్వార్‌పూర్, వంకడి, ఖానాపూర్‌ల్లో 6 సెం.మీ., కమ్మర్‌పల్లి, ఆర్మూర్, నందిపేట, భూపాలపల్లి, మోర్తాడ్, బోథ్, మంథని, నవీపేట్‌ల్లో 5 సెం.మీ.ల చొప్పున వర్షపాతం నమోదైంది.

జూలై 1 నుంచి గ్రూప్-2 ఇంటర్వ్యూలు

సాక్షి, హైదరాబాద్: జూలై 1వ తేదీ నుంచి గ్రూప్-2 ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ వెల్లడించింది. టీఎస్‌పీఎస్సీ కార్యాలయం ఉన్న ప్రతిభా భవన్‌లో ఈ ఇంటర్వ్యూలను నిర్వహించనున్నట్లు కమిషన్ సెక్రటరీ వాణిప్రసాద్ తెలిపారు. ఇంటర్వ్యూల సమయంలో సందర్శకులకు కార్యాలయంలోకి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఇంటర్వ్యూలు కొనసాగే సమయంలో చైర్మన్ సహా ఇతర సభ్యులు ఎవరినీ కలవబోరని తెలిపారు. అత్యవసర వినతులు ఏవైనా ఉంటే పీఆర్‌ఓను కలిసి విన్నవించాలని సూచించారు.

డీఎడ్, డీపీఎస్‌ఈ ప్రవేశ తేదీలు ఖరారు

సాక్షి, హైదరాబాద్: డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్, డిప్లొమా ఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ కోర్సుల్లో సీట్లు పొందిన విద్యార్థులు జూలై 3 నుంచి 5వ తేదీ వరకు ఫీజు చెల్లించాలని డీఈఈసెట్ కన్వీనర్ ఎ. సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా తేదీల్లో విద్యార్థులు ఫైనల్ అడ్మిషన్ లెటర్ డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. 5వ తేదీన కాలేజీల్లో చేరాలని, అదే రోజు నుంచి తరగతులు ప్రారంభం అవుతాయని వెల్లడించారు.

శనివారం విభజన సమస్యలపై ప్రగతిభవన్‌లో జరిగిన సమావేశానికి హాజరైన సీఎస్ ఎస్కే జోషి. చిత్రంలో రాజీవ్‌శర్మ, రామకృష్ణారావు

వీడుతున్న చిక్కుముళ్లు!

▶ మొదటి పేజీ తరువాయి

సంస్థల్లోని ఉద్యోగులు, ఆస్తులు, అప్పుల పంపిణీపై ఇచ్చిపుచ్చుకునే ధోరణిలో చర్చలు సాగాయి. తొమ్మిదవ షెడ్యూల్లోని 89 సంస్థల ఆస్తులు, అప్పులు పంపిణీకి సంబంధించి 'షీలా భీడే కమిటీ'నివేదిక ఆధారంగా ముందుకు సాగేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసింది. ఇందులో కొన్ని సంస్థల్లో ఏపీకి, మరికొన్ని సంస్థల్లో తెలంగాణకు ప్రయోజనం ఉంటుందని, ఇరు రాష్ట్రాలకు సమన్యాయం జరిగే అవకాశం ఉన్నందున తొమ్మిదవ షెడ్యూల్లోని 89 సంస్థలకు సంబంధించిన సమస్యలను వెంటనే పరిష్కరించుకుందామని సమావేశంలో నిర్ణయించారు. దీనిపై తెలంగాణ అధికారులు కూడా సానుకూలంగానే స్పందిస్తూ సీఎం కేసీఆర్‌తో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. 10వ షెడ్యూల్‌లోని సంస్థల ఆస్తులు, అప్పులు, నగదు పంపిణీపై కూడా విస్తృతంగా చర్చించారు. ఇరు రాష్ట్రాల సీఎంల సూచనల మేరకు సుహృద్భావ వాతావరణంలో ఈ చర్చలు జరిగాయని అధికారవర్గాలు తెలిపాయి. తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు రావాల్సిన విద్యుత్ బకాయిలపై కూడా రెండు రాష్ట్రాల అధికారుల మధ్య చర్చలు కొనసాగాయి. విద్యుత్ ఉద్యోగుల పంపిణీపై కూడా చర్చ సాగింది. భీష్మించుకుని కూర్చోవడం వల్ల ఫలితం ఉండదని, పరిష్కారాలు కావాలని శుక్రవారం ఇరు రాష్ట్రాల సీఎంలు నిర్ణయించిన సంగతి తెలిసిందే.

సమావేశంలో పాల్గొన్న ఏపీ సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం, ప్రభుత్వ సలహాదారు అజయ్ కల్లమ్

విశాఖ లేదా తిరుపతిలో సీఎంల భేటీ!

రెండు రాష్ట్రాల అధికారుల మధ్య సాగిన చర్చల సారాంశాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రహ్మణ్యం నిర్ణయించారు. వారం రోజుల్లోగా ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు, సలహాదారులు మరోసారి సమావేశమై సమస్యల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని నిర్ణయించారు. సాగునీటికి సంబంధించిన అంశాలపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల నడుమ.. వారం, పది రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో సమావేశాన్ని ఏర్పాటు చేయించాలని భావిస్తున్నారు. జూలై 11వతేదీ నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలున్నందున ఆ లోగానే ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో విశాఖపట్టణం లేదా తిరుపతిలో సమావేశం నిర్వహించాలని అధికారులు యోచిస్తున్నారు.

గో'దారి'పై కసరత్తు షురూ!

- కృష్ణాకు జలాల తరలింపుపై అధ్యయనం మొదలుపెట్టిన ఇంజనీర్లు
- పాత ప్రతిపాదనల అలైన్‌మెంట్ పరిశీలన
- జూలై 2న ఇరు రాష్ట్రాల ఇంజనీర్ల సమావేశం.. అనంతరం లైడార్ సర్వే

సాక్షి, హైదరాబాద్: కృష్ణాకు గో'దారి'ని కలిపెట్టే పనిలో పడ్డారు ఇంజనీర్లు. గోదావరి నీటిని కృష్ణా బేసిన్‌కు తరలించే ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్న రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల ఆదేశాల మేరకు నీటి పారుదలశాఖ అధికారులు రంగంలోకి దిగారు. గోదావరిని కృష్ణాబేసిన్‌కు తరలించేలా ఇప్పటికే వివిధ కేంద్ర, రాష్ట్ర సంస్థలు చేసిన అధ్యయనాలు, కొత్తగా తెరపైకి వస్తున్న ప్రతిపాదనలపై దృష్టి పెట్టారు. ఇరు రాష్ట్రాలకు మేలు చేసేలా ఏయే ప్రాంతాల నుంచి నీటిని శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు తరలించాలన్న దానిపై అధ్యయనం చేస్తున్నారు. శుక్రవారం ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు, కె.చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిల భేటీ ముగిసిన వెంటనే రాత్రి ఎనిమిదింటి వరకు ఇరు రాష్ట్రాల ఇంజనీర్లు ఇక్కడి జలసౌధలో భేటీ అయ్యారు. గోదావరిజలాల తరలింపుపై ఇదివరకే సిద్ధం చేసిన పలు ప్రతిపాదనలపై ప్రాథమిక చర్చలు జరిపారు. దీనికి కొనసాగింపుగా శనివారం రాష్ట్ర అంతర్రాష్ట్ర జల వనరుల విభాగం గతంలో ఎన్‌డబ్ల్యూడీఏ ఇచ్చిన నివేదికలపై అధ్యయనం మొదలుపెట్టింది.

గత అధ్యయనాలపై పునఃపరిశీలన

ఇచ్చంపల్లి, అకినేపల్లి, జనంపేట, రాంపూర్ ప్రాంతాల నుంచి నీటిని సాగర్‌కు తరలించే ప్రతిపాదనలను పరిశీలించింది. ఇచ్చంపల్లి-సాగర్ అనుసంధానానికి 299 కి.మీ.మేర నీటి తరలింపు ప్రక్రియకే రూ.26,289 కోట్లు అవసరమవుతాయని, ఇందులో ప్రధాన లింక్ కెనాల్‌కే రూ.14,636 కోట్లు అవసరమని 2014లో కేంద్రసంస్థలు లెక్కగట్టాయి. 312 కి.మీ. పొడవైన ఇచ్చంపల్లి-పులిచింతలకు సైతం భారీ అంచనా వ్యయాలనే ప్రతిపాదించారు. అనుసంధాన కాల్వల వెంబడి రిజర్వాయర్ల నిర్మాణం, కాల్వల తవ్వకంతో 226 గ్రామాలు, లక్షమంది ప్రజలు ప్రభావితమయ్యే అవకాశముంది. మరో 51 వేల ఎకరాల అటవీ, 70 వేల ఎకరాల వ్యవసాయభూమి ప్రభావితమయ్యే అవకాశం ఉందని గతంలో తేల్చారు. ప్రభుత్వాలు ముంపు లేకుండా నీటిని తరలించే అంశాలపై దృష్టి పెట్టాలని సూచించిన నేపథ్యంలో ఈ ప్రతిపాదన ఎంతవరకు సమంజసంగా ఉంటుందనే చర్చ జరుగుతోంది. ఇచ్చంపల్లికి 74 కిలోమీటర్ల దిగువన ఇంద్రావతి ఉపనది గోదావరిలో కలిశాక ఖమ్మం జిల్లా అకినేపల్లి వద్ద సుమారు 716 టీఎంసీల జలాలలభ్యత ఉంటుందని, అందులో తెలంగాణ, ఏపీలు తమ ప్రాజెక్టులకు వినియోగించుకోగా 324 టీఎంసీల మేర మిగులు జలాలుంటాయని, ఇందులో 237 టీఎంసీ నీటిని సాగర్‌కు తరలించాలని కేంద్రం మరో ప్రతిపాదన చేసింది. దీనిలో భాగంగా నిర్మించే కాలువ పెద్దవాగు, కిన్నెరసాని, మురేడు, పాలేరు, మూసీ నదులను దాటి వెళ్లాల్సి ఉంటుందని తెలిపింది. అయితే, దీని నిర్మాణానికి సైతం ఖమ్మం జిల్లాలో అటవీ భూములు, ఇతర ప్రాంతాలకు ముంపు ఎక్కువగా ఉండనుంది. దీనికి బదులుగా జానంపేట నుంచి పైప్‌లైన్ వ్యవస్థ ద్వారా సాగర్‌కు నీటిని తరలించే ప్రతిపాదన ఉంది. వీటితోపాటే తుపాకులగూడెం దిగువ నుంచి సాగర్‌కు తరలించే ప్రతిపాదనలను గతంలో తెలంగాణ సిద్ధం చేసింది. వీటితోపాటే కొత్తగా అకినేపల్లికి ఎగువన రాంపూర్ నుంచి గోదావరి నీటిని ఎలాంటి ముంపు లేకుండా నీటిని తీసుకోవచ్చని ఇంజనీర్లు గుర్తించారు. దుమ్ముగూడెం నుంచి సాగర్ టెయిల్‌పాండ్‌కు తరలించే ప్రణాళిక ఇప్పటికే సిద్ధంగా ఉంది. ఈ అన్ని ప్రతిపాదనలపై వాటి అలైన్‌మెంట్, ముంపు, నిర్మాణవ్యయం, ఇరు రాష్ట్రాల్లో సాగులోకి వచ్చే ఆయకట్టు తదితరాలపై ఇంజనీర్లు టోఫోషీట్లు, గూగుల్ మ్యాప్‌ల ద్వారా పరిశీలిస్తున్నారు. జూలై 2న ఇరు రాష్ట్రాల ఇంజనీర్లు సంయుక్త భేటీ నిర్వహించిన అనంతరం, ప్రతిపాదించే అలైన్‌మెంట్‌లపై లైడార్ సర్వే చేయనున్నారు.

పెరగనున్న బీటెక్ ఫీజు!

▶ మొదటి పేజీ తరువాయి

ఖరారు చేశాకే, వెబ్ ఆప్షన్లను అందుబాటులో తేవాల్సి ఉంటుంది. దీంతో.. తాజా మార్పులను దృష్టిలో ఉంచుకుని వెబ్‌ఆప్షన్లను వాయిదా వేయనున్నారు.

103 ఇంజనీరింగ్ కాలేజీల్లో 20%

రాష్ట్రంలో 2016-17 విద్యా సంవత్సరంలో 184 ఇంజనీరింగ్ కాలేజీలకు ఫీజులను ఏఎఫ్ఆర్‌సీ ఖరారు చేసింది. ఇందులో కనీస ఫీజు రూ.35 వేల లోపు ఉన్న కాలేజీలు 26 ఉన్నాయి. వాటితో కలుపుకొని రూ.50వేల లోపు ఫీజున్న కాలేజీల సంఖ్య 103. ప్రస్తుతం వాటన్నింటిలో 20% ఫీజులు పెరగనున్నాయి. మిగతా 81 కాలేజీల్లో 15% ఫీజులు పెంచనున్నారు. ఇంజనీరింగ్‌తోపాటు ఫార్మసీ, ఎంబీఏ, ఎంసీఏ, బీఎడ్, లా తదితర వృత్తి విద్యాకోర్సుల ఫీజులు కూడా ఇదే నిష్పత్తిలో (20%, 15%) పెంచేందుకు అధికారులు ఓకే చెప్పారు. 2019-20 విద్యా సంవత్సరం నుంచి 2021-22 విద్యా సంవత్సరం వరకు మూడేళ్ల పాటు అమలు చేయాల్సిన ఫీజుల కోసం 1,235 వృత్తి, సాంకేతిక విద్యా కాలేజీలు ప్రతిపాదనలను అందజేశాయి. ప్రస్తుతం వాటన్నింటిలో ఈ పెంపు అమలు కానుంది.

భారీగా పెంపుదలకు డిమాండ్

కొత్త ఫీజుల ఖరారు విషయంలో న్యాయ వివాదం నేపథ్యంలో ఫీజులను పెంచుతామని అధికారులు యాజమాన్యాల ముందు ప్రతిపాదన పెట్టగా కొన్ని కాలేజీలు 35-40% పెంచాలని డిమాండ్ చేశాయి. కానీ భారీగా పెంచితే వ్యతిరేకత ఎదురవుతుందన్న అభిప్రాయం కారణంగా తాజా మార్పులను ఏఎఫ్ఆర్‌సీ సూచించింది. దీనికి మెజారిటీ యాజమాన్యాలు అంగీకరిస్తూ సంతకాలు చేశాయి. వాస్తవానికి ఏఎఫ్ఆర్‌సీ చైర్మన్‌ను ముందుగా నియమించి ఉంటే, ఆయా కాలేజీల ఆదాయ వ్యయాలను బట్టి ఫీజులను ఖరారు చేసేవారు. నియామకంలో ఆలస్యం కావడం, ఫీజులను ఖరారు చేయకపోవడంతో ప్రవేశాలు మరింత జాప్యమయ్యే పరిస్థితి నెలకొనడంతో.. ఈ పెంపును అధికారులే ప్రతిపాదించారు. దీనికి కోర్టును ఆశ్రయించిన కాలేజీలు కూడా చాలా వరకు అంగీకరించాయని అధికారులు వెల్లడించారు. అంతేకాదు రాతపూర్వకంగా అంగీకారాన్ని తెలియజేశాయని పేర్కొన్నారు.

కోర్టు తీర్పును కచ్చితంగా అమలు చేయాలంటే..

ఏఎఫ్ఆర్‌సీ చేసిన ప్రతిపాదనకు అంగీకరించకుండా, కోర్టు తీర్పునే అమలు చేయాలంటే అందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. కొత్త ఫీజు ప్రతిపాదనలు ఇచ్చిన కాలేజీల్లో కొన్ని 280% పెంపుదల కోరాయి. రూ.1,13,500 ఫీజు ఉన్న ఓ కాలేజీ రూ.3.19 లక్షల వార్షిక ఫీజును ప్రతిపాదించాయి. ఇలా చాలా కాలేజీలు 200శాతానికి పైగా ఫీజులను ప్రతిపాదించాయి. అలాంటి వాటిల్లో మొదట 6 కాలేజీలు కోర్టును ఆశ్రయించగా, యాజమాన్య ప్రతిపాదిత ఫీజు అమలుకు తీర్పు ఇచ్చింది. ఆ తరువాత మరో 75 కాలేజీలు కోర్టుకు వెళ్లి అదే తరహా ఆర్డర్ తెచ్చుకున్నాయి. దీంతో వాటి సంఖ్య 81కి చేరింది. అయితే శనివారం జరిగిన సమావేశంలో ఆ కాలేజీలకు చెందిన యాజమాన్యాలు కూడా పాల్గొన్నాయి. అందులో మెజారిటీ కాలేజీలు అధికారుల ప్రతిపాదనకు అంగీకరించాయి. ఇక భారీగా ఫీజును ప్రతిపాదించిన 20 వరకు కాలేజీలు ఈ పెంపు ప్రతిపాదనను అంగీకరించే అవకాశం కనిపించడం లేదు. వారు కోర్టు తీర్పును అమలు చేయాలని కోరే అవకాశం ఉంది. తమ ప్రతిపాదనకు రాత పూర్వకంగా అంగీకారం తెలుపని కాలేజీలతో మరోసారి మాట్లాడి ఒప్పించాలని భావిస్తున్నారు. వారు అంగీకరించకపోతే ఆయా కాలేజీలకు ఫీజులను నిర్ధారించాలన్న నిర్ణయానికి వచ్చారు. ప్రస్తుతం ఎలాగూ వెబ్‌ఆప్షన్లను వాయిదా వేయాలని భావిస్తున్నందున మరికొంత సమయం దొరుకుతుంది. వెబ్ ఆప్షన్ల చివరి తేదీ నాటికి ఆయా కాలేజీల ఫీజులను ఖరారు చేసి కౌన్సెలింగ్‌లో పెట్టాలన్న ఆలోచన చేస్తున్నారు. విద్యార్థులు కొత్త ఫీజులను చూసి చివరి రోజున తమ ఆప్షన్లను మార్చుకునే అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు. ఆ తర్వాత మిగతా అన్ని కాలేజీల ఆదాయ వ్యయాలను బట్టి కొత్త ఫీజులను నెల, రెండు నెలల రోజుల్లోఖరారు చేసేందుకు చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. దాంతో విద్యార్థులు ఫీజులు చెల్లించే నాటికి ఈ ప్రక్రియను పూర్తి చేస్తే ఎలాంటి సమస్యలు ఉండబోవని అధికారులు భావిస్తున్నారు.

ఫీజుల కోసం దరఖాస్తు చేసుకున్న కాలేజీలు

బీటెక్-197, ఎంటెక్-130, ఎంబీఏ-285, ఎంసీఏ-33, బీఫార్మసీ-122, ఎంఫార్మసీ-113, ఫార్మ్‌డీ-57, ఫార్మ్‌డి (పీబీ)-28, బీఎడ్-196, ఎంఎడ్-9, బీపీఈడీ-9, డీపీడీడీ-2, ఎల్ఎల్‌బీ-29, ఎల్ఎల్ఎం-9, బీఆర్క్-9, ఎం.ఆర్క్-2, బీఎఫ్ఏ-5.

ఫీజు తంటాలు తప్పవా?

వెబ్ ఆప్షన్ల సమయంలో కాలేజీ వారీ ఫీజులను వెల్లడించాలి. వాటిని చూసే విద్యార్థులు ఆ ఫీజులను బట్టి తమకు ఇష్టమైన కాలేజీని ఎంచుకుంటారు. అయితే ఇప్పటివరకు రూ.60 వేల ఫీజు ఉన్న ఓ కాలేజీకి అధికారులు చేసిన 15% పెంపు ప్రతిపాదన ప్రకారం రూ.9 వేలు పెరుగుతుంది. ఆ కాలేజీ ఫీజు రూ.69 వేలకు చేరుకుటుంది. అయితే ఇది తాత్కాలికమే. ఆదాయ వ్యయాలను బట్టి ఆ కాలేజీ ఫీజును వచ్చే నెల రెండు నెలల్లో పూర్తిస్థాయి ఫీజును ఖరారు చేస్తారు. ఇక్కడే ఓ సమస్యుంది. ఇప్పటి వరకు రూ.60 వేల ఫీజు ఉన్న ఆ కాలేజీ కొత్త ఫీజును రెట్టింపు చేస్తూ రూ.1.20 లక్షలకు ప్రతిపాదిస్తే వాటిని ఏఎఫ్ఆర్‌సీ పరిశీలించనుంది. అందులో రూ.1 లక్షకు కనుక ఆ కాలేజీ ఫీజు ఖరారైతే ఆ కాలేజీలో చేరిన విద్యార్థిపై రూ.40 వేల అదనపు భారం పడనుంది. ఆ కాలేజీ ఫీజు ఇపుడు రూ.69వేలుగా చేసినా, ఆ తరువాత ఎంతవరకు పెరుగుతుందో.. ఆదాయ వ్యయాలను బట్టి ఫీజుల నియంత్రణ కమిటీ ఎంతవరకు తగ్గిస్తుందో తెలియని పరిస్థితి ఉంటుంది. విద్యార్థి వెబ్ ఆప్షన్లు ఇచ్చుకునేప్పుడు రూ.69 వేలు మాత్రమే కనిపిస్తుంది తప్ప కచ్చితమైన ఫీజు తెలియదు. ఇలాంటి పరిస్థితి చాలా కాలేజీల విషయంలో గందరగోళం నెలకొనే ప్రమాదం ఉంది. దీంతో ఈసారి విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఫీజు ఇబ్బందులు, గందరగోళ

బలోపేతంపై నాయకత్వం కసరత్తు

సాగర్‌లో టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశం

- రాష్ట్ర ప్రభుత్వంపై పోరాటాలకు ప్రణాళిక
- కాళేశ్వరం ప్రాజెక్టుపై సవివరమైన సమీక్ష
- పార్టీ భవిష్యత్, క్షేత్రస్థాయిలో బలోపేతంపై చర్చ
- ప్రభుత్వ విధానాలపై పోరాటాలు: టీపీసీసీ చీఫ్ ఉత్తమ్
- ప్రతినెలా ఇలాంటి సమావేశాలు నిర్వహించాలి: కుంతియా

నాగార్జునసాగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా, సీనియర్ నేతలు షబ్బీర్ అలీ, జానారెడ్డి తదితరులు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: రాష్ట్రంలో పార్టీని బతికించుకునేందుకు క్షేత్రస్థాయిలో బలోపేతం అయ్యేందుకు కాంగ్రెస్ సీనియర్ నాయకత్వం కూలంకశంగా చర్చించింది. పార్టీ భవిష్యత్, ప్రభుత్వంపై సాగించాల్సిన పోరాటాలు, దానికి అవలంభించాల్సిన విధానాలు, రానున్న మున్సిపల్ ఎన్నికలు.. సాగునీటి ప్రాజెక్టులు, ప్రధానంగా కాళేశ్వరం ప్రాజెక్టు తదితర అంశాలపై కాంగ్రెస్ పెద్దలు మేధోమథనం చేశారు. ఈ మేరకు నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లో శనివారం జరిగిన టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో చర్చ జరిగింది. టీపీపీసీ చీఫ్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఆర్‌సీ కుంతియా, కార్యదర్శులు బోసురాజు, శ్రీనివాస కృష్ణన్, సలీం అహ్మద్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు రేవంత్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కుసుమకుమార్, సీఎల్పీ మాజీ నేత జానారెడ్డి, డీసీసీ అధ్యక్షులు, టీపీసీసీ ఆఫీస్ బేరర్లు పాల్గొనగా సుదీర్ఘంగా ఈ సమావేశం సాగింది. ఇన్‌కేమెరాగా జరిగిన ఈ సమావేశంలో కాళేశ్వరం ప్రాజెక్టు, దాంతో జరిగే నష్టాలపై నైనాల గోవర్ధన్ వివరించగా, సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ఎలాంటి విధానం అవలంభించాలనే అంశంపై శాసనమండలి సభ్యుడు టి.జీవన్ రెడ్డి వివరించారు. తాజా రాజకీయ పరిణామాలపై నిశితంగా చర్చించారు. మున్సిపల్ ఎన్నికలకు సిద్ధం కావాలని నేతలు ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

జూలై మొదటి వారంలో డీసీసీ సమావేశాలు

జూలై మొదటి వారంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశాలు జరపాలని నిర్ణయించారు. ముందుగా కొత్త జిల్లాల్లో ఈ సమావేశాలను నిర్వహించనున్నారు. అనంతరం మున్సిపాలిటీల స్థాయిలో కూడా సమావేశాలు జరపనున్నారు. జూలై 1 నుంచి 4వ తేదీలోగా డీసీసీ విస్తృతస్థాయి సమావేశాలు.. 5 నుంచి 10వ తేదీలోగా అన్ని మున్సిపాలిటీల్లో సమావేశాలు పెట్టాలని నిర్ణయం జరిగింది. ఎలాంటి ఇబ్బందులూ లేని నియోజక వర్గాల్లో ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జులు, ఎమ్మెల్యేలకు పూర్తి బాధ్యత అప్పజెప్పాలని నిర్ణయించారు. డీసీసీ భవనాలకు ప్రభుత్వం భూములు కేటాయించేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సమావేశంలో చర్చకు వచ్చింది. సచివాలయం కూల్చివేత విషయాన్ని కాంగ్రెస్ పూర్తిగా వ్యతిరేకించాలని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని, టీఆర్ఎస్‌ను నిలదీయాలని తీర్మానించారు. మునిసిపాలిటీల్లో ఎన్నికల కోసం అభ్యర్థులను 'సెలక్ట్ అండ్ ఎలెక్ట్'పద్ధతిలో టికెట్లు కేటాయించాలన్న ప్రతిపాదనలకే నాయకత్వం మొగ్గుచూపిందని సమాచారం. టీపీసీసీ ముఖ్య నాయకులు కొన్ని మున్సిపాలిటీల బాధ్యతలు తీసుకోవాలని తేల్చారు. ఉమ్మడి రంగారెడ్డి, నల్లగొండ పరిధిలోని 40 మున్సిపాలిటీలపై ఎంపీలు రేవంత్ రెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పార్టీ నేత కొండ విశ్వేశ్వర్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించాలని తీర్మానించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

సచివాలయం సందర్శన...

కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు సోమవారం సచివాలయాన్ని సందర్శించి భవనాలను పరిశీలించాలని వర్కింగ్ ప్రెసిడెంట్ రేవంత్ రెడ్డి ప్రతిపాదించారు. ఏ భవనం ఎప్పుడు నిర్మించారు?.. ఎప్పుడు శంకుస్థాపన జరిగింది..? ఎప్పుడు ప్రారంభించారో తెలుసుకునేందుకు శిలాఫలకాలను పరిశీలించాలని నిర్ణయించారు. పాత భవనాలను కూల్చివేయకుండా ఇతర అవసరాలకు వినియోగించుకోవాలని, ఈ విషయాన్ని ప్రభుత్వానికి సూచించాలని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అద్దెగదుల్లో నడుస్తున్న ప్రభుత్వ శాఖలకు సచివాలయ భవనాలను వాడుకోవచ్చని ఆయన సూచించారు.

ముఖ్యనేతలు బాధ్యతతో పనిచేయాలి: ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ముఖ్యనేతలంతా మున్సిపల్ ఎన్నికల్లో బాధ్యతతో పనిచేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత, ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చెప్పారు. కాళేశ్వరం 20 శాతం పూర్తికాకున్నా హడావుడిగా ప్రారంభించారని పేర్కొన్నారు. కాళేశ్వరంపై ప్రజలను చైతన్యవంతం చేస్తూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కొత్త సచివాలయం, అసెంబ్లీ నిర్మాణంపై పిల్ వేస్తానని కోమటిరెడ్డి స్పష్టం చేశారు. కొత్త జిల్లాల వారీగా దత్తత తీసుకొని పార్టీని బలోపేతం చేద్దామని సూచించారు. గ్రామగ్రామాన తిరిగి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి కృషి చేస్తామన్నారు.

ప్రతి నెలా ఇలాంటి సమావేశాలు: కుంతియా

ప్రతినెలా ఇదే తరహాలో సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర ఇన్‌చార్జ్ కుంతియా సూచించారు. సమన్వయ కమిటీ, వర్కింగ్ కమిటీ, టీపీసీసీ కమిటీ కలసి పనిచేయాలన్నారు. ప్రతినెలా రాష్ట్ర, జిల్లా, మండలస్థాయి సమావేశాలు తప్పనిసరిగా జరుపుకోవాలని పేర్కొన్నారు. 38 నియోజకవర్గాల్లో బాధ్యులు లేరని, అక్కడ ఒక కమిటీ వేసి కో-ఆర్డినేటర్లను నియమించి పని చేయించాలని నిర్ణయించారు. రాష్ట్రస్థాయి నాయకులను ఒక్కో నియోజకవర్గంలో ఇన్‌చార్జ్‌గా పని చేయించాలని, సీనియర్లు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలతో సమన్వయ కమిటీని వేయాలని తీర్మానించారు. రాహుల్ రాజీనామాను ఉప సంహరించుకుని మళ్లీ పార్టీలో యాక్టివ్‌గా పనిచేయాలని కోరాలని ఈ సమావేశం నిర్ణయించింది.

ప్రభుత్వ విధానాలపై పోరాటాలు: ఉత్తమ్

కొత్త సచివాలయం, అసెంబ్లీ నిర్మాణాలపై పోరాటం చేస్తామని టీపీసీసీ చీఫ్ ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కొత్త అసెంబ్లీ భవనాల అవసరమే లేదని, ఇక పాత సచివాలయం కూల్చొద్దని కోరారు. సోమవారం జీవన్‌రెడ్డి, రేవంత్‌రెడ్డి సచివాలయాన్ని పరిశీలిస్తారని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకుంటున్నారన్న తప్పుడు భావన రాకుండా జాగ్రత్త పడాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. దీనిపై స్పష్టమైన వైఖరి కోసం కమిటీ వేస్తామన్నారు. అలాగే ప్రాజెక్టులకు బ్యాంకులు ఎలా రుణాలు ఇస్తున్నాయో చూడాలని కూడా నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. రాహుల్ గాంధీ జాతీయ అధ్యక్షుడిగా కొనసాగాలని తీర్మానం చేసి పంపిస్తామని తెలిపారు.

ప్రాజెక్టు నిర్మాణాల్లో అవినీతిని ఎండగడతాం

- జిల్లా, రాష్ట్రస్థాయిలో ఖాళీగా ఉన్న పార్టీ పదవుల భర్తీ
- మీడియా సమావేశంలో పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: కొత్త ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో జరుగుతున్న అవినీతిని ఎండగడతామని తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రకటించారు. కాళేశ్వరం సహా ప్రాజెక్టుల నిర్మాణాలపై లోతైన పరిశీలన చేసి ప్రజలకు వివరించేందుకు పార్టీ తరఫున సీనియర్ నేతలు, మరికొంత మంది నిపుణులతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. శనివారం నల్లగొండ జిల్లాలోని నాగార్జునసాగర్‌లో పీసీసీ కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, భవిష్యత్తు కార్యాచరణను ఆయన మీడియాకు వివరించారు. ఈ అంశాన్ని పార్టీలో మరోసారి చర్చించి తమ విధానాన్ని ప్రకటించనున్నట్లు చెప్పారు. తమ పార్టీ సాగునీటి ప్రాజెక్టులకు వ్యతిరేకం కాదని, ప్రాజెక్టులను అడ్డుకుంటున్నామనే వాదన సరికాదని వ్యాఖ్యానించారు. ప్రాజెక్టుల రీడిజైన్, అంచనా వ్యయాలను రెండింతలు చేయడంలో అవినీతి కోణం ఉందన్నారు. ప్రాజెక్టుల నిర్మాణాలకు సంబంధించిన డీపీఆర్‌లను ప్రభుత్వం రహస్యంగా ఉంచుతోందని, కనీసం శ్వేతపత్రం కూడా విడుదల చేయడం లేదని విమర్శించారు. ప్రధానంగా బ్యాంకులకు ఏం అంకెలు చూపుతున్నారు? బ్యాంకర్లు ఎలా రుణాలు ఇస్తున్నారో తెలుసుకుంటామన్నారు.

సచివాలయ భవనాలను కూల్చడమెందుకు...?

ఇంకా 50 ఏళ్ల ఆయుష్షు ఉన్న సచివాలయ భవనాలను కూల్చేయడం సరికాదని ఉత్తమ్ అన్నారు. భవనాల పరిశీలనకు పార్టీ తరఫున ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎంపీ రేవంత్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్‌లతో కూడిన త్రిసభ్య కమిటీని ఏర్పాటు చేశామన్నారు. ఖాళీగా ఉన్న పార్టీ పదవులను తక్షణమే భర్తీ చేయాలని నిర్ణయించామని, సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నామని ఉత్తమ్ పేర్కొన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పార్టీ అధ్యక్షుడి హోదాలో బీఫాంలు ఇచ్చే అధికారం పీసీసీ అధ్యక్షుడిదే అయినప్పటికీ ఎన్నికల్లో పోటీ చేసి గెలిచిన లేదా ఓడిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, డీసీసీ అధ్యక్షులు, ఆ మున్సిపాలిటీ లేదా నియోజకవర్గానికి చెందిన పీసీసీ ఆఫీస్ బేరర్లు, ఇతర ముఖ్యనేతలతో కూడిన కమిటీలను ప్రతిపాదించాలని సూచించామని చెప్పారు.

పార్టీ పదవుల భర్తీ

పీసీసీ సభ్యులు, ఉపాధ్యక్షులు, జనరల్ సెక్రటరీలు ఇలా.. ఖాళీగా ఉన్న పార్టీ పదవులను భర్తీ చేయనున్నట్లు ఉత్తమ్ ప్రకటించారు. సీఎల్పీనీ టీఆర్ఎస్ఎల్పీలో విలీనం చేయడం, రాజగోపాల్ రెడ్డి వ్యవహారం చర్చకు రాలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. సీఎల్పీ అంశం కోర్టులో ఉందని, తమకు న్యాయం జరుగుతుందనే విశ్వాసం ఉందన్నారు. పార్టీకి ఎవరూ అతీతులు కారని, పార్టీ వ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడినా, పార్టీ నిర్ణయాలు ధిక్కరించినా చర్యలు ఉంటాయని ఏఐసీసీ స్పష్టం చేసిందని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులు పెరిగిపోతున్నాయని, దీనిని నిరసిస్తూ రెండు, మూడు వారాల్లో జైల్‌భరో కార్యక్రమాన్ని చేపట్టనున్నామని తెలిపారు. పార్టీ సీనియర్ నేత, దివంగత మల్లు అనంతరాములు కుమారుడు రమేష్ మృతికి పార్టీ సంతాపం తెలిపిందని చెప్పారు.

50 శాతానికిపైగా గెలవాలి

- 'మున్సిపల్' కార్యాచరణ రూపొందించుకున్న కాంగ్రెస్ పార్టీ
- గత సమావేశాలకు భిన్నంగా సాగర్‌లో టీపీసీసీ ముఖ్యుల భేటీ
- ఎమ్మెల్యేలు వీరయ్య, రాజగోపాల్‌రెడ్డి గైర్హాజరు
- సోదరుడి మరణంతో రాలేకపోయిన భట్టి
- 70కి పైగా మున్సిపాలిటీల్లో పాగా వేసేలా పని చేయాలని దిశానిర్దేశం
- ఎమ్మెల్యే జగ్గారెడ్డి ఫైర్ మినహా అంతా ప్రశాంతం

సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న పురపాలిక ఎన్నికల్లో సత్ఫలితాలు సాధించే దిశగా ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ కార్యాచరణ రూపొందించుకుంది. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నాగార్జున సాగర్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గం, ఆఫీస్ బేరర్లు, డీసీసీ అధ్యక్షుల సమావేశంలో మున్సిపల్ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా చర్చ జరిగింది. ఇందులో భాగంగా మున్సిపాలిటీలు, జిల్లాల వారీగా త్వరలోనే సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని, సెలెక్ట్ అండ్ ఎలక్ట్ విధానంలో అభ్యర్థులను ఎంపిక చేసుకోవాలన్న టీపీసీసీ.. మున్సిపల్ ఎన్నికల్లో గెలుపు బాధ్యతను పార్టీలోని ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, కీలక నేతలంతా తీసుకోవాలని నిర్ణయించింది. ఎట్టి పరిస్థితుల్లో 50 శాతానికి పైగా మున్సిపల్ పీఠాలను దక్కించుకోవాలని, కనీసం 70 స్థానాల్లో పాగా వేయాలనే వ్యూహంతో కార్యాచరణ రూపొందించుకున్నామని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమకుమార్ వెల్లడించారు. గత సమావేశాలకు భిన్నంగా సాగర్‌లో జరిగిన సమావేశంలో టీపీసీసీ పెద్దలు దిశానిర్దేశం చేశారన్నారు. మున్సిపాలిటీల వారీగా వ్యూహాలు సిద్ధం చేసుకునేందుకు త్వరలోనే సమావేశాలు నిర్వహిస్తామని, ఈసారి ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చూపిస్తామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాగా, సమావేశంలో భాగంగా రాహుల్ రాజీనామా, గోదావరి-కృష్ణా నదుల అనుసంధానంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనలు, సెక్రటేరియట్ కూల్చివేత అంశాలను కూడా చర్చించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. పులిచింతల, పోతిరెడ్డిపాడు విషయాల్లో నాటి వైఎస్సార్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను వ్యతిరేకించిన కేసీఆర్ ఇప్పుడు గోదావరి నీళ్లను శ్రీశైలానికి తరలించే ప్రతిపాదన చేయడాన్ని తప్పుపట్టారు. అలాగే ప్రస్తుతమున్న సచివాలయ భవనాలను కూల్చవద్దని, ఇతర అవసరాలకు ఉపయోగించుకోవాలని కూడా కాంగ్రెస్ నేతలు అభిప్రాయపడ్డారు. ఇందులో భాగంగా సోమవారం సచివాలయాన్ని, త్వరలోనే ఉస్మానియా ఆసుపత్రిని సందర్శించాలని నిర్ణయించారు.

ఎవరి ప్రాంతాల్లో వారికే బాధ్యతలు...

సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డి మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించే బాధ్యతను ఆయా ప్రాంతాల్లోని నేతలకు మాత్రమే అప్పగించాలని, కమిటీల పేరుతో ఇతరులను పంపి గందరగోళం చేయవద్దని కోరారు. ఈ సందర్భంలో టీపీసీసీ ప్రొటోకాల్ విభాగం చైర్మన్ హర్కర వేణుగోపాల్ కల్పించుకుని మాట్లాడబోగా, జగ్గారెడ్డి ఆయనపై మండిపడినట్లు సమాచారం. తాను మాట్లాడేటప్పుడు జోక్యం చేసుకోవద్దని ఆయన సీరియస్ అయినట్లు తెలిసింది.

ఒకరిద్దరు మినహా...

మున్సిపల్ ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా సాగర్‌లో నిర్వహించిన సమావేశానికి ఒకరిద్దరు మినహా దాదాపు నేతలంతా హాజరయ్యారు. ఆరుగురు ఎమ్మెల్యేలకు గాను శ్రీధర్‌బాబు, సీతక్క, జగ్గారెడ్డి హాజరు కాగా, పొడెం వీరయ్య మాత్రం రాలేదు. పార్టీ షోకాజ్ నోటీసులందుకున్న రాజగోపాల్‌రెడ్డి కూడా గైర్హాజరయ్యారు. ఇక, తన సోదరుడు రమేశ్ మరణించడంతో ఆయన భౌతికకాయాన్ని తీసుకువచ్చేందుకు ముంబై వెళ్లిన సీఎల్పీ నేత భట్టి విక్రమార్క కూడా సమావేశానికి రాలేకపోయారు. పార్టీ రాష్ట్ర ఆఫీస్ బేరర్లు, ముగ్గురు ఎంపీలు, ముగ్గురు వర్కింగ్ ప్రెసిడెంట్లు, సీనియర్ నేతలంతా ఈ సమావేశానికి హాజరు కావడం, ఎలాంటి గందరగోళం లేకుండా సమావేశం సజావుగా జరగడంతో కాంగ్రెస్ వర్గాలు ఊపిరి పీల్చుకున్నాయి.

మలబద్ధకమా? మంటా? దురదా? రక్తస్రావమా? నొప్పి?
అయితే మూల శంక / ఆసన పగుళ్ళు / భగందరము కావచ్చు!
ప్రారంభంలోనే చికిత్స చేయటానికి సుముఖమైన
ప్రతి రోజు 3 క్యాప్సూల్స్
హెడన్‌సా
అయిన్‌మెంట్ & క్యాప్సూల్స్‌లతో
HADENSA
శస్త్రచికిత్సను మానండి / గర్భం సమయంలో కూడా వాడవచ్చును
రక్తస్రావాన్ని అరికట్టుతుంది, రక్తనాళాల వాపును తగ్గిస్తుంది, సుఖవిరోచనకారి
ఆకలిని పెంచుతుంది, జీర్ణశక్తిని వృద్ధి చేయును, కాలేయము (లివర్)ను బాగా పనిచేయుటను ప్రేరేపించును
Tel/CP

Window of opportunity for
MERITORIOUS STUDENTS
who qualified IIT-JEE MAINS
or scored above 90% in +2
or good ranking in EAMCET;
seek to join the community of
future Engineers / Pharmacist that experience
state of art infrastructure
with passionate, committed and innovative Faculty
can avail Scholarships at Bharat Institutions
For details visit: www.biet.ac.in
Parent & students are invited to visit and tour the campus
Consultants / Brokers / Agents are not entertained
Courses offered
B.Tech: CSE, ECE, EEE, CS/IT, MECH, CIVIL
M.Tech: CSE, VLSI, PEED, CAD/CAM, EPE, WMC, STRUCTURAL
B.Pharm: Pharm D, Pharm D PB
M.Pharm: Pharmaceutics, Pharmacology, Pharm Practice, PA & QA
BHARAT Institute of Engineering & Technology
Institute of Technology (Pharmacy)
Campus: Mangalpally (V), Ibrahimpatnam (M), R.R. Dist. 501 510.
HO: 6309 448 896, 9963 479 773

ఈసెట్ కౌన్సెలింగ్‌లో 8,460 మందికి సీట్లు

ఫైల్

సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్, ఫార్మసీ ద్వితీయ సంవత్సరాల్లో (లేటరల్ ఎంట్రీ) ప్రవేశాల కోసం నిర్వహించిన ఈసెట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌లో 8,460 మంది (83.56 శాతం) విద్యార్థులకు సీట్లు లభించాయి. రాష్ట్రంలోని 173 ఇంజనీరింగ్ కాలేజీల్లో డిప్లొమా పూర్తయిన విద్యార్థులకు లేటరల్ ఎంట్రీ కింద ఇంజనీరింగ్‌లో 9,119 సీట్లు అందుబాటులో ఉండగా 8,396 సీట్లు (92.07 శాతం) భర్తీ అయ్యాయి. 120 ఫార్మసీ కాలేజీల్లో 1005 సీట్లు అందుబాటులో ఉండగా 64 సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. సీట్లు పొందిన విద్యార్థులు జూలై 4వ తేదీలోగా ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలని ప్రవేశాల క్యాంపు అధికారి శ్రీనివాస్ తెలిపారు. చివరి దశ కౌన్సెలింగ్ తరువాతే విద్యార్థులు కాలేజీల్లో నేరుగా రిపోర్టు చేయాలని సూచించారు.

'బీజీ-3' అమ్మితే ఏడేళ్ల జైలు

- చట్టాలకు పదును పెడుతున్న వ్యవసాయ శాఖ
- అమాయక రైతులకు అంటగడుతున్న దళారులు
- పలుచోట్ల దళారులకు వంతపాడుతున్న అధికారులు
- ఉమ్మడి పాలమూరు, ఆదిలాబాద్ జిల్లాల్లో ఎక్కువ సాగు

సాక్షి, హైదరాబాద్: నిషేధిత బీజీ-3 పత్తి విత్తనం అమ్మితే ఏడేళ్లు జైలు శిక్ష విధించేలా చట్టం చేసేందుకు తెలంగాణ వ్యవసాయశాఖ కసరత్తు చేస్తుంది. పర్యావరణ పరిరక్షణ (ఈపీ) చట్టం 1986 రూల్ 13 ప్రకారం పర్యావరణానికి హాని కలిగించే విత్తనాలు విక్రయిస్తే ఏడేళ్ల జైలుతోపాటు లక్ష రూపాయల వరకు జరిమానా విధించే అవకాశం ఉంది. ఈసారి ఈ చట్టాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ అమలు చేయాలని వ్యవసాయశాఖ యోచిస్తుంది. ప్రస్తుతం 1966 విత్తన చట్టం ప్రకారమే కేసులు నమోదు చేస్తున్నారు. ఈ చట్టం వల్ల నకిలీ, కల్తీ పత్తి విత్తనాలు విక్రయిస్తే కేవలం రూ. 500 జరిమానా, ఏడాది వరకు జైలు శిక్ష విధించే అవకాశముంది. గతేడాది నకిలీ, కల్తీ పత్తి విత్తనాలు విక్రయించిన, తయారుచేసిన వారిపై కేసులు నమోదయ్యాయి. చాలా మందిని అరెస్టు చేశారు. ఈసారి అంత కుమించి ఏడేళ్ల జైలు శిక్ష పడేలా చర్యలు తీసుకుంటేనే దీన్ని అరికట్టగలమన్న భావనలో సర్కారు ఉంది. పైగా పర్యావరణ చట్టాలు అత్యంత కఠినంగా ఉంటాయి.

రైతులూ జాగ్రత్త!

బీజీ-3 పత్తి విత్తనాలు కొనుగోలు చేసేముందు రైతులు కూడా జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయశాఖ విజ్ఞప్తి చేస్తుంది. ఈ విత్తనాలు జీఎం (జెనిటికల్లీ మోడిఫైడ్) అని, వీటిని సాగు చేసినందుకుగాను ఇటీవల మహారాష్ట్రలోని అకోలా జిల్లాకు చెందిన రైతులపై కేసులు కూడా నమోదయ్యాయి. అయితే రైతులను దళారులు మోసపుచ్చి బీజీ-3 విత్తనాలను అంటగడుతున్నారు. అయితే చాలా మంది రైతులకు ఈ విత్తనంపై అవగాహన లేకపోవడం, కలుపురాదని ఎక్కువ దిగుబడి వస్తుందని ప్రచారం చేస్తూ అక్రమార్కులు వారికి అంటగడుతున్నారు. ఈ పత్తి విత్తనాలు వేస్తే అత్యంత ప్రమాదకరమైన గ్లైఫోసేట్ పురుగుమందు వినియోగించాలి. ఇది జీవ వైవిధ్యాన్ని దెబ్బతీసేవని, క్యాన్సర్‌కు కారకమని నిపుణులు హెచ్చరిస్తూనే ఉన్నారు. బీజీ-3 విత్తనాల విక్రయాలు రాష్ట్రంలో చాపకిందనీరులా జరుగుతున్నాయి. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లోకి విచ్చలవిడిగా సరఫరా అవుతోంది. గత ఏడాది 694 శాంపిళ్లను పరీక్షించగా, 119 శాంపిళ్లలో బీజీ-3 లక్షణాలున్నట్లు నిర్ధారించారంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఈ ఏడాది జూన్ 2వ తేదీ వరకు బీజీ-3 లక్షణాలున్న విత్తనాలను నిర్ధారించేందుకు 17 శాంపిళ్లను పరీక్షించగా అందులో 8 శాంపిళ్లు బీజీ-3గా తేలినట్లు వ్యవసాయశాఖ వెల్లడించింది. ఇప్పటికే 16 మందిని అరెస్ట్ చేశారు. ఆరుగురు డీలర్ల లైసెన్స్‌లను కూడా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. 112 క్వింటాళ్ల పత్తి విత్తనాలు సీజ్ చేయగా, 56,122 క్వింటాళ్ల విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు వ్యవసాయశాఖ లెక్కలు వెల్లడిస్తున్నాయి.

గణనీయంగా పత్తి సాగు

ఈసారి ఇప్పటి వరకు సాగైన పంటల్లోనూ పత్తిదే అగ్రస్థానంగా ఉంది. ఇటీవల విడుదల చేసిన వ్యవసాయశాఖ నివేదిక ప్రకారం ఇప్పటివరకు 11 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుండగా.. అందులో అత్యధికంగా పత్తి 8.50 లక్షల ఎకరాల్లో సాగైంది. గతేడాది బీజీ-3 విత్తనం సాగు చేసినందుకు 45 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఒకరకంగా చెప్పాలంటే కొందరు దళారులు, వ్యాపారులు, కొందరు అధికారుల నిర్లక్ష్యంతో బీజీ-3 విత్తన అడ్డాగా రాష్ట్రం మారింది. బీజీ-2 విత్తనం విఫలం కావడంతో కొన్ని కంపెనీలు ప్రమాదకరమైన బీజీ-3 విత్తనాన్ని రైతులకు అంటగడుతున్నాయి. ఇప్పటికే వివిధ జిల్లాల్లో టాస్క్ ఫోర్స్ టీమ్స్ పనిచేస్తున్నప్పటికీ దళారులు, అక్రమార్కులు ఈ ప్రమాదకరమైన విత్తనాలను అన్నదాతలకు పెద్దమొత్తంలోనే విక్రయించినట్లు తెలిసింది. ఈ విషయాన్ని వ్యవసాయశాఖ వర్గాలే ధ్రువీకరించడం గమనార్హం. ముఖ్యంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాల్లో బీజీ-3 విత్తన పంట చాపకింద నీరులా విస్తరిస్తోంది. గుజరాత్, మహారాష్ట్ర నుంచి సరఫరా కావడంతో పాటు మన రాష్ట్రంలో కూడా రైతుల పొలాల్లోనే బీజీ-3 పత్తి విత్తన పంటను సాగు చేయించి, అక్రమ వ్యాపారులు ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారు.

మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ
తెలంగాణ ప్రభుత్వం
ఫోన్ నం.040-23733848, ఇ-మెయిల్ ID: tgwdcw@gmail.com
అన్ని ప్రభుత్వ మరియు ప్రభుత్వేతర సంస్థలచే అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ICC) నమోదు కొరకు ప్రకటన
10 మంది కంటే ఎక్కువ లేదా దానికి సమానమైన ఉద్యోగులు గల ప్రభుత్వ/ ప్రభుత్వేతర సంస్థలు/ కంపెనీలన్నీ పని ప్రదేశంలో లైంగిక వేధింపుల ఫిర్యాదుల పరిష్కారానికి అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ICC) ఏర్పాటు చేయాలని పని ప్రదేశంలో మహిళల లైంగిక వేధింపుల (నిరోధం, నిషేదం మరియు పరిష్కారం) చట్టం, 2013, చట్టంలోని సెక్షన్ (4) నిర్దేశిస్తోంది.
అంతర్గత ఫిర్యాదుల కమిటీ (ICC) నమోదుకు మహిళాభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ, తెలంగాణ ప్రభుత్వం వెబ్‌పోర్టల్ "http://tshebox.tgwdcw.in/" ను ప్రారంభించింది. ICCs వివరాలను T-She బాక్స్ వెబ్‌సైట్ ద్వారా కంపెనీ యొక్క HR చే నమోదు చేయబడాలి. అన్ని ICCs 15.07.2019న లేదా ఆలోగా నమోదు ప్రక్రియను పూర్తి చేయవలెను.
నమోదు ప్రక్రియ పూర్తి చేయటలో విఫలమైతే డిఫాల్టర్‌కు రూ.50,000/- జరిమానాగా విధించబడును.
సం/- విజియేందిర బోయి, డైరెక్టర్
DIPR RO.No.208-PP/CL/Advt/1/2019-20, Dt: 29.06.2019

తుది తీర్పుకు లోబడే
తెలుగు నిర్మాతల మండలి ఎన్నిక

- మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన హైకోర్టు
- నేడు నిర్మాతల మండలి ఎన్నిక

సాక్షి, హైదరాబాద్: తెలుగు నిర్మాతల మండలి ఎన్నిక తాము ఇచ్చే తుది తీర్పునకు లోబడి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ ఎ.రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. 2019-21 సంవత్సరానికి తెలుగు నిర్మాతల మండలికి జరుగుతున్న ఎన్నికల్లో కోశాధికారి పోస్టుకు తాను దాఖలు చేసిన నామినేషన్‌ను తిరస్కరించడాన్ని సవాలు చేస్తూ యలమంచిలి రవిచంద్ హైకోర్టులో పిట

1994 జూలై 1న పాలస్తీనా నేత యాసర్ అరాఫత్ 27 ఏళ్ల తర్వాత ప్రవాసం నుంచి స్వదేశానికి తిరిగి వచ్చారు.

టోర్నడో తరహాలో సుడులు తిరుగుతున్నట్లుగా వివిధ రంగుల్లో కనువిందు చేస్తున్న ఈ కళాకృతిని ప్లాస్టిక్ వ్యర్థాల నుంచి తయారు చేశారు. 'టు హీ' అనే సామాజిక సేవా సంస్థ ప్లాస్టిక్స్ ప్లానెట్ పేరిట వియత్నాం రాజధాని హనోయ్‌లో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌లో దీన్ని ప్రదర్శించింది.

భూటాన్‌లో టీచర్లకే అగ్ర తాంబూలం

భూటాన్ ప్రభుత్వం నూతన వేతన సవరణలో విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేసింది. ప్రధాని లియోంచన్ లొటే సెరింగ్ నాయకత్వంలో వేతన సవరణపై ఇటీవల జరిగిన సమావేశంలో తీసుకున్న ఈ సంచలన నిర్ణయంతో దేశంలో ఉపాధ్యాయులు, వైద్యుల వేతనాలు సివిల్ సర్వీసు ఉద్యోగుల వేతనాల కంటే ఎక్కువవుతాయి. ఇంతకుముందు ప్రతిభ ఆధారిత ప్రోత్సాహకాలిచ్చిన ప్రధాని సెరింగ్... తాజాగా విద్య, వైద్య సిబ్బంది వేతనాలను భారీగా పెంచారని భూటాన్ మీడియా వెల్లడించింది. తాజా పెంపు ప్రకారం పదేళ్లకన్నా తక్కువ అనుభవం ఉన్న టీచర్లకు 35 శాతం వృత్తి భత్యం ఇస్తారు. 10-20 ఏళ్ల సర్వీసు ఉన్న వారికి 45 శాతం, 20 ఏళ్లకు మించి సర్వీసు ఉన్న వారికి 55 శాతం వృత్తి భత్యం చెల్లిస్తారు. దీంతోపాటు భూటాన్ ప్రభుత్వం అనుసరిస్తున్న వృత్తిపరమైన ప్రమాణాల మేరకు వీరికి అనుభవాన్నిబట్టి 10 నుంచి 20 శాతం భత్యం అదనంగా లభిస్తుంది. అలాగే ఎంబీబీఎస్ డాక్టర్లకు 45 శాతం, స్పెషలిస్టులకు 55 నుంచి 60 శాతం వృత్తి భత్యం ఇస్తారు. నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి అనుభవాన్ని బట్టి 35 నుంచి 55 శాతం భత్యం లభిస్తుంది. దీని ప్రకారం లెక్కేస్తే... పదేళ్ల అనుభవం ఉన్న టీచరు, పీ5 గ్రేడ్ డాక్టర్‌కు 29,935 గల్‌ట్రమ్ (ఎన్‌యూ-భూటాన్ కరెన్సీ) కంటే ఎక్కువ జీతం వస్తుంది. పీ3 సివిల్ సర్వీసు అధికారి జీతం 28,315 గల్‌ట్రమ్. ప్రభుత్వంలో డైరెక్టర్ హోదాలో ఉన్న ఐఏఎస్‌కు 44,120 ఎన్‌యూ వేతనం ఉంటే పీ2 గ్రేడ్ టీచర్, డాక్టర్ల జీతం 46,835 ఎన్‌యూలకుపైగా ఉంటుంది. భూటాన్ ప్రభుత్వంలో అత్యధిక వేతనం పొందే ఉద్యోగం కేబినెట్ సెక్రటరీ. ఆయనకు 82 వేలకుపైగా జీతం వస్తుంది. తాజా వేతన సరవణలో ఈఎస్1 గ్రేడ్ పొందిన డాక్టర్లు 90 వేలకుపైగా జీతం పొందుతారు.

మండలి డిప్యూటీ చైర్మన్‌కు సీఎం కేసీఆర్ జన్మదిన శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: శాసన మండలి డిప్యూటీ స్పీకర్ నేతి విద్యాసాగర్ తన జన్మదినం సందర్భంగా శనివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ప్రగతిభవన్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన సీఎం కేసీఆర్.. పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించారు. పలువురు ఎమ్మెల్సీలు, టీఆర్ఎస్ నేతలు విద్యాసాగర్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

బీజేపీలోకి చంద్రబాబే పంపించారు

భట్టి విక్రమార్క ప్రతిపక్ష నాయకుడిగా పనికిరారు: తలసాని

సాక్షి, హైదరాబాద్: టీడీపీ రాజ్యసభ సభ్యులను ఆ పార్టీ అధినేత చంద్రబాబే స్వయంగా బీజేపీలోకి పంపించారని రాష్ట్ర పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆరోపించారు. శనివారం టీఆర్ఎస్ శాసనసభా పక్షం కార్యాలయంలో మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. పార్టీ ఫిరాయింపులను వ్యతిరేకించిన ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుతోనే టీడీపీ రాజ్యసభా పక్షాన్ని విలీనం చేస్తూ బీజేపీ బులెటిన్ విడుదల చేయించిందని ఆరోపించారు. రాష్ట్రంలో తామే ప్రత్యామ్నాయం అని 25 ఏళ్లుగా చెబుతున్న బీజేపీకి గతేడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ శాసనసభ్యుల సంఖ్య 5 నుంచి ఒకటికి పడిపోయిన విషయాన్ని గుర్తు చేశారు. కాలం చెల్లిన నాయకులను పార్టీలో చేర్చుకుంటూ బీజేపీ నేతలు కలలు కంటూ అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని ఎద్దేవా చేశారు. సచివాలయం, అసెంబ్లీకి నూతన భవన నిర్మాణాల గురించి టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లు భట్టి విక్రమార్క విమర్శలను ప్రస్తావిస్తూ.. ప్రభుత్వ నిర్ణయాలను వ్యతిరేకించడం కాంగ్రెస్ నేతలకు అలవాటుగా మారిందన్నారు. సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణానికి ఎవరి సలహాలు తీసుకోవాల్సిన అవసరం తమకు లేదని స్పష్టం చేశారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సీఎంలు రెండు రాష్ట్రాల నడుమ వివాదాల పరిష్కారానికి పూనుకోవడం చరిత్రాత్మకమన్నారు. సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాన్ని విమర్శిస్తున్న వారే.. ఆ తర్వాత కొత్త భవనాల ముందు ఫొటోలు దిగుతారని మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ ఎద్దేవా చేశారు. సచివాలయం నిర్మాణంపై ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన విమర్శలను ఆయన ఖండించారు. ముంబైలో శివాజీ, గుజరాత్‌తో సర్దార్ పటేల్ విగ్రహాల కోసం రూ.వేల కోట్లు వెచ్చించిన వారు.. తెలంగాణకు కొత్త అసెంబ్లీ, సచివాలయం భవనాల నిర్మాణంపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని అన్నారు.

ఫీజులు పెంచకుండా చూడండి: జాజుల



సాక్షి, హైదరాబాద్: ఇంజనీరింగ్ కాలేజీలు ఫీజులను పెంచకుండా చర్యలు తీసుకోవాలని, పేద విద్యార్థులకు అన్యాయం జరగకుండా చూడాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కోరారు. ఈ మేరకు తెలంగాణ అడ్మిషన్, ఫీ రెగ్యులేటరీ కమిటీ చైర్మన్ జస్టిస్ స్వరూపరెడ్డిని కలిసి వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం దేశంలో ఏక్కడా లేని విధంగా మన రాష్ట్రంలో ఫీజును ఒకేసారి 40 శాతానికి పెంచుతున్నారన్నారు. దీంతో పేద బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టు తీర్పును అడ్డం పెట్టుకుని ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేసేందుకు కొన్ని ప్రైవేటు కళాశాలలు కుట్ర చేస్తున్నాయని ఆరోపించారు. విద్య అనేది సామాజిక సేవ అనే భావనను తప్పించి ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల యజమాన్యాలు వ్యాపారం చేస్తున్నాయన్నారు. ఇప్పటి వరకు ఇంజనీరింగ్ కౌన్సెలింగ్ చేపట్టకుండా, కోర్టు తీర్పు కోసం ప్రభుత్వం ఎదురు చూడటం వల్ల విద్యార్థులు విద్యా అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉందని, తక్షణమే కౌన్సెలింగ్, వెబ్ ఆప్షన్ల ప్రక్రియ ప్రారంభించాలన్నారు.

గీతపని కార్మికుల సమస్యలపై మంత్రికి వినతి

సాక్షి, హైదరాబాద్: గీత పనివారి ఎక్స్‌గ్రేషియా కేసుల పరిష్కారంలో మెడికల్ బోర్డు సర్టిఫికెట్ నిబంధనలు ఎత్తివేయడం, బకాయిలు చెల్లించడం వంటి తదితర సమస్యలపై ఎక్సైజ్‌శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు తెలంగాణ గీత పని కార్మికుల సంఘం శనివారం వినతిపత్రం అందించింది. ఈ అంశాలను పరిశీలించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారని ఈ సంఘ అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్ తెలిపారు. చెట్టు పన్ను రద్దు చేస్తున్న ట్లు ప్రకటించినా, గ్రామాల్లో గీత వృత్తిదారుల నుంచి బలవంతంగా వసూలు చేస్తున్నారని, 560 జీవో ప్రకారం అన్ని సొసైటీలకు పదేకరాలు కేటాయించా లని మంత్రి దృష్టికి తీసుకొచ్చినట్లు ఆయన తెలియజేశారు.

'హేతుబద్ధీకరణ ప్రతిపాదన విరమించుకోండి'

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రపతి ఉత్తర్వుల సవరణను తెప్పించి ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు, టీఆర్టీ నియామకాలు జరపాలని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ప్రభుత్వాన్ని కోరింది. శనివారం టీపీటీఎఫ్ అధ్యక్షుడు అశోక్‌కుమార్ అధ్యక్షతన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అశోక్‌కుమార్ మాట్లాడుతూ పాఠశాలలు, ఉపాధ్యాయుల హేతుబద్ధీకరణ ప్రతిపాదనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు.

దివ్యాంగులకు కల్యాణ లక్ష్మి సాయం పెంపు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం కల్యాణ లక్ష్మి/షాదీ ముబారక్ పథకంపై మరో కీలక నిర్ణయం తీసుకుంది. దివ్యాంగ వధువులకు ఈ పథకం కింద ఆర్థిక సాయాన్ని 25 శాతం పెంచింది. పేద కుటుంబాలకు చెందిన యువతులకు పెళ్లి కానుకగా 'కల్యాణ లక్ష్మి'పేరిట తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.1,00,116 అందజేస్తుండగా, ఇక నుంచి దివ్యాంగులైన పెళ్లి కూతురు తల్లి బ్యాంకు ఖాతాలో రూ.1,25,145 నగదు జమ చేయాలని నిర్ణయించింది. ఈమేరకు ప్రభుత్వ కార్యదర్శి బి.వెంకటేశం శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

రాహుల్‌కు తోడుగా..!

రాజీనామాల బాటలో టీపీసీసీ నేతలు

- వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రేవంత్ రాజీనామా...అదే బాటలో వీహెచ్
- ఇప్పటికే పొన్నం రాజీనామా... రాహుల్ స్ఫూర్తితోనేనని రేవంత్ ప్రకటన
- ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహించడం కోసమేనంటూ ఉత్తమ్‌ను ఇరుకున పెట్టే యత్నం
- కుంతియా వ్యవహారశైలిని రాజీనామా లేఖలో తప్పుపట్టిన వీహెచ్
- పార్టీలో గ్రూపులు ప్రోత్సహిస్తున్నారని అధిష్టానానికి ఫిర్యాదు
- త్వరలోనే పార్టీ వ్యవహారాల ఇంచార్జి మార్పు జరిగే అవకాశం

సాక్షి, హైదరాబాద్ : ఏఐసీసీ అధినేత రాహుల్‌గాంధీకి మద్దతుగా రాష్ట్రంలో రాజీనామాల పర్వం కొనసాగుతోంది.రాహుల్‌గాంధీ తన నిర్ణయాన్ని మార్చుకుని ఏఐసీసీ పగ్గాలు చేపట్టాలని కోరుతూ టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే రాజీనామా చేయగా, మరో వర్కింగ్ ప్రెసిడెంట్, మల్కాజ్‌గిరి ఎంపీ ఎ.రేవంత్‌రెడ్డి కూడా రాహుల్‌కు అండగా నిలిచారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు కూడా తన రాజీనామా లేఖను అధిష్టానానికి పంపారు. దీంతో రాహుల్‌కు మద్దతుగా ఇద్దరు వర్కింగ్ ప్రెసిడెంట్లకు తోడు మరో సీనియర్ నేత రాజీనామా చేసినట్టయింది. మరికొందరు నేతలు కూడా నేడో, రేపో రాజీనామాలు సమర్పించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

రాహుల్ స్ఫూర్తితోనే

కాంగ్రెస్ ఫైర్‌బ్రాండ్ రేవంత్‌రెడ్డి అనూహ్యంగా తన రాజీనామాను ప్రకటించారు. ఎన్నికల్లో ఓటమి పాలయినప్పుడు కీలక హోదాల్లో ఉన్న నేతలు బాధ్యత వహించాలన్న రాహుల్‌గాంధీ స్ఫూర్తిగా తీసుకుని తాను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు శనివారం ఆయన వెల్లడించారు. ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తూ పార్టీ పదవులను త్యజించాల్సిందేననే కోణంలో ఆయన చేసిన రాజీనామా టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని ఇరుకున పెట్టేదేనని పార్టీ వర్గాలంటున్నాయి. ముందస్తు ఎన్నికల నుంచి అన్ని ఎన్నికల్లోనూ వరుసగా పార్టీ ఓటమి పాలవుతున్నా రాజీనామాను ప్రకటించని ఉత్తమ్ వైఖరిని రేవంత్ రాజీనామా ప్రశ్నించిందనే చర్చ పార్టీ వర్గాల్లో జరుగుతోంది. అయితే, ఎన్నికల్లో ఓటమికి బాధ్యత వహిస్తూ రాజీనామా చేస్తే ఫలితాలు వెలువడిన వెంటనే చేయకుండా రాహుల్‌కు మద్దతుగా చేయడమేమిటనే ప్రశ్న కూడా

రేవంత్ శిబిరం వైపు కొందరు వేలెత్తి చూపుతున్నారు. మొత్తంమీద రాజకీయంగా ఎప్పుడూ వార్తల్లో ఉండే రేవంత్ ఈసారి కూడా తనదైన శైలిలో రాజీనామాను ప్రకటించి అటు పార్టీలోనూ, ఇటు అధిష్టానం దృష్టిలోనూ చర్చనీయాంశం కావడం గమనార్హం.

త్వరలోనే మార్పు

కాగా, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి ఆర్.సి.కుంతియా స్థానంలో త్వరలోనే మరో నేత వస్తారనే ప్రచారం గాంధీభవన్ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఏఐసీసీ కోర్‌కమిటీ పార్టీ పునర్వ్యవస్థీకరణపై దృష్టి పెట్టిందని, అందులో భాగంగా వచ్చే నెల 1,2 తేదీల్లో త్వరలోనే ఎన్నికలు జరగనున్న ఢిల్లీ, హరియణా, మహారాష్ట్రల సమీక్ష ఉంటుందని, ఆ తర్వాత తెలంగాణ రాష్ట్రంపైనే అధిష్టానం దృష్టి పెడుతుందని అంటున్నారు. అదే జరిగితే వచ్చే నెల మొదటి వారంలోపు కుంతియా మార్పు తథ్యమని చెపుతున్నారు.

కుంతియాపై ఫిర్యాదు

రాహుల్‌కు మద్దతుగా నిలుస్తూ పార్టీలోని అన్ని పదవులకు రాజీనామా చేస్తున్నానని అధిష్టానానికి ఫ్యాక్స్ పంపిన మాజీ ఎంపీ వీహెచ్ కూడా తన రాజీనామా లేఖలో ట్విస్ట్ పెట్టారు. ఎన్నికల్లో ఓటమికి బాధ్యత రాహుల్ ఒక్కరిదే కాదని, అందరూ నేతలు ఆ బాధ్యతను తీసుకోవాలని తన రాజీనామా లేఖలో చెప్పిన వీహెచ్ అదే లేఖలో పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జి కుంతియాపై అధిష్టానానికి పరోక్షంగా ఫిర్యాదు చేశారు. 'ఒక రాష్ట్రంలో ఎన్నికల ఫలితాలకు ఆ రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇంచార్జి ప్రాథమికంగా బాధ్యత వహించాల్సి ఉంటుంది. ఇంచార్జుల విధి నిర్వహణలో జవాబుదారీతనం, పారదర్శకత ఉండాలి. వారు పార్టీ కార్యకర్తలందరినీ కలుపుకుని పోతున్నారా లేక పార్టీలోని ఓ వర్గంతో కుమ్మక్కయ్యారా అనేది కూడా చూడాలి. క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితిపై సరైన రిపోర్టు ఇస్తున్నారా లేదా చూడాలి. అలాకాకుండా ఒక్క ఇంచార్జి ఇచ్చే రిపోర్టులను గుడ్డిగా పార్టీ నాయకత్వం నమ్మకుండా ఉండాల్సింది.' అని ఆయన కుంతియా వ్యవహారశైలిపై అధిష్టానానికి ఫిర్యాదు చేయడం గమనార్హం.

గుర్తింపులేని బీసీ కులాలపై 5 వరకు విచారణ

బీసీ జాబితాలో చేర్చే విషయంలో విజ్ఞప్తులు, ఆక్షేపణల స్వీకరణ

సాక్షి, హైదరాబాద్: గుర్తింపులేని 30 కులాలను బీసీ జాబితాలో చేర్చాలని వచ్చిన వినతులను విచారించడంలో భాగంగా వచ్చేనెల 5 వరకు బహిరంగ విచారణ, ప్రజాభిప్రాయసేకరణ కొనసాగుతుందని తెలంగాణ బీసీ కమిషన్ మెంబర్ సెక్రటరీ బి.వెంకటేశం తెలిపారు. విచారణలో భాగంగా ఎవరైనా వ్యక్తులు, సంస్థలు, సంఘాలు విజ్ఞప్తులు, సూచనలు, ఆక్షేపణలను రాత పూర్వకంగా, మౌఖికంగా కమిషన్‌కు సమర్పించవచ్చని పేర్కొన్నారు. తమ విజ్ఞప్తులు, సూచనలు, ఆక్షేపణలకు మద్దతుగా వారి వద్ద లభ్యంగా ఉన్న డేటా/అదనపు సామగ్రి సాక్ష్యాలను కమిషన్ సూచించిన నిర్దిష్ట వెరిఫికేషన్ అఫిడవిట్ రూపంలో జతపర్చి అందజేయాలని తెలిపారు.

గుర్తింపులేని కులాలివీ...

కాకిపడగల, మందెచ్చుల, సన్నాయోల్లు / బత్తిన, కుల్ల కడగి, బైల్ కమ్మర, బాగోతుల, బొప్పల, తోలుబొమ్మలాట వాళ్లు, గంజికూటి, శ్రీ క్షత్రియ రామజొగి, ఏనూటి, గుర్రపు, అద్దపు, కడారి సైదరోల్లు, సరగాని, ఓడ్, మాసయ్యలు/పటం, సాధనాశూరులు, రుంజ, పాపల, పనస, పెక్కర, పాండవుల, గౌడ జెట్టి, ఆది కొడుకులు, తెర చీరల, సారోళ్లు, అరవ కోమటి, అహీర్ యాదవ్, గొవిలి కులాలవారు తమను బీసీ జాబితాలో చేర్చాలని కోరుతున్నారు.

టీఆర్ఎస్ సభ్యత్వ నమోదుకు ఇన్‌చార్జీలు

- నేడు తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో భేటీ
- జూలై 20లోగా పూర్తిచేయాలని కేసీఆర్ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర సమితి సభ్యత్వ నమోదుతో పాటు పార్టీ కమిటీల ఏర్పాటును పర్యవేక్షించేందుకు 69 మంది పార్టీ నేతలను పార్టీ అధ్యక్షుడు కేసీఆర్ ఇన్‌చార్జీలుగా నియమించారు. పూర్వపు జిల్లాల పరిధిలోని అసెంబ్లీ నియోజవకర్గాల వారీగా ఇన్‌చార్జీలుగా వ్యవహరించే 69 మంది పార్టీ నేతలను జాబితాలో చేర్చారు. పార్టీ ఎంపీలు, ఎమ్మెల్సీలతో పాటు రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో పాటు కొందరు క్రియాశీల నేతలకు కూడా ఈ కమిటీలో చోటు దక్కింది. సభ్యత్వ నమోదు, పార్టీ కమిటీల ఏర్పాటు ఇన్‌చార్జీలుగా నియమితులైన నేతలు తక్షణమే బాధ్యతలు తీసుకుని, జూలై 20వ తేదీలోగా సభ్యత్వ నమోదు పూర్తి చేయాల్సిందిగా కేసీఆర్ ఆదేశించారు. కాగా అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీలుగా నియమితులైన పార్టీ నేతలతో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఆదివారం ఉదయం తెలంగాణ భవన్‌లో సమావేశమవుతారు. కాగా ఈనెల 27న పార్టీ అధ్యక్షుడి హోదాలో సీఎం కేసీఆర్ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 50వేలు చొప్పున కోటి మంది నుంచి సభ్యత్వ సేకరణను లక్ష్యంగా నిర్దేశించారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు, పార్టీ కమిటీల ఏర్పాటు ప్రక్రియ పూర్తయ్యేంత వరకు కొత్తగా ఇన్‌చార్జీలుగా నియమితులైన నేతలు తమకు కేటాయించిన నియోజకవర్గాల్లోనే ఉండాల్సిందిగా పార్టీ ఆదేశించింది. పార్టీ సభ్యత్వ నమోదుతో పాటు, కమిటీల ఏర్పాటులో పాటించాల్సిన నియమ నిబంధనలపై ఆదివారం జరిగే సమావేశంలో ఇన్‌చార్జిలకు కేటీఆర్ దిశా నిర్దేశం చేస్తారు.

సభ్యత్వ నమోదు ఇన్‌చార్జిలు, నియోజకవర్గాలు..

ఆదిలాబాద్ జిల్లాః
మూల విజయారెడ్డి (చెన్నూరు, మంచిర్యాల), అరిగెల నాగేశ్వర్‌రావు (బెల్లంపల్లి, ఖానాపూర్), నారదాసు లక్ష్మణ్‌రావు (ఆసిఫాబాద్, కాగజ్‌నగర్), లోక భూమారెడ్డి (ఆదిలాబాద్, బోథ్), ఎండీ ఖాజా ముజీబుద్దిన్ (నిర్మల్, ముథోల్)

హైదరాబాద్ జిల్లాః
విప్లవ్ కుమార్ (సనత్‌నగర్), వీకే మహేశ్ (కూకట్‌పల్లి), బండి రమేశ్ (ఖైరతాబాద్), పుటం పురుషోత్తం (ఎల్‌బీనగర్), కంచర్ల చంద్రశేఖర్‌రెడ్డి (ఉప్పల్)
మలిపెద్ది సుధీర్‌రెడ్డి (మల్కాజిగిరి), బక్కి వెంకటయ్య (సికింద్రాబాద్),
చిరుమల్ల రాకేశ్ (కంటోన్మెంట్), రాంబాబు యాదవ్ (ముషీరాబాద్)
పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి (శేరిలింగంపల్లి), తాడూరి శ్రీనివాస్ (జూబ్లీహిల్స్)
జిన్నారం వెంకటేశ్‌గౌడ్ (గోషామహల్), జహంగీర్‌పాషా (చార్మినార్, చాంద్రాయణగుట్ట, నాంపల్లి), తారిక్ అన్సారీ (మలక్‌పేట్, బహదూర్‌పుర)
నిరంజన్ వాలి (కార్వాన్, యాకుత్‌పుర)

కరీంనగర్ జిల్లాః
గూడూరు ప్రవీణ్ (మానకొండూరు, చొప్పదండి), బస్వరాజు సారయ్య (హుజూరాబాద్, హుస్నాబాద్), టి.భానుప్రసాద్‌రావు (సిరిసిల్ల, వేములవాడ),
ఎల్.రూప్‌సింగ్ (జగిత్యాల, కోరుట్ల), గుండు సుధారాణి (కరీంనగర్), కోలేటి దామోదర గుప్తా (ధర్మపురి, పెద్దపల్లి), కర్రా శ్రీహరి (మంథని, రామగుండం)

ఖమ్మం జిల్లాః
పల్లా రాజేశ్వర్‌రెడ్డి (ఖమ్మం, పాలేరు), తాతా మధు (వైరా, మధిర), తెల్లం వెంకట్రావు (భద్రాచలం, పినపాక), రావుల శ్రవణ్‌కుమార్ రెడ్డి (అశ్వారావుపేట, సత్తుపల్లి), నూకల నరేశ్ రెడ్డి (కొత్తగూడెం, ఇల్లందు),

మహబూబ్‌నగర్ జిల్లాః
పోతుగంటి రాములు (కొల్లాపూర్, నాగర్‌కర్నూలు), బి.శ్రీనివాస్ యాదవ్ (అచ్చంపేట, కల్వకుర్తి), ఎండి ఇషాక్ ఇంతియాజ్ (నారాయణపేట, మక్తల్), అందె బాబయ్య (కొడంగల్, మహబూబ్‌నగర్), వాల్యా నాయక్ (దేవరకద్ర, వనపర్తి), చాడ కిషన్‌రెడ్డి (షాద్‌నగర్, జడ్చర్ల), లింగంపల్లి కిషన్‌రావు (అలంపూర్, గద్వాల),

మెదక్ జిల్లా ః
వేలేటి రాధాకృష్ణశర్మ (సిద్దిపేట, దుబ్బాక), గ్యాదరి బాలమల్లు (గజ్వేల్, నర్సాపూర్), చాగన్ల నరేంద్రనాథ్ (మెదక్, అందోలు), శేరి సుభాష్‌రెడ్డి (పటాన్‌చెరు, సంగారెడ్డి), ఎండీ ఫరీదుద్దిన్ (జహీరాబాద్, నారాయణఖేడ్),

నల్లగొండ జిల్లాః
తక్కల్లపల్లి రవీందర్‌రావు (నల్లగొండ, నకిరేకల్), కర్నె ప్రభాకర్ (ఆలేరు, భువనగిరి), కంచెర్ల రామకృష్ణారెడ్డి (మునుగోడు, దేవరకొండ), బడుగు లింగయ్య యాదవ్ (తుంగతుర్తి, సూర్యాపేట), ఎర్నేని వెంకటరత్నం (నాగార్జునసాగర్, మిర్యాలగూడ), వై.వెంకటేశ్వర్లు (కోదాడ, హుజూర్‌నగర్),

నిజామాబాద్ జిల్లాః
ఫారూక్ హుస్సేన్ (నిజామాబాద్ అర్బన్, బోధన్), లోక బాపురెడ్డి (బాల్కొండ, ఆర్మూరు), తుల ఉమ (నిజామాబాద్ రూరల్), దాదన్నగారి విఠల్‌రావు (బాన్సువాడ, జుక్కల్), వి.గంగాధర్‌గౌడ్ (ఎల్లారెడ్డి, కామారెడ్డి)

వరంగల్ జిల్లాః
సత్యవతి రాథోడ్ (నర్సంపేట, పాకాల), బండ ప్రకాశ్ (భూపాలపల్లి, ములుగు),
బి.వెంకటేశ్వర్లు (మహబూబాబాద్, డోర్నకల్), మందుల సామేల్ (పాలకుర్తి, జనగామ), మెట్టు శ్రీనివాస్ (వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు), ఎడవెల్లి కృష్ణారెడ్డి (స్టేషన్‌ఘనపూర్, వర్ధన్నపేట),

రంగారెడ్డి జిల్లా:
శంభీపూర్ రాజు (మేడ్చల్), జోగినపల్లి సంతోష్ (కుత్బుల్లాపూర్), కావేటి లక్ష్మీనారాయణ (ఇబ్రహీంపట్నం), సోమ భరత్ కుమార్ (మహేశ్వరం), గౌండ్ల నాగేందర్‌గౌడ్ (రాజేంద్రనగర్), మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి (వికారాబాద్, చేవెళ్ల), గట్టు రాంచందర్‌రావు (పరిగి, తాండూరు),

సచివాలయ తరలింపునకు కసరత్తు

- రెండు నెలల్లోగా శాఖల తరలింపునకు ముసాయిదా ప్రణాళిక సిద్ధం
- హెచ్‌ఓడీలకే అధిక శాతం కార్యాలయాలు

శాఖ	తరలింపు	వ్యవధి
వ్యవసాయ, సహకార	మార్క్‌ఫెడ్, జామ్‌బాగ్, కోఠి	15 రోజులు
పశుసంవర్ధక, మత్స్య	పశుసంవర్ధక శాఖ డైరెక్టరేట్, శాంతినగర్, మహావీర్ ఆస్పత్రి దగ్గర	4రోజులు
బీసీ వెల్ఫేర్	సంక్షేమ భవన్, శాంతినగర్, మాసబ్‌ట్యాంక్	3 రోజులు
పర్యావరణ, అటవీ శాఖ	అరణ్య భవన్	2 రోజులు
ఉన్నత విద్య	ఎస్ఈఆర్టీ, ఎల్బీ స్టేడియం దగ్గర	నెల రోజులు
ఇంధన	విద్యుత్ సౌధ, సోమాజిగూడ	2 రోజులు
పాఠశాల విద్యాశాఖ	ఎస్ఈఆర్టీ, ఎల్బీ స్టేడియం దగ్గర	నెల రోజులు
పౌర సరఫరాల శాఖ	పౌరసరఫరాల భవనం, ఎర్రమంజిల్	30 రోజులు
ఆర్థిక శాఖ	బీఆర్కే భవన్	10 రోజులు
వైద్యారోగ్య శాఖ	నేచర్ క్యూర్ ఆస్పత్రి, బేగంపేట్	10 రోజులు
హోం	బీఆర్కే భవన్	7 రోజులు
హౌసింగ్	హౌసింగ్ కార్పొరేషన్, హిమాయత్ నగర్	30 రోజులు
నీటిపారుదల	ఈఎన్‌సీ, ఎర్రమంజిల్	7 రోజులు
పరిశ్రమల శాఖ	రాష్ట్ర ఆర్థిక సంఘం భవనం, చిరాగ్‌అలీ లేన్, ఆబిడ్స్	7 రోజులు
న్యాయశాఖ	బీఆర్కే భవన్	8 రోజులు
కార్మిక, ఉపాధి కల్పన శాఖ	కార్మిక శాఖ కమిషనరేట్, టి.అంజయ్య భవనం	5 రోజులు
పురపాలక శాఖ	హైదరాబాద్ గ్రోథ్ కారిడార్/హెచ్ఎంఆర్ఎల్/డీటీసీపీ/డీఎంఏ	6 రోజులు
పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్	రాష్ట్ర ఆర్థిక సంఘం భవనం, చిరాగ్ అలీ లేన్, ఆబిడ్స్	2 రోజులు
ప్రణాళిక శాఖ	బీఆర్కే భవన్	10 రోజులు
రెవెన్యూ	స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ కమిషనరేట్, ఎంజే మార్కెట్	60 రోజులు

సాక్షి, హైదరాబాద్:

కొత్త సచివాలయ నిర్మాణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం వేగిరం చేసింది. ప్రస్తుత సచివాలయంలోని భవనాలన్నింటినీ కూల్చివేసి కొత్త సచివాలయ భవన సముదాయాన్ని నిర్మించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. ఈ క్రమంలో సచివాలయ శాఖల కార్యాలయాల తరలింపునకు ముసాయిదా ప్రణాళికను సిద్ధం చేసింది. సచివాలయంలోని ప్రభుత్వ శాఖల కార్యాలయాలను ఆయా శాఖల పరిధిలోని హెచ్‌ఓడీ కార్యాలయాల భవనాలకు తరలించాలని నిర్ణయం తీసుకుంది. దాదాపు రెండు నెలల వ్యవధిలోగా అన

గోడ కూలి 15 మంది మృతి

- పుణేలో ఘటన
- బాధితులంతా బిహారీలే
- సాయం ప్రకటించిన బిహార్, మహారాష్ట్ర

సాక్షి, ముంబై: మహారాష్ట్రలోని పుణేలో శుక్రవారం అర్ధరాత్రి ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. పుణేలోని కోండవా ప్రాంతంలో ప్రహరీ గోడ కూలి 15 మంది దుర్మరణం చెందారు. భవన నిర్మాణ పనులు చేపట్టేందుకుగాను అల్కాన్ ల్యాండ్‌మార్క్స్, కంచన్ రాయల్ ఎక్సోటికా ప్రాజెక్టు సంస్థలు భారీగా తవ్వకాలు చేపట్టాయి. ఈ పనుల్లో పాల్గొంటున్న బిహార్‌లోని కటిహార్ ప్రాంతానికి చెందిన కూలీలు దాదాపు 20 మంది అక్కడే గుడిసెలు వేసుకుని కుటుంబాలతోపాటు ఉంటున్నారు. ఆ పక్కనే దాదాపు 22 అడుగుల ఎత్తైన ప్రహరీ ఉంది. శుక్రవారం నాటి భారీ వర్షానికి ప్రహరీ బాగా నాని, అర్ధరాత్రి సమయంలో కూలీల గుడిసెలపై కూలి పడింది. గోడతోపాటు అవతలి వైపు పార్కు చేసిన పదుల సంఖ్యలో కార్లు కూడా వారిపై పడిపోయాయి. దీంతో వాటికింద నలిగి 15 మంది కూలీలు అక్కడికక్కడే చనిపోగా ముగ్గురు మాత్రం క్షేమంగా బయటపడ్డారు. వారిలో ఇద్దరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. మృతుల్లో ఏడేళ్లలోపు నలుగురు చిన్నారులు కూడా ఉన్నారు. కాగా, అల్కాన్ ల్యాండ్‌మార్క్స్, కంచన్ రాయల్ ఎక్సోటికా ప్రాజెక్టు సంస్థలు నిర్లక్ష్యంగా వ్యవహరించి ప్రహరీ వరకు తవ్వకాలు చేపట్టడం వల్లనే ఈ ఘటన జరిగిందని మున్సిపల్ కమిషనర్ సారభ్‌రావు తెలిపారు. అల్కాన్ ల్యాండ్‌మార్క్స్, కంచన్ రాయల్ ఎక్సోటికా ప్రాజెక్టు సంస్థలకు చెందిన 8మందిపై ఐపీసీ-304 సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మృతుల కుటుంబాలకు మహారాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు, బిహార్ ప్రభుత్వం రూ.2 లక్షల చొప్పున సాయం ప్రకటించాయి. ఈ విషయమై మంత్రి తానాజీ సావంత్ మాట్లాడుతూ మహారాష్ట్ర ప్రభుత్వం తరఫున రూ.4 లక్షలు, శివసేన పార్టీ తరఫున రూ.లక్ష కలిపి మొత్తం రూ.5 లక్షల ఆర్థిక సాయం బాధిత కుటుంబాలకు అందజేయనున్నట్లు మీడియాకు తెలిపారు. ఈ దుర్ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేయాలని ఆదేశిస్తూ ముఖ్యమంత్రి ఫడ్నవిస్ ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేశారు. వారంలోగా నివేదిక అందజేయాలని కోరారు. ఘటన ప్రాంతంలో భవన నిర్మాణ పనులను నిలిపివేయాలని పుణే మేయర్ ఆదేశించారు.

ఘటనాస్థలిలో కొనసాగుతున్న సహాయక చర్యలు

సమష్టిగా విపత్తు నిర్వహణ

- అంతర్జాతీయ కూటమికి సహకారం అందించండి
- జి20 దేశాలకు ప్రధాని నరేంద్ర మోదీ పిలుపు
- ఆస్ట్రేలియా, టర్కీ సహా ఆరుగురు దేశాధినేతలతో భేటీ

ఒసాకా: విపత్తు నిర్వహణ విషయంలో జి20 బృందం ప్రపంచదేశాలతో కలిసి కూటమిగా ఏర్పడాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. సాధారణంగా విపత్తులు సంభవించినప్పుడు సహాయక చర్యలు, పునరావాసం ఎంత త్వరగా చేపడితే నష్టం అంత తక్కువగా ఉంటుందని తెలిపారు. ఇలాంటి వైపరీత్యాల సమయంలో నిరుపేద ప్రజలే ఎక్కువగా నష్టపోతుంటారని వ్యాఖ్యానించారు. జపాన్‌లోని ఒసాకా నగరంలో జరుగుతున్న జి20 సదస్సులో శనివారం ప్రధాని మోదీ ప్రసంగించారు. 'విపత్తులను తట్టుకునే మౌలికవసతుల కల్పన కోసం అంతర్జాతీయ కూటమితో చేతులు కలపాలని జి20 దేశాలను నేను కోరుతున్నాను. ఈ రంగంలో తమ అనుభవాన్ని, నైపుణ్యాన్ని పంచుకోవాలని ఆహ్వానిస్తున్నాను. రండి.. సురక్షితమైన ప్రపంచం కోసం మనమందరం చేతులు కలుపుదాం' అని మోదీ పిలుపునిచ్చారు. విపత్తులను తట్టుకునే మౌలికవసతుల ఏర్పాటు అన్నది కేవలం అభివృద్ధికి సంబంధించిన విషయం మాత్రమే కాదనీ, ప్రకృతి విపత్తులను ఎదుర్కోవడంలో ఈ మౌలిక వసతులు ఎంతో కీలకమని వ్యాఖ్యానించారు.

బిజీబిజీగా మోదీ.

జి20 సదస్సు చివరి రోజైన శనివారం ప్రధాని మోదీ బిజీబిజీగా గడిపారు. ఇండోనేసియా, బ్రెజిల్, టర్కీ, ఆస్ట్రేలియా, సింగపూర్, చిలీ దేశాల అధినేతలతో వేర్వేరుగా సమావేశమైన మోదీ వాణిజ్యం ఉగ్రవాదంపై పోరు, తీరప్రాంత భద్రత, రక్షణ సహా పలు అంశాలపై చర్చించారు. ఇండోనేసియా అధ్యక్షుడు జోకో విడోడోతో మోదీ తొలిసారి అధికారికంగా సమావేశం అయ్యారు. ఈ భేటీలో వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, తీర భద్రత రంగాల్లో ద్వైపాక్షిక సహకారాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. అనంతరం బ్రెజిల్ అధ్యక్షుడు జైర్ బాల్సోనారోతో వాణిజ్యం, పెట్టుబడులు, వ్యవసాయం, జీవ ఇంధనాలు, వాతావరణ మార్పు వంటి అంశాలపై మోదీ విస్తృత స్థాయిలో చర్చలు జరిపారు. ఆ తర్వాత టర్కీ అధ్యక్షుడు రెసిప్ తయ్యిప్ ఎర్డోగన్‌ను కలుసుకున్నారు. భారత్-టర్కీల మధ్య పటిష్టమైన భాగస్వామ్యం కొనసాగాలని వారు ఆకాంక్షించారు. ఈ పర్యటనలో భాగంగా సింగపూర్ ప్రధాని లీహసియన్ లూంగ్, చిలీ అధ్యక్షుడు సెబాస్టియన్ పినెరాలతో ప్రధాని మోదీ సుహృద్భావ పూర్వకంగా సమావేశమయ్యారు. ద్వైపాక్షిక సంబంధాలపై ఆయా దేశాధినేతలతో వీరు చర్చించారు.

మోదీతో ఆస్ట్రేలియా ప్రధాని సెల్ఫీ

కితనా అచ్చేహై మోదీ!

భారత ప్రధాని మోదీకి ఆస్ట్రేలియా ప్రధాని స్కాట్ మారిసన్ ఇచ్చిన కితాబు ఇది. ఒసాకాలో జరిగిన జి-20 సదస్సుకు హాజరయిన మారిసన్,మోదీలు శనివారం సమావేశమయ్యారు. క్రీడలు, గనుల తవ్వకం, రక్షణ, తీర ప్రాంత భద్రత వంటి విషయాల్లో సహకారాన్ని పెంపొందించుకునేందుకు ఇరువురు అంగీకరించారు. ఆ సందర్భంగా మారిసన్ ప్రధాని మోదీతో సెల్ఫీ దిగారు. దాన్ని ట్విట్టర్‌లో పెట్టారు. ఆ ఫొటోకు 'కితనా అచ్చే హై మోదీ'అని కాప్షన్ ఇచ్చారు. దాన్ని చూసి మోదీ మురిసిపోయారు. ఆస్ట్రేలియా ప్రధాని ట్వీట్‌కు స్పందిస్తూ మారిసన్‌ను 'మేట్'అని సంబోధించారు. ఆస్ట్రేలియా భాషలో మేట్ అంటే స్నేహితుడని అర్థం. భారత్-ఆస్ట్రేలియా సంబంధాల పట్ల సంతోషంగా ఉన్నానని మోదీ ట్వీట్ చేశారు.'కితనా అచ్చే హై మోదీ అంటూ హిందీలో నన్ను అభినందించడం ద్వారా ఈ ట్వీట్‌ను వైరల్ చేశారు. దానికి నేను కృతజ్ఞుడిని'అని మోదీ తన ట్వీట్‌లో పేర్కొన్నారు.

వాణిజ్య యుద్ధానికి బ్రేక్

- వాణిజ్య చర్చ పున:ప్రారంభం
- అమెరికా అధ్యక్షుడు ట్రంప్-చైనా అధినేత జిన్ పింగ్ నిర్ణయం

బీజింగ్/ఒసాకా: అమెరికా-చైనాల మధ్య కొనసాగుతోన్న వాణిజ్య యుద్ధానికి తాత్కాలికంగా తెరపడింది. గతంలో ఆగిపోయిన వాణిజ్య చర్చలను తిరిగి ప్రారంభించేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌లు అంగీకరించారు. జపాన్‌లోని ఒసాకాలో జరుగుతున్న జి20 సదస్సు సందర్భంగా శనివారం సమావేశమైన ఇరువురు నేతలు ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ వివాదం పరిష్కారమయ్యేవరకూ చైనా ఉత్పత్తులపై కొత్తగా సుంకాలు విధించబోమని ట్రంప్ ప్రకటించారు. 'చైనాతో శత్రుత్వం లేదు. అమెరికా-చైనాల మధ్య సత్సంబంధాలను కోరుకుంటున్నా' అని ట్రంప్ చెప్పినట్లు చైనా అధికార పత్రిక 'చైనా డైలీ' తెలిపింది. వాణిజ్య లోటుపై చర్చలు జరిపేందుకు ఇరుదేశాల కమిటీలు త్వరలో సమావేశమవుతాయని వెల్లడించింది. ట్రంప్‌తో భేటీ సందర్భంగా చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ స్పందిస్తూ..'పరస్పరం సహకరించుకుంటే అమెరికా-చైనాలు లబ్ధి పొందుతాయి. కానీ గొడవలకు దిగితే ఇరుపక్షాలూ నష్టపోతాయి' అని చెప్పినట్లు చైనా డైలీ పేర్కొంది. అమెరికాతో ఉన్న 539 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును తగ్గించాలని ట్రంప్ గతంలో చైనాను డిమాండ్ చేశారు. అలాగే అమెరికా కంపెనీల హక్కులను కాపాడాలని కోరారు. ఈ సందర్భంగా ఇరుదేశాలకు చెందిన వాణిజ్య బృందాలు పలు మార్లు సమావేశమైనప్పటికీ సత్ఫలితాలు రాలేదు. దీంతో 250 బిలియన్ డాలర్ల విలువైన చైనా ఎగుమతులపై 25 శాతం మేర సుంకాలను పెంచుతూ ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. దీంతో అమెరికాకు చెందిన కొన్ని ఉత్పత్తులపై చైనా సుంకాలు విధించింది. అయితే ఈ వాణిజ్య యుద్ధం కారణంగా తమకు నష్టం జరుగుతోందని గుర్తించిన ఇరుదేశాలు తాజాగా సయోధ్యకు ముందుకొచ్చాయి.

హలో చెప్పాలని ఉంది

'మీ ఇంటికొస్తా. మీ భూభాగంలో అడుగు పెడతా. హలో అని పలకరిస్తా. కరచాలనం చేస్తా. రెండు నిమిషాలు మాట్లాడినా చాలు' అని ట్రంప్ ఉత్తర కొరియా అధినేత కిమ్ జాంగ్ ఉన్‌కి ట్విట్టర్ ద్వారా సందేశం పంపారు. ట్రంప్ ట్విట్టర్‌లో చర్చలకు రమ్మంటూ కిమ్‌ని ఆహ్వానించడంతో రాజకీయ పరిశీలకులు ఆశ్చర్యానికి లోనయ్యారు.

సదస్సు సందర్భంగా జిన్‌పింగ్, ట్రంప్ కరచాలనం

ట్రోల్స్‌కు బదులిచ్చిన ఎంపీ నుస్రత్ జహాన్

లోక్‌సభ సభ్యురాలిగా పార్లమెంటులో ప్రమాణం చేస్తున్న నుస్రత్ జహాన్ (ఫైల్)

న్యూఢిల్లీ: హిందువులు ధరించే సిందూరాన్ని పెట్టుకొని, చీర ధరించి ఇటీవల పార్లమెంట్‌లో గత నెల ప్రమాణస్వీకారం చేసినందుకు తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ నుస్రత్ జహాన్‌ను నెటిజన్లు ట్రోల్ చేయగా ఆమె వాటికి ట్విటర్ ద్వారా కౌంటర్ ఇచ్చారు. తాను సమ్మిళిత భారత్‌ను సూచించేలా సిందూరాన్ని ధరించానని ధీటుగా జవాబిచ్చారు. అది మతం, కులం, వివక్షలకు అతీతమైనదని అన్నారు. హింసను, పగను రెచ్చగొట్టే ఉన్మాదుల కామెంట్లను తాను పట్టించుకోన్నారు. తాను ముస్లింగానే ఉంటానని, కానీ అన్ని మతాలను గౌరవిస్తానని స్పష్టంచేశారు. తానేం ధరించాలో తన ఇష్టమని తెలిపారు. ఆమె వ్యాఖ్యలను సమర్థిస్తూ టీఎంసీ ఎంపీ మిమి చక్రవర్తి, నుస్రత్ నిజమైన భారతీయ స్త్రీని ప్రతిబింబించిందని అన్నారు. సహారాన్పూర్‌లోని జమీమా షేక్ ఉల్ హింద్‌కు చెందిన మత పెద్ద అసద్ క్వాస్మి మాట్లాడుతూ ఇస్లాంలో ఇతర మతాల వారిని పెళ్లి చేసుకోవడం నిషిద్ధమన్నారు. అయిప్పటికీ ఆమె జైన్ మతానికి చెందిన వ్యక్తిని పెళ్లి చేసుకున్నారని అన్నారు. సిందూరం ధరించడం ఇస్లాంకు వ్యతిరేకమన్నారు. ఆమె సినిమా రంగానికి చెందిన వ్యక్తి అని తనకు తెలిసిందని, సినిమా రంగంవారు మత సంప్రదాయాలను పాటించరన్నారు. ఆమెను తమ మతంలోకి ఆహ్వానిస్తున్నామని బీజేపీ ఎంపీ సాధ్వి ప్రజ్ఞాసింగ్ ఠాకూర్ అన్నారు. భవిష్యత్తు తమ మతంతోనే సురక్షితంగా ఉందని, హిందూ మతం స్త్రీలను గౌరవిస్తుందని నుస్రత్ గుర్తించిందన్నారు.

ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు

- వచ్చే ఏడాది జూన్ 30 వరకు గడువు ఇచ్చిన కేంద్రం
- నకిలీ రేషన్‌కార్డులు తగ్గుతాయన్న కేంద్ర మంత్రి పాశ్వాన్

న్యూఢిల్లీ: ప్రజలు దేశంలో ఎక్కడ్నుంచి అయినా రేషన్ సరుకులు తీసుకునేందుకు వీలుగా ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు(వన్ నేషన్-వన్ రేషన్ కార్డ్) విధానాన్ని అమలు చేయాలని అన్ని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను కేంద్రం ఆదేశించింది. ఇందుకు 2020, జూన్ 30 వరకూ గడువిస్తున్నట్లు కేంద్ర ఆహార, ప్రజాపంపిణీ వ్యవహారాల శాఖ మంత్రి రామ్‌విలాస్ పాశ్వాన్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, గుజరాత్, హరియాణా, కేరళ, జార్ఖండ్, కర్ణాటక, మహారాష్ట్ర, త్రిపుర, రాజస్తాన్ రాష్ట్రాల్లో రేషన్ సరుకులు ఎక్కడి నుంచైనా తీసుకునే సదుపాయాన్ని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే అమలు చేస్తున్నాయని వెల్లడించారు. '2020, జూన్ 30 నాటికి దేశవ్యాప్తంగా ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు విధానం ఎట్టి పరిస్థితుల్లోనూ అమలుకావాలి. ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని మేం ఇప్పటికే రాష్ట్రాలకు లేఖలు రాశాం. ఓ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలసవెళ్లే నిరుపేదలు రేషన్ సరుకులు పొందలేక ఇబ్బంది పడకూడదన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నాం. దీనివల్ల నకిలీ రేషన్ కార్డులకు అడ్డుకట్ట పడుతుంది. మా ప్రభుత్వం తొలి 100 రోజులు ఎజెండాలో ఈ అంశాన్ని చేర్చాం' అని పాశ్వాన్ పేర్కొన్నారు.

రేషన్ కోసం ఆధార్ చూపాల్సిందే..

ఈ నూతన విధానంలో ఓ రాష్ట్రంలోని ప్రజలు మరో రాష్ట్రానికి వెళ్లినప్పుడు రేషన్ సరుకుల కోసం ఆధార్‌కార్డును చూపాల్సి ఉంటుందని పాశ్వాన్ తెలిపారు. తమ పేర్లు రిజస్టరైన రేషన్ షాపుల్లో అయితే కేవలం రేషన్ కార్డు చూపిస్తే సరిపోతుందని వెల్లడించారు. ఓ రాష్ట్రంలో ఆహారపదార్థాలను ఉచితంగా అందుకునే వ్యక్తి మరో రాష్ట్రానికి వెళ్లినప్పుడు మాత్రం రూ.1 నుంచి రూ.3 వరకు కనీసధరను చెల్లించి కొనుక్కోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.. 'రేషన్‌కార్డుదారుల్లో 89 శాతం మంది ఆధార్‌తో అనుసంధానమయ్యారు. దేశవ్యాప్తంగా 77 శాతం రేషన్ షాపుల్లో పాయింట్ ఆఫ్ సేల్స్(పీవోఎస్) యంత్రాలు ఏర్పాటయ్యాయి. మొత్తం 22 రాష్ట్రాల్లోని రేషన్ షాపుల్లో 100 శాతం పీవోఎస్ యంత్రాలను అమర్చారు. కాబట్టి కొత్త విధానాన్ని అమలు చేయడానికి ఎలాంటి ఇబ్బందిలేదు' అని పేర్కొన్నారు. ఈ పథకం దుర్వినియోగం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామని పాశ్వాన్ చెప్పారు. కుటుంబంలో ఒకరు మరో రాష్ట్రానికి వలసవెళ్లి మొత్తం రేషన్ సరుకులు అక్కడే కొనేయకుండా 50 శాతం గరిష్ట పరిమితి విధిస్తున్నామని తెలిపారు. ఒకే దేశం-ఒకే రేషన్ కార్డు విధానానికి సంబంధించిన మార్గదర్శకాలను త్వరలోనే విడుదల చేస్తామని పాశ్వాన్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం 2016 నుంచి జాతీయ ఆహార భద్రత చట్టం కింద 80 కోట్ల మందికి రేషన్‌షాపుల్లో తక్కువ ధరలకే ఆహారపదార్థాలను అందజేస్తోంది.

'5 నిమిషాల్లో రైలు టికెట్ దొరకాలి'

శివాజీనగర: రైల్వేస్టేషన్లలో టికెట్ల కోసం గంటల పాటు నిలబడే ఇబ్బంది లేకుండా, ప్రతి ప్రయాణికుడికి అయిదు నిమిషాల్లో టికెట్ దొరికే వ్యవస్థను రూపొందించాలని రైల్వే శాఖ సహాయ మంత్రి సురేశ్ అంగడి అధికారులకు సూచించారు. మెజెస్టిక్ రైల్వేస్టేషన్‌లో శనివారం మూడో ప్రవేశ ద్వారాన్ని ప్రారంభించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్య చేశారు. తమ పాలనలో మొదటి 100 రోజులకు కొన్ని లక్ష్యాలను నిర్దేశించుకున్నామని తెలిపారు. వాటిలో మొదటిది సురక్షిత ప్రయాణమే అన్నారు. సమయ పాలన పాటించేలా చర్యలు తీసుకుంటామన్నారు. దేశంలో అన్ని రైళ్లను దశలవారీగా విద్యుదీకరణ చేస్తామని చెప్పారు. జపాన్, చైనాలో గంటకు 300 కిలోమీటర్ల వేగంతో రైళ్లు దూసుకెళ్తుండగా, మనదేశంలో నేటికీ 100 కిలోమీటర్ల వేగాన్ని దాటలేక పోతున్నాయన్నారు.

మూకదాడి బాధితులపై చార్జిషీట్

అల్వార్: గోవులను అక్రమంగా తరలిస్తున్నారన్న కారణంతో జరిగిన మూకదాడిలో మరణించిన వ్యక్తి కొడుకులపై చార్జిషీటు దాఖలైంది. 2017 ఏప్రిల్ 1న పెహ్లూఖాన్ అనే వ్యక్తి తన ఇద్దరు కొడుకులతో కలసి గోవులను తరలిస్తున్నాడన్న విషయాన్ని తెల్సుకున్న కొందరు గోరక్షకులు వారిపై దాడి చేశారు. ఈ దాడి అనంతరం చికిత్స పొందుతూ ఏప్రిల్ 3న పెహ్లూఖాన్ మరణించాడు. ఈ మరణానికి కారణమైన ఆరుగురితో పాటు మరో 200 మంది పేర్లను ఎఫ్ఐఆర్‌లో చేర్చారు. వారితో పాటు అధికారుల అనుమతి లేకుండా 36 గోవులను తరలిస్తున్న 16 మందిపై కూడా పోలీసులు కేసులు నమోదు చేశారు. తాజాగా పెహ్లూఖాన్ కుమారులు ఇర్షాద్ ఖాన్ (25), ఆరిఫ్ ఖాన్ (22)లతో పాటు ట్రక్ నడిపిన ఖాన్ మొహమ్మద్‌పై రాజస్తాన్ జంతు పరిరక్షణ చట్టం 1995 కింద చార్జిషీట్ దాఖలైంది. ఈ చార్జిషీట్‌లో మొదట పెహ్లూఖాన్ పేరు ఉన్నప్పటికీ అతడు మరణించడంతో పేరు తొలగించామని అల్వార్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీసు అనిల్ పారిస్ దేశ్‌ముఖ్ తెలిపారు.

జర్నలిస్ట్ మార్క్ టులీకి లైఫ్‌టైమ్ అవార్డు

లండన్: భారత్, బ్రిటన్‌ల మధ్య సంబంధాలు పెంపొందించినందుకుగాను బ్రిటీష్ సీనియర్ జర్నలిస్ట్ సర్ మార్క్ టులీకి యానువల్ యూకే-ఇండియా అవార్డ్స్‌లో లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు లభించింది. గతంలో ఈయన బీబీసీ బ్యూరో చీఫ్‌గా ఢిల్లీలో ఉన్నారు. భారత్‌లో పని చేయడం తన పూర్వ జన్మ సుకృతమన్నారు. ఎలిజబెత్ 2 మహారాణితో నైట్ బిరుదును, భారత ప్రభుత్వం నుంచి పద్మభూషణ్‌ను కూడా అందుకున్నారు. సోషల్ ఇంపాక్ట్ విభాగంలో బ్రిటిష్ టెలికాం, భారత హాస్పిటాలిటీ విభాగంలో ఓయో కంపెనీలు అవార్డులను పొందాయి. భారత, బ్రిటీష్ ప్రేక్షకులకు సుపరిచితుడైన నటుడు కునాల్ నయ్యర్ గ్లోబల్ ఇండియన్ ఐకాన్ ఆఫ్ ద ఇయర్‌గా నిలిచారు. భారత సాఫ్ట్‌వేర్ దిగ్గజం ఇన్ఫోసిస్ సహకారం అందించిన టెక్నాలజీ 'మాంచ్'బెస్ట్ స్టార్టప్‌గా నిలించింది.

యూపీలో నేరగాళ్ల ఇష్టారాజ్యం

ప్రియాంకా గాంధీ ఆరోపణ

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వంపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ప్రియాంకాగాంధీ వాద్రా తీవ్రంగా మండిపడ్డారు. రాష్ట్రంలో నేరాలు తగ్గుముఖం పట్టాయన్న పోలీసుల నివేదికను తప్పుపట్టిన ఆమె.. యూపీలో నేరస్తులు స్వేచ్ఛగా తిరుగుతూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ కూడా యోగి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నేర గణాంకాలను తారుమారు చేసిన పోలీసులు నేరాల సంఖ్య తగ్గిందంటూ చెబుతున్నారని అఖిలేశ్ విమర్శించారు. శనివారం ప్రియాంక ట్విట్టర్‌లో..ఉత్తరప్రదేశ్‌లో నేరగాళ్లు స్వేచ్ఛగా సంచరిస్తున్నారు. నేర ఘటనలు కొనసాగుతూనే ఉన్నాయి. బీజేపీ ప్రభుత్వం వీటిని పట్టించుకోవడం లేదు. నేరగాళ్లకు సర్కారు లొంగిపోయిందా?' అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలతోపాటు రాష్ట్రంలో నేరాలపై పలు నివేదికలను జత చేశారు. దీనిపై రాష్ట్ర న్యాయశాఖ మంత్రి బ్రిజేశ్ స్పందించారు. 'మా ప్రభుత్వం నేరగాళ్ల నెట్‌వర్క్‌ను నిర్వీర్యం చేసింది. నేరస్తులపై కఠినంగా వ్యవహరిస్తోంది. నేరాలు తగ్గాయి' అని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లో పెరుగుతున్న అసంతృప్తి

సాక్షి ప్రతినిధి, న్యూఢిల్లీ: లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ ఘోర వైఫల్యానికి బాధ్యత వహిస్తూ కాంగ్రెస్ చీఫ్ బాధ్యతల నుంచి తప్పుకున్న రాహుల్ గాంధీపై సానుభూతి, విశ్వాసం పెరుగుతున్నాయి. ఎన్నికల్లో పరాజయం కంటే ఈ నిస్తేజ పరిస్థితులే పార్టీకి ఎక్కువ చేటు కలిగిస్తాయని సీనియర్లతోపాటు అన్ని స్థాయిల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం కొనసాగుతున్న పరిస్థితికి సోనియా, రాహుల్‌లదే బాధ్యతని, వారి అంగీకారం లేకుండా ప్రత్యామ్నాయ నాయకత్వ ఏర్పాటు సాధ్యం కాదని అంటున్నారు. లోలోపల ఏదో కుట్ర, డ్రామా నడుస్తోందని నేతల అనుమానం. సిసలైన నాయకుడెవరూ కూడా సంక్షోభ సమయంలో బాధ్యతల నుంచి తప్పుకోరని తెలుగు రాజ్యసభ సభ్యుడొకరు వ్యాఖ్యానించారు. రాహుల్ ముందుగా సీడబ్ల్యూసీ తోపాటు రాష్ట్ర శాఖలు, ఏఐసీసీ విభాగాలను రద్దు చేసి పునర్వ్యవస్థీకరణ చేపట్టాలన్నారు. భవిష్యత్తుపై చర్చించేందుకు ముందుగా ఏఐసీసీ సమావేవం ఏర్పాటు చేసి రానున్న రాష్ట్రాల శాసనసభల ఎన్నికలపై రోడ్‌మ్యాప్ రూపొందించాలని అన్నారు. ఇలా ఉండగా, రాహుల్ గాంధీయే చీఫ్‌గా కొనసాగాలని పార్టీ కోరుకుంటోందని కాంగ్రెస్ ప్రతినిధి పవన్ ఖేరా అన్నారు. రాహుల్ వైదొలుగుతున్నట్లు ప్రకటించినందుకు నిరసనగానే పార్టీ నేతలంతా రాజీనామాలు చేస్తున్నారన్నారు. రాహుల్ పార్టీ చీఫ్‌గా కొనసాగాలని ఇప్పటికే సీడబ్ల్యూసీ తీర్మానించిందని గుర్తు చేశారు.

ఉగ్ర శిబిరంపై దాడికి వాజ్‌పేయి ఆదేశం!

2001, డిసెంబర్ 13న పాక్ ప్రేరేపిత ఉగ్రవాదులు పార్లమెంటుపై చేసిన దాడికి ప్రతీకారంగా పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పాక్ సైన్యం నిర్వహిస్తున్న ఉగ్రవాద శిక్షణ శిబిరంపై దాడి చేయాలని అప్పటి ప్రధాని వాజ్‌పేయి నిర్ణయించారు. పాక్ తన శిబిరాన్ని వేరే చోటుకు మార్చడంతో ఆ ప్రయత్నం ఆగిపోయింది. అమెరికాపై అల్ ఖాయిదా దాడి(9/11) నేపథ్యంలో ఆఫ్ఘన్‌పై యుద్ధానికి దిగిన అమెరికాకు మద్దతివ్వాలని అప్పటి విదేశాంగ మంత్రి జస్వంత్ సింగ్ అన్నారు. దానివల్ల క కలిగే నష్టాలను గుర్తించిన వాజ్‌పేయి దౌత్యనీతిని ఉపయోగించి నిర్ణయాన్ని దాటవేశారు. 'ఏ ప్రైమ్ మినిస్టర్ టు రిమెంబర్: మెమరీస్ ఆఫ్ ఏ మిలటరీ చీఫ్(గుర్తుంచుకోదగిన ప్రధాని:సైన్యాధిపతి జ్ఞాపకాలు) పేరుతో అప్పటి నౌకాదళాధిపతి సుశీల్ కుమార్ రాసిన పుస్తకంలో ఈ విషయాలు పేర్కొన్నారు. ఆ పుస్తకం శుక్రవారం విడుదలయింది. పార్లమెంటుపై దాడి జరగ్గానే త్రివిధ దళాధిపతులు, రక్షణ మంత్రి జార్జి ఫెర్నాండెజ్, భద్రతా సలహాదారు బ్రజేశ్ మిశ్రాలతో సమావేశమయ్యారు. పీవోకేలో ఉన్న ఉగ్ర శిక్షణా శిబిరంపై దాడికి అన్ని నిర్ణయించాం. అన్ని ఏర్పాట్లు జరిగాయి. అయితే, పాకిస్తాన్ ఆ శిబిరాన్ని ఒక స్కూలు, హాస్పటల్ మధ్యకి మార్చినట్టు చివరి నిముషంలో తెలిసింది. శిబిరంపై దాడి చేస్తే జననష్టం జరుగుతుందన్న భావంతో ప్రధాని వాజ్‌పేయి దాడి చేయవద్దన్నారు. అని సుశీల్ తన 135 పేజీల పుస్తకంలో పేర్కొన్నారు.

రాహుల్ దేశాటన!

పాదయాత్రతో జనంలోకి ?

- వచ్చే ఎన్నికల నాటికి ప్రధాని అభ్యర్థిగా ప్రియాంక
- కాంగ్రెస్ మూడు ఎజెండాలు పార్టీ జెండాను ఎగురవేస్తాయా?

135 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన కాంగ్రెస్ పార్టీ గత రెండు ఎన్నికల్లోనూ ఘోర పరాజయం పాలవడంతో దిక్కుతోచని పరిస్థితుల్లో పడిపోయింది. గత నెలరోజులుగా నిస్తేజంగా మారిన పార్టీ శ్రేణుల్లో పార్టీ భవితవ్యంపై తీవ్రమైన ఆందోళన నెలకొంది. రాహుల్ గాంధీ అధ్యక్షుడిగా కొనసాగనని తేల్చి చెప్పేయడం, ఆయన స్థానంలో ఎవరు వస్తారోనన్న గందరగోళం, వివిధ రాష్ట్రాల్లో పార్టీ పదవులకు సీనియర్ నేతల మూకుమ్మడి రాజీనామాలు ఇవన్నీ ఓ రకమైన సంక్షోభానికి దారి తీస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ పార్టీ వ్యూహకర్తలు దశలవారీగా పరిస్థితిని చక్కదిద్దడానికి రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. వీరి ముందు ఇప్పుడు మూడు ఎజెండాలే ఉన్నాయి. అవే కాంగ్రెస్ జెండాని తిరిగి ఎగురవేస్తాయన్న నమ్మకంతో కాంగ్రెస్ పెద్దలు ఉన్నారు.

రాహుల్ పాదయాత్ర

ఏసీ గదుల్లో పార్టీ నేతలు, కార్యకర్తలతో ఎన్నాళ్లు మేధోమథనం జరిపినా ప్రయోజనం శూన్యమని కాంగ్రెస్ పెద్దలు భావిస్తున్నారు. జనంలోకి వెళ్లిన వాడే నాయకుడిగా అవతరిస్తాడని, ప్రజా సమస్యలు కళ్లారా చూసినప్పుడే రాజకీయ వ్యూహాలు సరిగ్గా అమలు చేయగలరని చరిత్ర నిరూపిస్తున్న సత్యం. అందుకే రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా పాదయాత్ర చేస్తే బాగుంటుందని ప్రతిపాదనలు ఉన్నట్టు కాంగ్రెస్ వర్గాలు వెల్లడిస్తున్నాయి. అయితే రాహుల్ ఎంత వరకు జయప్రకాశ్ నారాయణ, వీపీ సింగ్, చంద్రశేఖర్ మాదిరిగా అనుకున్న లక్ష్యాలకు చేరుకోగలరా అన్న అనుమానాలూ ఉన్నాయి.

కొత్త అధ్యక్షుడి ఎన్నిక

ఇక రాహుల్ గాంధీ స్థానంలో అధ్యక్షుడిగా ఎవరిని ఎన్నిక చేయాలన్నది అతి పెద్ద సమస్య. ఇప్పుడు అందరి క

గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం
ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు
జ్యేష్ఠ మాసం, తిథి బ.త్రయోదశి రా.3.20 వరకు ,తదుపరి చతుర్దశి
నక్షత్రం కృత్తిక ఉ.8.40 వరకు ,తదుపరి రోహిణి ,వర్జ్యం రా.12.45 నుంచి 2.22 వరకు,దుర్ముహూర్తం సా.4.47 నుంచి 5.40 వరకు,అమృతఘడియలు...ఉ.6.12 నుంచి 8.04 వరకు.

సూర్యోదయం : 5.32
సూర్యాస్తమయం : 6.32
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

ఉభయతారకం, శుభదాయకం

కె. రామచంద్రమూర్తి

రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ పక్కపక్కన కూర్చొని వివాదాలను సామరస్య ధోరణిలో, ఇచ్చిపుచ్చుకునే పద్ధతిలో పరిష్కరించుకుందామని సంకల్పం చెప్పుకోవడం చాలా కాలంగా ఎదురు చూస్తున్న శుభపరిణామం. ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత అయిదేళ్ళు కాలగర్భంలో కలిసిపోయినప్పటికీ రెండు రాష్ట్రాల పాలకుల మధ్య సుహృద్భావం కరువై సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదు. నదీజలాల వివాదాల సంగతి సరేసరి. 2014లో ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణ చట్టం అమలులోకి వచ్చి అదే సంవత్సరం జూన్ 2న రెండు రాష్ట్రాలూ ఏర్పడిన తర్వాత విభజన తాలూకు గాయాలు మానడానికి కొంత సమయం అవసరమనే సంగతి ఊహించిందే. కానీ రాజకీయ నాయకత్వాల మధ్య అవగాహన లేక, సంఘర్షణాత్మక వైఖరినే ప్రజలు మెచ్చుతారనే ఆలోచనతో కలహానికి కాలు దువ్వారే కానీ సఖ్యతకు ప్రాధాన్యం ఇవ్వలేదు. ఓటుకు కోట్ల కేసు వెలుగులోకి వచ్చిన వెంటనే నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 'మీకు పోలీసు ఉంది, మాకూ పోలీసు ఉంది. మీకు ఏసీబీ ఉంది మాకూ ఏసీబీ ఉంది,' అంటూ విజయవాడ వెళ్ళి కృష్ణానదీ గర్భంలో అక్రమ కట్టడంలో నివాసం కుదుర్చుకున్నప్పటి నుంచీ రెండు రాష్ట్రాల మధ్య వివాదాలు పెరిగాయే కానీ తరగలేదు. విభజన సమస్యలు అపరిష్కృతంగా ఉండగా నదీజలాల వివాదాలలో పీటముళ్ళు పడి దాయాదుల పోరును తలపించడం విషాదం. విడిపోయి కలిసి ఉందామనే నినాదం అర్థరహితంగా మారిన పరిస్థితులు తెలుగువారికి బాధ కలిగించాయి. అవిభక్త రాష్ట్రానికి కృష్ణా జలాల కేటాయింపులో బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యూనల్ 2013 నవంబర్ 29న ఇచ్చిన అంతిమ తీర్పుపైన సుప్రీంకోర్టు 'స్టే' విధించింది. రాష్ట్ర విభజన తర్వాత రెండు రాష్ట్రాలూ అదే ట్రిబ్యూనల్ ఎదుట తమతమ వాటాల విషయంలో వాదులాడుకున్నాయి. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా రాయలసీమకు నీరు తరలించరాదనీ, చెన్నైకి తెలుగుగంగ ద్వారా పంపేందుకు 1,500 క్యూసెక్కులు మాత్రమే వినియోగించుకోవాలనీ తెలంగాణ వాదించింది. కానీ జూరాల, శ్రీశైలం, నాగార్జునసాగర్ నుంచి మిగులు జలాలను వినియోగించే అవకాశం ఇవ్వాలని అభ్యర్థించింది. పోలవరం నిర్మాణానికి తెలంగాణ అభ్యంతరం చెబితే కాళేశ్వరంను ఆంధ్రప్రదేశ్ తప్పుపట్టింది. పట్టిసీమ ప్రాజెక్టు ద్వారా కృష్ణాబేసిన్‌లోకి ఎత్తిపోసే 45 టీఎంసీల గోదావరి నీటిలో తెలంగాణ వాటా ఇవ్వాలని కోరింది. అట్లా అడిగే పక్షంలో తెలంగాణలో వివిధ ప్రాజెక్టుల ద్వారా వినియోగించుకునే 214 టీఎంసీల గోదావరి నీటిలో తమకూ వాటా ఉంటుందంటూ ఆంధ్రప్రదేశ్ ఎదురు వాదించింది. ఎంత నీరు కేటాయించినా వినియోగించుకునే వ్యవస్థ లేనప్పుడు కీచులాడుకొని ఏమి ఫలితం?

ఖడ్గచాలనం కాదు, కరచాలనం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మే 30న ప్రమాణం చేసిన సభలో అతిథిగా పాల్గొన్న తెలంగాణ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు (కేసీఆర్) రెండు తెలుగు రాష్ట్రాల మధ్యా 'ఖడ్గచాలనం కాదు, కరచాలనం' జరగాలంటూ హితవాక్యం పకలడంతో వాతావరణం మారిపోయింది. కృష్ణా, గోదావరీ జలాలను రెండు తెలుగు రాష్ట్రాలలోని వెనుకబడిన ప్రాంతాలకు తరలించేందుకు ఎటువంటి పథకాలు రచించాలో సమాలోచన చేయాలన్న సద్భావన ఫలితంగానే శుక్రవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులూ, మంత్రులూ, ఉన్నతాధికారులూ చర్చలు ప్రారంభించారు. ఘర్షణ వల్ల ప్రయోజనం లేదు. 1996లో కర్ణాటకలో ఆల్మట్టి ప్రాజెక్టును అడ్డుకునేందును అప్పటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వెళ్ళి హడావిడి చేయడం, ప్రాజెక్టు ఆపకపోతే ఢిల్లీలోదేవెగౌడ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తామంటూ బెదిరించడం వల్ల ఫలితం లేకపోయింది. 2010లో బాబ్లీ ప్రాజెక్టును అడ్డుకునేందుకు ప్రతిపక్ష నాయకుడి హోదాలో ఆయన మహారాష్ట్ర వెళ్ళి, ధర్నా చేసి, అరెస్టు తర్వాత ఔరంగాబాద్ జైలులో కొన్ని గంటలు గడిపినా ప్రయోజనం శూన్యం. ఇటువంటి చర్యలు రాజకీయ ప్రచారానికీ, ఏదో చేస్తున్నామని ప్రజలను నమ్మించేందుకూ ఉపయోగపడతాయి కానీ సమస్యను పరిష్కరించజాలవు. 1996 తర్వాత అధికారంలో 2004 వరకూ ఉన్నప్పటికీ ఆల్మట్టిని ఆపేందుకు చంద్రబాబు చేసిన గట్టిప్రయత్నం ఏమీలేదు. ఆ ఎనిమిదేళ్ళూ ఢిల్లీలో యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వాలు ఉన్నా, బీజేపీ నాయకత్వంలోని నేషనల్ డెమొక్రాటిక్ అలయెన్స్ (ఎన్‌డీఏ) సర్కార్ ఉన్నా, చంద్రబాబు జాతీయ స్థాయిలో చక్రం తిప్పుతున్నారంటూ తెలుగువారు చంకలు గుద్దుకున్నా ఒరిగింది ఏమీ లేదు. బాబ్లీ ప్రాజెక్టు

విషయంలో సైతం ఆ ఒక్క నిరసన ప్రదర్శన తర్వాత కొనసాగింపు చర్యలు లేవు. ఎగువ రాష్ట్రాలలో జరిగే నిర్మాణాలను ప్రత్యక్ష కార్యాచరణ ద్వారా అడ్డుకోవడం ముఖ్యమంత్రులకైనా, ప్రతిపక్ష నాయకులకైనా సాధ్యం కాదనే విషయం స్పష్టంగా తెలిసివచ్చింది. నదీజలాల వివాదాలపై న్యాయస్థానాలలో, ట్రిబ్యూనళ్ళలో మొత్తం 350 పిటిషన్లు ఈ రోజుకూ అపరిష్కృతంగా ఉన్నాయి. వీటిలో కొన్ని మూడు దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్నాయి. ట్రిబ్యూనళ్ళ చుట్టూ, న్యాయస్థానాల చుట్టూ, కేంద్ర జలవనరుల మంత్రుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూ పరిష్కారాలు ప్రసాదించమంటూ ప్రాధేయపడటం కంటే ఇరుగుపొరుగు ముఖ్యమంత్రులు స్నేహపూరిత వాతావరణంలో కలుసుకొని జనహితమే పరమావధిగా సమాలోచనల ద్వారా విభేదాలు పరిష్కరించుకోవడం శ్రేయస్కరమని కేసీఆర్ చేసిన ప్రతిపాదనను బేషరతుగా ఆమోదించవలసిందే. జగన్ చేసిన పని అదే. ఎవరి రాష్ట్ర ప్రయోజనాలను వారు పరిరక్షించుకుంటూనే ప్రజలకు మేలు జరిగే విధంగా నదీ జలాలను సద్వినియోగం చేసుకొని భూములను సస్యశ్యామలం చేయగలిగితే అంతకంటే కావలసినది ఏమున్నది?

కృష్ణాకటాక్షం లేదు

కృష్ణానదిపైన మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు బరాజులు నిర్మించిన కారణంగా దిగువన ఉన్న తెలుగు రాష్ట్రాలకు వచ్చే నీటి పరిణామం క్రమంగా తగ్గుతూ వస్తున్నది. ప్రతి సంవత్సరం గోదావరి (దక్షిణగంగ) నదికి వరదలు వచ్చి వెయ్యి నుంచి మూడువేల టీఎంసీల నీరు సముద్రంలోకి వృధాగా పోతున్నది. కొన్నేళ్ళుగా కృష్ణానదికి వరద రానే లేదు. మిగులు నీరు లేదు. ప్రకాశం బరాజ్ నుంచి కిందికి వదలి సముద్రంలోకి పంపవలసిన 16 టీఎంసీల నీరు కూడా అందుబాటులో ఉండటం లేదు. కృష్ణాకటాక్షం లేకుండా పోతున్నది కనుకనే వృధాగా సముద్రంలోకి పోతున్న సుమారు 3,000 టీఎంసీల గోదావరి నీటినీ ఒడిసిపట్టుకొని పంటపొలాలకు మళ్ళించాలన్న మహాసంకల్పం ఉభయ తారకమైనది. అవశ్యం ఆచరణయోగ్యమైనది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం క్రమంలో కేసీఆర్ ముంబైకి వెళ్ళి మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఫడ్నవీస్‌తో సంప్రతింపులు జరిపి ఉభయులకూ సంతృప్తికరమైన పరిష్కారం కుదుర్చుకున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి జగన్‌తో పాటు ఫడ్నవీస్ కూడా హాజరు కావడం మూడు రాష్ట్రాల మధ్య బలపడుతున్న మైత్రికి నిదర్శనంగా చెప్పుకోవచ్చు. కాళేశ్వరం వల్ల మహారాష్ట్రకు కూడా ప్రయోజనమేనంటూ ఫడ్నవీస్ హర్షం ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్ ప్రజలు గట్టిగా కోరుకుంటున్న ప్రత్యేక హోదాకు తాను అభ్యంతరం చెప్పబోననీ, తమ ఎంపీలు ఆ డిమాండ్‌ను పార్లమెంటులో బలపర్చుతారనీ కేసీఆర్ నిర్ద్వంద్వంగా ప్రకటించారు. అదే విధంగా పోలవరం ప్రాజెక్టును ప్రశ్నించబోమని స్పష్టం చేశారు. దీనికి అభ్యంతరం చెబుతూ తెలంగాణ ఇదివరకు దాఖలు చేసిన కేసులను ఉపసంహరించుకుంటామనీ, అవసరమైతే ఒడిశా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్‌తో చర్చలు జరిపి ఆయనను కూడా పోలవరం ప్రాజెక్టుకు ఒప్పిస్తాననీ కేసీఆర్ చెప్పడం విశేషం. ప్రాంతీయ సహకార స్ఫూర్తితో వాస్తవాల ప్రాతిపదికగా సమాలోచనలు జరిపినప్పుడు న్యాయమైన ప్రతిపాదనలను ఏ ముఖ్యమంత్రి అయినా అంగీకరించే అవకాశం ఉంది. పొరుగు రాష్ట్ర ప్రజలకు మేలు జరగరాదని ఏ ముఖ్యమంత్రికీ ఉండదు. అవగాహన లేక, సంయమనం లేక, నేర్పులేక ఘర్షణ వాతావరణం కల్పించుకోవడం, కేసులు పెట్టుకోవడం ఉత్తమమైన రాజకీయం కాదని రాష్ట్రాధినేతలు గ్రహించడం మంచి పరిణామం. కాళేశ్వరం, పోలవరం భారీ ప్రాజెక్టులు. వేలకోట్లు ఖర్చు చేసి నిర్మిస్తున్న ఈ రెండు ప్రాజెక్టులూ తెలంగాణ, ఆంధ్రప్రజలకు ప్రాణాధారాలు. రెండు ప్రాజెక్టులకూ కేంద్రం అవసరమైన అనుమతులన్నిటినీ మంజూరు చేసింది. ట్రిబ్యూనళ్ళూ, న్యాయస్థానాల ప్రమేయం లేకుండా, కేంద్ర నాయకుల మధ్యవర్తిత్వం లేకుండా ఈ భారీ ప్రాజెక్టుల నిర్మాణం పూర్తి చేయగలిగితే ఇద్దరు ముఖ్యమంత్రులూ చరితార్థులు అవుతారు. సమావేశంలో ప్రతిపాదించినట్టు గోదావరినీటిని శ్రీశైలం జలాశయానికీ, నాగార్జునసాగర్ జలాశయానికీ రోజుకు చెరి రెండు టీఎంసీల వంతున నీరు చేర్చగలిగితే కృష్ణానది కరుణించకపోయినా, గోదావరి జలాలతో తెలుగు ప్రజల హృదయాలు పులకిస్తాయి. నదీ జలాలను సాధ్యమైనంత తక్కువ వ్యయంతో గరిష్ఠంగా వినియోగించుకునే మార్గాలను అన్వేషించవలసిందిగా ఉభయ రాష్ట్రాల అధికారులను ముఖ్యమంత్రులు ఆదేశించారు. ఈ సమావేశం ముగిసిన అనంతరం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఇరిగేషన్ శాఖలకు చెందిన ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు వెంకటేశ్వరరావు, మురళీధర్‌లు ఇతర అధికారులతో సమాలోచన జరిపి ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించారు.

5 ప్రత్యామ్నాయాలు

మొత్తం అయిదు ప్రత్యామ్నాయాలు పరిశీలనలో ఉన్నాయి. 1. దుమ్ముగూడెం టెయిల్‌పాండ్ ప్రాజెక్టుకు రీఇంజనీరింగ్ చేయడం. గోదావరి జలాలను టెయిల్‌పాండ్‌లోకి కాకుండా నేరుగా నాగార్జునసాగర్‌కు తరలించి, అందులో సగం ఉపకాలువ ద్వారా శ్రీశైలం జలాశయానికి తరలించడం. 2. అకినేపల్లి నుంచి శ్రీశైలంకూ, దుమ్ముగూడెం నుంచి నాగార్జునసాగర్‌కూ శ్రీశైలానికీ గోదావరి నీరు మళ్ళించడం. 3. రాంపూర్ నుంచి గోదావరి జలాలను నేరుగా నాగార్జునసాగర్‌లోకీ, అక్కడి నుంచి ఉపకాలువ ద్వారా శ్రీశైలం ప్రాజెక్టుకూ తరలించడం. 4. ఇంద్రావతి కలిసిన తర్వాత మేడిగడ్డకు దిగువన, తుపాకులగూడెం ఎగువున ఉన్న ప్రాంతం నుంచి గోదావరి జలాలను తరలించి సగం నీటిని సాగర్‌లోకీ, మిగిలిన సగం నీటిని ఉపకాలువ ద్వారా శ్రీశైలంలోకీ మరలించడం. 5. పోలవరం నుంచి మున్నేరు మీదుగా పులిచింతలకూ, నాగార్జునసాగర్‌కూ ఎత్తిపోయడం. అభయారణ్యాలను కాపాడుతూ, పర్యావరణాన్ని రక్షిస్తూ కాలువలు నిర్మించాలని కూడా ముఖ్యమంత్రులు సూచించారు. నీటి వినియోగం ఆధారంగా దామాషా పద్ధతిలో ఖర్చు భరించాలనే ప్రతిపాదన ఉంది. కృష్ణా–గోదావరి అనుసంధానం రెండేళ్ళలోగా పూర్తి కావాలని ఇద్దరు ముఖ్యమంత్రులూ ఆకాంక్షించారు. కృష్ణా, గోదావరి జలాలలో నాలుగు వేల టీఎంసీల నీటిని సద్వినియోగం చేయాలన్న ఆకాంక్ష నెరవేరితే తెలుగు రాష్ట్రాలలో ప్రతి అంగుళంలోనూ కోనసీమ ప్రతిఫలిస్తుంది. జులై 15 కల్లా ప్రాథమిక నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రులు ఆదేశించారు. ఆ నివేదికను పరిశీలించి కార్యాచరణకు పూనుకునేందుకు ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి ఇద్దరు ముఖ్యమంత్రులూ సమావేశం కావాలని నిర్ణయించారు.

విభజన తర్వాత తలెత్తిన విభజన అంశాలలో అత్యంత ముఖ్యమైనవి నదీజలాల వివాదాలు. ఆ తర్వాత విభజన చట్టంలోని తొమ్మిదో షెడ్యూల్ కింద 89 సంస్థలనూ, పదో షెడ్యూల్ కింద 107 సంస్థలనూ విభజించవలసి ఉంది. మొన్నటి వరకూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి అటు తెలంగాణ సర్కార్‌తోనూ, కేంద్రంతోనూ సత్సంబంధాలు లేవు కనుక ఈ కసరత్తు ప్రారంభం కాలేదనే చెప్పాలి. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా జగన్ ప్రమాణం చేసిన తర్వాత ఆయన కోరిన విధంగా ఐపీఎస్ అధికారి స్టీఫెన్ రవీంద్రను తెలంగాణ నుంచి ఆంధ్రప్రదేశ్‌కు డిప్యుటేషన్‌పైకి పంపేందుకు కేసీఆర్ అంగీకరించారు. అదే విధంగా హైదరాబాద్ సచివాలయంలో నిరుపయోగంగా పడి ఉన్న గదులను తెలంగాణ ప్రభుత్వానికి అప్పగించేందుకు జగన్ సమ్మతించారు. ఎవ్వరికీ నష్టం లేని విషయాలలో అనవరమైన పట్టింపులకు పోయి రాద్ధాంతం చేయకుండా చర్చల ద్వారా ఏకాభిప్రాయం సాధించే ప్రయత్నం అభినందనీయమైనది. ఇలాగే సహకరించుకుంటూ ప్రగతిబాటలో కలసికట్టుగా సాగితే తెలుగువారి భవిష్యత్తు దేదీప్యమానంగా ఉంటుంది. ఇదే సుహృద్భావం అవిచ్ఛిన్నంగా కొనసాగేందుకు తెలుగువారు అందరూ శక్తివంచనలేకుండా పాటుపడాలి.

దలైలామా (బౌద్ధ గురువు) రాయని డైరీ

మాధవ్ శింగరాజు

ఎత్తయిన ప్రదేశం మీద నివాసం ఉంటున్నప్పుడు మనసుని పనిగట్టుకుని ఉన్నతమైన పీఠం మీద ఆసీనం చేయించవలసిన అవసరం ఏముంటుంది?! మనిషి ఏళ్లుగా ఒక ప్రదేశంలో ఉంటున్నప్పుడు మనసు ఆ ప్రదేశంలో ఒక భాగంగా కాక.. మనసే ప్రదేశంగా, ప్రదేశమే మనసుగా కలిసిపోతాయి. ప్రదేశంలోని ఔన్నత్యం మనసును పైకి లాక్కుంటే, మనసులోని ఔన్నత్యం ప్రదేశాన్ని లోపలికి లాక్కుంటుంది. అప్పుడు రాళ్లూ ఇటుకల ఆరామమేదో, సిరలూ ధమనుల శరీరమేదో కనిపెట్టడం శాస్త్ర పరిశోధకులకైనా సాధ్యమయ్యే పనేనా?!

'నేను కనిపెట్టగలను' అని వచ్చినట్లుగా వచ్చారు ఆ వేళ నా ఆరామానికి ఒక స్త్రీమూర్తి. "నేను బిబిసీ నుంచి లామాజీ. రజినీ వైద్యనాథన్ నా పేరు" అన్నారు వారు. మనిషి చురుగ్గా, బక్క పలుచగా ఉన్నారు. ఇప్పటివరకు వారి ప్రశ్నలకు లభించిన సమాధానాలేవీ వారి మనసుకు, దేహానికీ సంతృప్తికరమైన పౌష్టికతను ఇవ్వలేక పోయినట్లున్నాయి. పైపైన మాత్రమే మనిషిని కనిపెట్టగలిగిన వారు, పైపై ప్రశ్నలు మాత్రమే వేయగలరు.

"లామాజీ.. అనేకానేకమైన ప్రశ్నలతో నేను మీ దగ్గరకు వచ్చాను. అయితే అవన్నీ కూడా గొప్ప జీవిత పరమార్థాన్ని కాక, మానవ స్వాభావికమైన అల్పత్వాన్ని కలిగి ఉండొచ్చు. నా ప్రశ్నల్లా మీ సమాధానాలు కూడా ఐహిక స్థాయిలో ఉన్నప్పుడు మాత్రమే నేను అర్థం చేసుకోగలనేమో లామాజీ.." అన్నారు వారు.

"కింద ఉన్నవారికి పైన ఉన్నవారు కనిపించనప్పుడు, పైన ఉన్నవారే కిందికి చూసి, కనిపించాలి. ఔన్నత్యంలోని అంతరార్థమే ఇది. అమ్మాయీ.. మీరు గమనించారా.. హిమాచల్‌ప్రదేశ్‌లో నింగి ఈ ప్రపంచాన్ని ఎప్పుడూ వంగి చూస్తున్నట్లుగానే

ఉంటుంది" అని నవ్వాను.

వారు అడగడం ప్రారంభించారు. "ట్రంప్ ఎలాంటి వారు లామాజీ?" అన్నారు.

"అమెరికా ఫస్ట్' అన్నారు ట్రంప్. అది మంచి విషయం. ట్రంప్‌కి విలువల్లేవు. అది చెడ్డ విషయం" అన్నాను.

'మనిషికి విలువల్లేనప్పుడు ఆ మనిషి అవలంబించే విధానాలకు మాత్రం విలువేముంటుంది?' అన్నట్లు చూశారు వారు! తర్వాత ఇంకో ప్రశ్న అడిగారు. "శరణార్థుల పట్ల ఐరోపా ఎలా ఉండాలి?" అన్నారు.

"రానివ్వాలి. బతకడం ఎలాగో నేర్పించి, తిరిగి వారి స్వదేశానికి పంపించాలి" అన్నాను.

"బతకడం నేర్చుకున్నాక, అక్కడే ఉండిపోవాలని ఎవరైనా అనుకుంటే?" అని వారు అడిగారు.

"అప్పుడు యూరప్ మొత్తం ముస్లింల ఖండం అయిపోదా?" అన్నాను.

'చైనా టిబెట్‌ను ఆక్రమించినప్పుడు మీరూ ఇండియాకు శరణార్థిగా వచ్చిన వారే కదా.. ఇండియా ఇండియా కాకుండా పోయిందా' అన్నట్లు చూశారు వారు నన్ను!

తర్వాత ఇంకో ప్రశ్న అడిగారు. "మీ తర్వాత, మీ వారసత్వంగా రావాలని మీరు కోరుకుంటున్న మహిళా దలైలామా ఎలా ఉండాలి?" అన్నారు.

"ఆకర్షణీయంగా ఉండాలి. చూడాలనిపించేలా" అన్నాను.

"ఆకర్షణ అంతస్సౌందర్యంలో కదా కనిపించాలి" అన్నారు వారు.

"లోపలా ఉండాలి, బయటా ఉండాలి. రెండూ ఒకదాన్నొకటి ప్రతిఫలించుకుంటూ ఉండాలి" అన్నాను.

వారేమీ మాట్లాడలేదు!

'దలైలామా కూడా బాహ్యసౌందర్యం గురించి మాట్లాడతారా..!' అన్నట్లు చూశారు. నా మాటల్లోని సూక్ష్మార్థాన్ని వారు సరిగా గ్రహించినట్లు లేరు.

దలైలామా అయ్యేవారెవరైనా పసివయసులోనే అవుతారు. పసితనంలో మనిషికొక సౌందర్యం, మనసుకొక సౌందర్యం ఉంటుందా?!

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

ప్రతినిధి

"మాజీ మంత్రి అరిఫ్ మహమ్మద్ ఖాన్ కు ప్రాముఖ్యత ఇవ్వడంలో మీడియా ఎందుకు తలమునకలవుతోందో అర్థం కావడం లేదు. అతడేమీ దేశంలోని ముస్లింలందరికీ ప్రతినిధి కాదు. మరీ ముఖ్యంగా ఆయన ఎన్నికల్లో గెలుపొందలేదు. జనవరిలో ఢిల్లీలోని ఇండియా ఇస్లామిక్ కల్చరల్ సెంటర్ ఎన్నికల్లో కూడా ఆయన ఓడిపోయాడన్న సంగతి మర్చిపోకూడదు. ఆయనకు కేవలం 702 ఓట్లు మాత్రమే వచ్చాయి."

–రిఫత్ జవైద్, జర్నలిస్ట్

ముల్లా

"ఐదేళ్ల బాలికపై లైంగిక దాడికి పాల్పడుతూ ఒక ముల్లా రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డాడు. చిన్నారికి ఖురాన్ బోధించడానికి ఆ ముల్లాను తల్లిదండ్రులు ఇంటికి పిలిపిస్తున్నారు. వయసు, హోదా మరిచి ఇటువంటి పనులకు పాల్పడే ఈ జబ్బుకు ఏదైనా పేరుందా?"

–కరుణా గోపాల్, బిజేపీ నేత

జీరో

"నెహ్రూ గనుక ఐఐటీలు ఏర్పాటు చేయకపోయి ఉంటే వేదిక్ విశ్వ లైసెన్సింగ్ శాస్త్రాల ప్రకారం జీరోకు కోట్లాది డాలర్లను లైసెన్స్ ఫీజు కింద భారత్ వసూలు చేసి ఉండేది. సాఫ్ట్ వేర్ గానీ, ఐటీ నిపుణులుగానీ అవసరమయ్యేవారు కాదు. కానీ, ఆర్టికల్ 370కింద ఆయన ఐఐటీలు పెట్టేశారు"

–మాధవన్ నారాయణన్, జర్నలిస్ట్

హుందా

"ప్రియమైన సుష్మా స్వరాజ్ జీ, ఆధునిక భారత దేశంలోని నేతల్లో మీరు గొప్ప హుందా అయిన నేత. మీవంటి నేతలు అధికార నివాసం నుంచి బయటకు వెళ్లచ్చు. కానీ, సంవత్సరాల పాటు మా గుండెల్లోనే నివాసం ఉంటారు. మీవంటి నేతలకు ప్రపంచ రాజకీయాలే తగినవి."

– అనుపమ్ ఖేర్, నటుడు

విధి

"జగన్ గారిని ఉద్దేశించి విధి క్రూరమైందని ఏదో అనబోయి ఎందుకు ఆగావు ఉమా? చేతబడి గాని మొదలుపెట్టావా ఏంటి? మంత్రిగా పనిచేస్తూ మీ అన్న రమణ రైలు ప్రమాదంలో మరణించారు. మీ వదిన గారిది సహజ మరణం కాదంటారు. దుర్మార్గాలతో ఈ స్థాయికి చేరావంటే విధి ఎంత దయలేనిదో తెలియటం లేదూ?"

– విజయసాయి రెడ్డి, వైఎస్సార్ సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

జాత్యహంకారికి జైలు

అక్కడక్కడ జాత్యహంకార ధోరణులు కనబడుతున్న అమెరికాలో వాటి నియంత్రణకు తోడ్పడే తీర్పు ఒకటి వెలువడింది. రెండేళ్లక్రితం దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌కు అనుకూలంగా జరుగుతున్న శ్వేత జాతీయుల ర్యాలీకి వ్యతిరేకంగా నిరసన చెబుతున్న వారిపైకి 22 ఏళ్ల జేమ్స్ అలెక్స్ ఫీల్డ్స్ వాహనం పోనిచ్చి ఒకరి ప్రాణం తీసి 29మందిని తీవ్రంగా గాయపరిచాడు. ఇతగాడికి నేరచరిత్ర ఉన్నదని, ఇలాంటివాణ్ణి సమాజంలో తిరగనిస్తే అందరికీ ముప్పువాటిల్లుతుందని న్యాయమూర్తి అభిప్రాయపడి యావజ్జీవ శిక్ష విధించారు. పెరోల్‌కి కూడా అవకాశం ఉండబోదని ప్రకటించారు. వాస్తవానికి అలెక్స్‌కు మరణశిక్ష పడేది. కానీ తనపై వచ్చిన 29 అభియోగాలనూ అతడు అంగీకరించినందువల్ల యావజ్జీవ శిక్ష పడింది. ఈ ఉదంతంపై ట్రంప్ స్పందించిన తీరు చెప్పుకోవాలి. 'తప్పు ఇద్దరిలోనూ ఉన్నద'ని ఆయన సన్నాయినొక్కులు నొక్కారు. ట్రంప్ వింత ధోరణిని అందరూ ఖండించారు. అమెరికా నమ్ముతున్న విలువలకు ఇది విరుద్ధమని చెప్పారు. న్యాయస్థానం ముందు ప్రాసిక్యూటర్లు నిందితుడి చర్యకు సంబంధించిన వీడియో సాక్ష్యాలు ప్రవేశపెట్టి ఉద్దేశపూర్వకంగానే ఈ దుర్మార్గానికి ఒడిగట్టాడని నిరూపించారు. అతడు హిట్లర్ వీరాభిమాని అని, ర్యాలీకి వెళ్లేముందు తల్లి జాగ్రత్తలు చెబితే 'జాగ్రత్తగా ఉండాల్సింది మేం కాదు' అంటూ జవాబిచ్చాడని చెప్పారు.

అధినేత రక్షణకే ఫిరాయింపులు

సందర్భం

సి.రామచంద్రయ్య

ఆంధ్రప్రదేశ్‌లో నలుగురు తెలుగుదేశం రాజ్యసభ సభ్యులు బీజేపీలోకి ఫిరాయించిన ఉదంతాన్ని గమనిస్తే షేక్స్‌పియర్‌ను మించిన గొప్ప నాటక రచయిత ప్రపంచంలో మరొకరు లేరని బలంగా నమ్మేవారు సైతం తమ అభిప్రాయాన్ని మార్చుకోక తప్పదు. ఫిరాయించినవారు ఆ పార్టీకి కళ్లూ, చెవులూ. యలమంచిలి సుజనాచౌదరి, సీఎం రమేష్, గరికపాటి మోహన్‌రావు, టీజీ వెంకటేష్...వీరంతా ఎవరికి వారే సాటి. తమ అధినేత విదేశాల్లో విహారయాత్రలు సాగిస్తున్నప్పుడు వీరు ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుణ్ణి కలిసి తమ పక్షాన్ని బీజేపీలో విలీనం చేస్తున్నట్టు లేఖ సమర్పించారు. అంతే... ఆ తర్వాత ఆగమేఘాల మీద అంతా సాఫీగా సాగిపోయింది. కొన్ని గంటల వ్యవధిలో రాజ్యసభ సెక్రటేరియట్ వీరిని బీజేపీ సభ్యులుగా పరిగణించింది. వెబ్‌సైట్‌లో ఆ నలుగురూ బీజేపీ ఎంపీలుగా 'మారిపోయారు'. వెంకయ్య విలీనానికి ఆమోదం తెలపలేదని కొన్ని కథనాలు వినబడ్డాయి. మరి దీన్ని రాజ్యసభ సెక్రటేరియట్ ఎలా ప్రకటించిందన్నది బిలియన్ డాలర్ల ప్రశ్న.

టీడీపీ జాప్యంలో మర్మమేమిటి?

ఈ తంతు ముందస్తు స్క్రిప్ట్ ప్రకారం నడిచిందన్న అనుమానం అందరిలో ఉంది. విలీనం నాటకం సాగుతున్నంతసేపూ మిగిలిన ఇద్దరు రాజ్యసభ సభ్యులు, ముగ్గురు లోక్‌సభ సభ్యులు చేష్టలుడిగినట్లు ఉండిపోయారు. తమకు సంబంధం లేనట్టు లోక్‌సభ స్పీకర్‌గా ఎన్నికైన ఓం బిర్లాను అభినందించి వచ్చారు. ఫిరాయింపుల మాటేమిటని మీడియా ప్రతినిధులు వెంటబడితే మొక్కుబడిగా ఖండించారు. 24 గంటలు గడిచాక వెంకయ్యకు లేఖ ఇచ్చినా ఆ నలుగురినీ బీజేపీ సభ్యులుగా ఎలా గుర్తిస్తారని అందులో ప్రశ్నించలేకపోయారు. చిన్న సంక్షోభం తలెత్తినా హడావుడి చేయడం, నాయకులతో తిట్టించడం బాబుకు అలవాటు. కానీ ఈసారి ఆయన బాణీమారింది. 'బీజేపీ దెబ్బ కొట్టాలని చూస్తోంది.. సంక్షోభాలు మనకు కొత్తకాదు.. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు. పార్టీ మారినవారు భవిష్యత్తులో పశ్చాత్తాప పడకతప్పదు' అంటూ తెలివిగా మాట్లాడారు. అధినేత అంతరంగం గ్రహించని ఒకరిద్దరు నేతలు తొలిరోజున ఫిరాయింపు దారులపై విరుచుకుపడ్డారు. అంతా తెలిశాక మూగనోము పట్టారు. గతంలో 'ఓటుకు కోట్లు' కేసులో దొరికిన సహచరుడు రేవంత్ రెడ్డిని కాంగ్రెస్‌లోకి పంపింది బాబేనన్న రహస్యం అందరికీ తెలుసు.

నిజాలు దాస్తే దాగవు

కొన

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ ఆదివారం
30-6-2019

ఇప్పుడు ఆ భయమే లేదు
- సినిమా పేజీలో..

తగ్గానండి!
సినిమా పేజీలో..

సమాంతర రేఖలు కలవవు.. కానీ ఆ పట్టాల మీదే జీవిత రైలు నడుస్తుంది. కమర్షియల్ సినిమా ఒక రేఖ అయితే.. సమాంతర సినిమా రెండో రేఖ. పాటలు పాడుతూ కమర్షియల్ సినిమాలు చేసిన సమంత ఇప్పుడు తనలోకి తనే తొంగి చూసుకుంటోంది. మనందరిలోనూ ఈ రేఖలు ఉండాలి. ఒకటి.. అందరి కోసం... ఒకటి... మన కోసం.

సమంతర రేఖ

● సమంత

ఫోటోలు: శివ మల్లాల

● **పెళ్లికి ముందు సక్సెస్‌లు చూశారు. తర్వాత రంగస్థలం, మహానటి, యు టర్న్, మజిలీ.. ఇలా వరుస విజయాల ఈ సక్సెస్ రైడ్ గురించి?**

సక్సెస్ రైడ్ అనేది వినడానికి బాగుంది. కానీ ప్రెషర్ కూడా అంతే ఉంటుంది. ఎందుకంటే మన గత సినిమా కంటే నెక్స్ట్ సినిమా స్క్రిప్ట్ బావుండాలి. అప్పుడే ఈ రైడ్ కంటిన్యూ అవుతుంది. అందుకే ఏది పడితే అది అంగీకరించ కూడదనుకున్నా. దీనివల్ల చేసే సినిమాల సంఖ్య క్రమంగా తగ్గుతుంది. అయితే క్వాలిటీ సినిమాలు మాత్రమే బయటకు వస్తాయి. సంఖ్య తగ్గినా ఫర్వాలేదనుకుంటున్నా.

● **ఒకప్పుడు ఏడాదికి ఒకటో రెండో లేడీ ఓరియంటెడ్ మూవీస్ వచ్చేవి. మహానటి, యు టర్న్, ఇప్పుడు మీరు నటించిన 'ఓ బేబి'.. తెలుగులో ఫీమేల్ ఓరియంటెడ్ సినిమాలకు కొత్త డోర్స్ ఓపెన్ అయ్యాయనుకోవచ్చా?**

అనుకోవచ్చు. అయితే ఈ లేడీ ఓరియంటెడ్ మూవీస్ కొన్ని సార్లు ఒక్క సెక్షన్‌కే రీచ్ అవుతున్నాయి. అలా కాకూడదని కోరుకుంటున్నాను. ఉదాహరణకు 'మహానటి' కమర్షియల్‌గా పెద్ద సక్సెస్. ఆ తర్వాత నేను 'యు టర్న్' చేశాను. ఆ సినిమా అనుకున్నంత కలెక్ట్ చేయలేదు. కానీ తక్కువ కలెక్షన్లు వచ్చాయని మనమెప్పుడూ ఆడియన్స్‌ను నిందించకూడదు. యూనివర్శల్ సబ్జెక్ట్స్ చేయాలి. 'యు టర్న్' మంచి సినిమానే. రివ్యూలు బావున్నాయి కదా, ఎందుకు కలెక్షన్స్ రాలేదు? అంటే థ్రిల్లర్ మూవీ ఆడియన్స్ నంబర్ తక్కువ ఉండొచ్చేమో. ఆ సినిమా నుంచి నేనేం నేర్చుకున్నానంటే.. అందరూ చూసే కథలతో సినిమాలు చేయాలని. ఇప్పుడు నేను చేసిన 'ఓ బేబీ' అన్ని వర్గాలవారికీ నచ్చే విధంగా ఉంటుంది. మంచి కామెడీ, చక్కని ఎమోషన్స్ ఉన్నాయి.

● **వరుసగా లేడీ ఓరియంటెడ్ సినిమాలు చేస్తే 'మనల్ని ఈ జానర్‌కే పరిమితం చేస్తారేమో? హీరోలు మనల్ని పక్కన పెట్టేస్తారేమో?' అనే భయాలు ఉంటాయా?**

హీరోల గురించి ఆలోచించకుండా మన దారి మనమే సెట్ చేసుకోవాలి. కెరీర్ స్టార్టింగ్ స్టేజ్‌లో కమర్షియల్ సినిమాలు చేయాలి. ఓ పేరు సంపాదించుకోవాలి. హీరోయిన్‌గా పదేళ్లు అయిపొయ్యాక కూడా అదే పాటలు.. అవే డ్యాన్సులు అంటే యాక్టర్‌గా కచ్చితంగా నిరాశ చెందుతాం. ఇన్ని సినిమాలు చేశాక ఇంకా అవే కమర్షియల్ చేస్తూ ఉంటే కేవలం డబ్బు కోసమే నేను సినిమాలు చేసినట్టు ఉంటుంది. అప్పుడు నాకు నేనే రోబోలా అనిపిస్తాను. ప్యాషన్ లేకుండా వర్క్ చేస్తున్న ఫీలింగ్ నాకు వస్తుంది. అందుకే దారి మార్చాలనుకున్నాను. మరి.. కెరీర్ స్టార్టింగ్‌లోనే ఇలాంటి సినిమాలు చేయొచ్చు కదా అంటే.. ఇండస్ట్రీకి రావడం రావడమే ఫిల్మ్స్‌కి అవకాశం తక్కువ.

● **మీ మామగారు (నాగార్జున)తో 'మన్మథుడు 2'లో చేస్తున్నారు కదా... ఎలా అనిపిస్తోంది?**

ఈ సినిమా నాకు స్పెషల్. రాహుల్, వెన్నెల కిషోర్ అందరూ నాకు క్లోజ్ ఫ్రెండ్స్. అందుకే ఈ సినిమాలో చిన్న భాగమైనా ఆనందంగా ఉంది. సినిమా చాలా సరదాగా ఉంటుంది. అందరూ ఎంజాయ్ చేస్తారు. అప్పటి 'మన్మథుడు' సినిమాలో మామయ్య ఎలా ఉన్నారో ఇప్పుడు 'మన్మథుడు 2' లోనూ అలానే ఉన్నారు. టీజర్‌లో చూసి 'ఏంటి మామయ్యా! మీరేమనుకుంటున్నారు? మేం రిటైర్ అయినా సరే మీరింకా సినిమాలు చేసేలా ఉన్నారు' అన్నాను. అప్పుడు ఆయన 'అవును.. నేను అప్పుడు కూడా చేస్తాను' అన్నారు. ఆయన లైఫ్ లాంగ్ సినిమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నారు.

● **తక్కువ అంటే.. లేడీ ఓరియంటెడ్ మూవీ చేయాలంటే క్రేజ్ ఉన్న హీరోయినే చేయాలంటారా?**

కావొచ్చు. థియేటర్లకు ప్రేక్షకులను తీసుకురావాలి కదా. కెరీర్ స్టార్టింగ్‌లోనే ఫీమేల్ ఓరియంటెడ్ మూవీకి ఆడియన్స్‌ని లాగేంత కెపాసిటీ హాలీవుడ్‌లో ఉంటుంది. ఇక్కడ కూడా అలా జరగాలి. అయితే ఇంకా టైమ్ పడుతుందనుకుంటున్నాను.

● **కొరియన్ సినిమా 'మిస్. గ్రానీ'కి 'ఓ బేబి' రీమేక్. ఆ సినిమా చూసినప్పుడు ఏమనిపించింది?**

మన తెలుగు సినిమా చూస్తున్నట్టే అనిపించింది. కొరియన్ వాళ్ల ఎమోషన్స్, కల్చర్, ఫ్యామిలీ ఇవన్నీ మన కల్చర్‌కు దగ్గరగా అనిపించాయి. వెంటనే కనెక్ట్ అయ్యాను. కథలో ఆ కనెక్టివిటీ ఉంది కాబట్టే ఈ సినిమాను ఏడు భాషల్లో రీమేక్ చేశారు. డిస్నీ సినిమాలు అందరికీ కనెక్ట్ అవుతాయి కదా. ఈ సినిమా కూడా డిస్నీ సినిమాలానే ఉంటుంది.

● **'ఓ బేబీ'లో వృద్ధాప్యంలో ఉన్న మీ పాత్రకు మళ్లీ యవ్వనంలోకి వచ్చేలా మేజిక్ జరుగుతుంది. లైఫ్‌లో మళ్లీ వెనక్కి వెళ్లే చాన్స్ వస్తే ఏదైనా తప్పుని సరిదిద్దుకోవాలనుకుంటారా?**

అలాంటిది ఏమీ లేదు. జరిగిన ప్రతిదీ మన మంచికే జరిగింది అనుకుంటాను. దేనికీ రిగ్రెట్ ఫీల్ అవ్వను. నాకు జరిగిన ప్రతిదీ ఇవాళ నన్ను ఓ స్ట్రాంగ్ పర్సన్‌గా తయారు చేసిందనే నమ్ముతాను. తప్పు జరిగితేనే ఒప్పు ఏంటో తెలుసుకుంటాం. అందుకే ఏదీ మార్చదలచుకోవడం లేదు. నాకు యాక్టింగ్‌లో గురువులు ఎవరూ లేరు. నేను చేసిన ప్రతీ సినిమా ఏదోటి నేర్పింది. తప్పు చేస్తే అందులోనుంచి ఓ పాఠం వస్తుంది. ఆ పాఠం భవిష్యత్తులో ఏదైనా నిర్ణయం తీసుకోవడానికి ఉపయోగపడుతుందనుకుంటా.

● **'ఓ బేబీ' సినిమాకు ఎక్కువ మంది ఉమెన్ పని చేయడం ఎలా అనిపించింది?**

రిలీజ్‌కు మూడు నెలల ముందే సినిమా రెడీ అయింది. ఒక్కరోజు షూటింగ్ కూడా ఆలస్యం కాలేదు. వాయిదా పడిన సందర్భాలూ లేవు. అనుకున్నది అనుకున్నట్టుగానే జరిగింది. నిజం చెప్పాలంటే మేం సినిమా ఎప్పుడు స్టార్ట్ చేశాం ఎప్పుడు పూర్తి చేశామో కూడా చాలా మందికి తెలియదు. ఇండస్ట్రీలో మా (ఉమెన్) సంఖ్య చాలా తక్కువ. నిజానికి మెన్‌తో పోలిస్తే 10 రెట్లు ఎక్కువ కష్టపడతాం. ఒక అమ్మాయికి పని చెబితే అది పూర్తయిందా? లేదా అని ఫాలో అప్ చేయాల్సిన అవసరం లేదు. పని జరిగిపోతుంది. డైరెక్టర్ నందినీరెడ్డితో వర్కింగ్ ఎక్స్‌పీరియన్స్ బాగుంటుంది. నా నెక్స్ట్ సినిమాకు కూడా వీళ్లను నా సినిమా సెట్లో ఉండేలా చూసుకుంటా.

● **నటిగా బెటర్ అవుతున్నానా? అని చెక్ చేసుకుంటుంటారా?**

అది ఎప్పటికప్పుడు జరుగుతుంటుంది. నటిగా ఇంప్రూవ్ అవుతున్నాను అనే అనుకుంటున్నాను. అప్పట్లో యాక్టింగ్ పరంగా నాకు మెంటర్స్, దారి చూపించేవాళ్లు ఎవరూ లేరు. నన్ను నేనే గైడ్ చేసుకోవాలి. నా అనుభవాలతో స్వయంగా నేర్చుకున్నాను. అందుకు కొంచెం టైమ్ పట్టింది. కానీ ప్రస్తుతం ఉన్న అనుభవంతో మంచి సినిమాలు ఎంచుకోగలుగుతున్నాను.

● **మరి.. ఈ సినిమాను మీరే నిర్మించి ఉంటే బావుండేదేమో?**

కొరియన్ సినిమా రీమేక్ చేద్దాం అనే ఆలోచనతోనే నిర్మాత సునీతగారు నన్ను అప్రోచ్ అయ్యారు. ఈ సినిమాను సురేశ్ ప్రొడక్షన్ సంస్థ డిస్ట్రిబ్యూట్ చేస్తోంది. సురేశ్ ప్రొడక్షన్స్ అంటే ఫ్యామిలీయే కదా.

● **భవిష్యత్తులో మీ పేరు మీద సినిమాలు నిర్మిస్తారా?**

ప్రస్తుతానికి నాకు ఐడియాలేదు. కానీ భవిష్యత్తులో కచ్చితంగా నిర్మిస్తాను. అది నా పేరు మీదా? నా ఫ్యామిలీ పేరుతోనా చెప్పలేను.

● **'ఓ బేబి' సినిమాను ఆడియన్స్ ఎందుకు చూడాలి?**

70 ఏళ్ళ ముసలావిడ 25 ఏళ్ల అమ్మాయిలాగా ఎలా మారింది? అన్నదే ఈ సినిమాలో యూనిక్ పాయింట్. ఈ కాన్సెప్ట్ వల్ల సిచ్యువేషనల్ కామెడీ ఉంటుంది. ఈ సినిమా చేయడానికి మరో కారణం ఏంటంటే.. కొరియన్ సినిమా చూశాక మా అమ్మ దగ్గరకు వెళ్లి నువ్వు చిన్నప్పుడు ఏం చేయాలనుకున్నావు? నీ కలలు ఏంటి? అని అడిగాను. ప్రేక్షకులు కూడా అలానే చేస్తారని అనుకుంటున్నాను.

● **అంటే.. అమ్మని నెగ్లెక్ట్ చేశాననే బాధ ఉందా?**

నా గోల్స్ కోసం పరిగెడుతున్నాను కానీ నీ కలలేంటి అని ఎప్పుడూ అమ్మను అడగలేదు. ఆ ఆలోచనే రాలేదు. జనరల్‌గా నాన్న అది చేస్తారు.. ఇది చేస్తారు అని మన ఇంటికి సంపాదన తెచ్చే వ్యక్తి గురించి గొప్పగా మాట్లాడతాం కానీ అమ్మ గురించి ఎక్కువగా మాట్లాడం. ఇంటిని చూసుకోవడం అంటే ఎంత కష్టమైన పని. ఎన్నో త్యాగాలతో కూడుకున్నది. అమ్మ దగ్గరికెళ్లి 'సంతోషంగా ఉన్నావా?' అని అడిగితే, 'నువ్వు సంతోషంగా ఉంటే నేను సంతోషంగా ఉంటాను' అంటారు. వాళ్లకు పర్సనల్ అంటూ ఏమీ ఉండదు. వాళ్ల గురించి వాళ్లు ఆలోచించరు. 'నా.. నేను' అనే ఓ మాటలు వాళ్ల జీవితంలో ఉండవు. మనందరికీ అమ్మ మీద ప్రేమ ఉంటుంది. కానీ ఎప్పుడూ చెప్పం. 'అమ్మా థాంక్యూ. మా కోసం ఇన్ని పోగొట్టుకున్నారు' అని చెప్పం. 'ఓ బేబీ' మాత్రం అమ్మకు కృతజ్ఞతలు చెప్పాలి అనే విషయాన్ని గుర్తు చేస్తుంది. మీ అమ్మా నానమ్మలతో సినిమాకు రండి. సినిమా పూర్తయ్యాక వాళ్లు చిన్నప్పుడు ఏం చేయాలనుకున్నారో అడగండి.

● **ఈ సినిమా చూశాక వయసు మళ్లిన వాళ్ల మీద మీ అభిప్రాయం మారిందా?**

మారింది. నేను అనే కాదు.. మన ఇంట్లో ఉన్న పెద్దవాళ్లను మనం చాలామంది పట్టించుకోం. వాళ్లకు అంత ఇంపార్టెన్స్, టైమ్ ఇవ్వం. ఏదైనా చెప్పబోతుంటే వినం. ఇన్నాళ్లూ పెద్దవాళ్లకు ఇవ్వాల్సినంత టైమ్ ఇవ్వలేదేమో అని కచ్చితంగా అనిపించింది. ఆడియన్స్‌కి కూడా అనిపిస్తుంది.

● **అమ్మగా మారాక 'నేను' అనేది ఉండదన్నారు. తల్లయ్యాక మీరూ అలానే ఉంటారా?**

ఉంటానేమో. పిల్లల మీద ప్రేమ ఏ తల్లిని అయినా అలా చేసేస్తుంది. అయితే ఆడవాళ్లకు చాయిస్‌లు ఉండాలి. గృహిణిగా ఉండాలా? ఉద్యోగం చేయాలా? అనేది వాళ్ల ఇష్టానికి వదిలేయాలి. అయితే కొంతమంది తమ భార్య ఇంటిపట్టునే ఉండాలంటారు. ఉద్యోగం చేయడానికి ఇష్టపడని అమ్మాయిని భర్తే స్వయంగా ఆఫీసుకి పంపిస్తాడు. ఇలా మాట్లాడితే.. 'ఫెమినిజమ్ ఫెమినిజమ్' అంటారు. ఫెమినిస్ట్ అంటే మగాళ్లను అసహ్యించుకుంటాం అని కాదు. మగవాళ్లంటే గౌరవం ఉంటుంది. సపోర్ట్‌గా నిలిచే మగవాళ్లు చాలామంది జీవితాల్లో ఉన్నారు. లేనివాళ్ల గురించి మాట్లాడుతున్నాను. సమానత్వం కోసమే ఆడవాళ్ల పోరాటం. అది స్త్రీవాదం కాదు.

● **అమలగారు కంటిన్యూస్‌గా సినిమాలు చేస్తే బాగుంటుందంటారా?**

ఆవిడ అన్నపూర్ణ ఫిల్మ్ స్కూల్‌తో చాలా బిజీ. బ్లూ క్రాస్ పనులతో బిజీగా ఉంటారు. ఇవన్నీ కూడా తన ఇష్టానుసారంగా చేస్తున్నారు. ఆమె చాయిస్ అది. నేను ఇంతకుముందు ఆడవాళ్లకు చాయిస్ ఉండాలన్నాను కదా. ఇది కూడా అలాంటిదే. వాళ్ల చాయిస్‌కి తగ్గట్టు వాళ్లను చేసుకోనివ్వాలి. నాకు యాక్టింగ్ బాగా ఇంట్రెస్ట్ కాబట్టి వరుసగా సినిమాలు చేస్తున్నాను.

● **అయితే ఇప్పుడు భర్త కూడా పిల్లలను పెంచడం, ఇంటి పనులు చూసుకోవడంలో సహాయపడుతున్నాడు..**

అది మంచి మార్పు. పూర్వం మగవాడు వంట గది లోకి వస్తే అదేదో పెద్ద తప్పన్నట్లు మాట్లాడేవారు. అప్పట్లో పిల్లలను చాలా వరకు ఆడవాళ్లే ఎత్తుకునేవారు. భర్త దర్జాగా నడిచేవాడు. ఇప్పుడు అలా కాదు. నా ఫ్రెండ్స్ ఫ్యామిలీలో చాలా మంది భర్తలు భార్యకంటే ముందే నిద్రలేచి పిల్లలను రెడీ చేస్తుంటారు. ఇంటి పనిని సమానంగా పంచుకుంటున్నారు.

● **అయితే మీ భర్త నాగచైతన్య కూడా పిల్లలను ఇలా చూసుకుంటారనే నమ్మకం ఉందా?**

100 శాతం ఉంది. మా ఇంటి కుక్కపిల్లతోనే ఆయన ఎంతో ఓపికగా ఉంటారు. దానికి స్విమ్మింగ్ నేర్పిస్తున్నారు. తనకు నా కంటే చాలా ఓపిక ఎక్కువ. చైతన్య 100 శాతం గ్రేట్ డాడ్ అవుతారు.

● **ఫైనల్లీ... నెక్స్ట్ ప్రాజెక్ట్స్ ఏంటి?**

త్వరలోనే అనౌన్స్ చేయబోతున్నాం.

– డి.జి. భవాని

'ఓ బేబీ' ప్రీ–రిలీజ్ ఫంక్షన్‌లో సునీత, వెంకటేశ్, సమంత, తేజ, రానా, నాగశౌర్య, నందినీరెడ్డి, వివేక్ కూచిభొట్ల

సీజన్ టిప్స్

వర్షాకాలం ప్రయాణమా!

వర్షాకాలంలో ట్రెక్కింగ్, దూర ప్రయాణాలు, చిన్నా పెద్దా టూర్లకు వెళ్లేవారు చిన్న మార్పుతో పర్యావరణానికి మేలు చేసేలా ఒక అడుగు ముందుకు వేయచ్చు. అదెలాగంటే.. జర్నీలో ప్లాస్టిక్‌ను దూరం పెట్టేయాలి. ప్లాస్టిక్ సముద్రంలో తేలియాడుతున్న మనం ప్రకృతికి దగ్గరవడం ఎలాగో చూద్దాం..

చాలా చోట్ల పర్యావరణానికి హితం కలిగించే వస్తువులు, సేంద్రీయ పద్ధతిలో పండించిన ధాన్యం... వైపు జనం ఆసక్తి చూపుతున్నారు. ఇది ఆరోగ్యం కూడా.



● జర్నీలో వాటర్ బాటిల్స్ తప్పనిసరి. మట్టి లేదా గ్లాస్ బాటిల్స్ ఇప్పుడు లభిస్తున్నాయి. వాటికి రక్షణ కవర్ ఒకటి తగిలించుకుంటే సేఫ్. ఇవి మీకు, ప్రకృతికి కూడా ఆరోగ్యకరం. తేలికపాటి బరువు ఉన్న బాటిల్స్ కూడా లభిస్తున్నాయి.

● ప్లాస్టిక్ లంచ్‌బాక్స్‌ల ప్లేస్‌లో 'బొరోసిలికేట్ గ్లాస్ బాక్స్'లు అందుబాటులో ఉన్నాయి. ఇవి బరువు తక్కువ. సిలికాన్ మూతలున్నవి ఎంచుకుంటే పగులుతాయనే భయం కూడా ఉండదు. ఇవి స్కూల్, కాలేజీ, ఆఫీసులకు బాగుంటాయి.

● ప్లాస్టిక్ స్పూన్లతో తినడం, పడేయడం చేస్తుంటారు. ఇవి భూమిలో కలవాలంటే వందల ఏళ్లు పడుతుంది. అలా కాకుండా శుభ్రంగా ఉన్న రెండు స్టీల్ స్పూన్లు, ఒక గుడ్డ నాప్‌కిన్‌లో చుట్టి బ్యాగ్‌లో పెట్టేసుకుంటే చాలు. బయట ఎక్కడా స్పూన్ కోసం వెతకాల్సిన అవసరం ఉండదు. వాడి పడేసి పర్యావరణానికి హాని చేయం.

● వెదురు, కలపతో తయారు చేసిన టూత్‌బ్రష్‌లు మార్కెట్లో లభిస్తున్నాయి. వీటితో ప్లాస్టిక్‌ను మెల్లమెల్లగా దూరం చేయవచ్చు.

● షాంపూ బాటిల్స్, సాచెట్స్ .. అన్నీ ప్లాస్టిక్‌వే. వీటిని దూరం చేయాలంటే రసాయనాలు లేని షాంపూ సోప్ బార్స్, బాడీ బార్స్ తీసుకోవచ్చు.

● రుతుక్రమం సమయంలో వాడే శానిటరీ నాపికిన్స్ బదులు.. ఒక చిన్న డబ్బాలో శుభ్రంగా ఉన్న గుడ్డ నాప్‌కిన్స్, మెనుస్ట్రువల్ కప్స్.. వంటివి సర్దుకోవచ్చు. ఇవి పర్యావరణ హితం, ఆరోగ్యకరం కూడా.

● షాపింగ్ బ్యాగ్‌లకోసం రకరకాల ప్లాస్టిక్ సంచులు ఉపయోగిస్తుంటాం. వీటి బదులు రెండు చేతి సంచులు దగ్గర పెట్టుకుంటే కూరగాయలు, పండ్లు వెంట తెచ్చుకోవడానికి వీలుంటుంది. అలాగే, బాంబూ పెన్నులు, స్ట్రాలు.. వంటి ఎకో–ఫ్రెండ్లీ వస్తువులు సాధ్యమైనంత వరకు తక్కువగా శుభ్రంగా ప్యాకింగ్ చేసుకోవాలి. దీనివల్ల ప్రయాణం మరింత ఆహ్లాదంగా, పర్యావరణహితంగా మారిపోతుంది.

హెల్త్ టిప్స్

మెంతికూరతో ఆరోగ్యం.. సౌందర్యం

మెంతికూర ఆరోగ్యానికి ఎంతో మంచిది. దీనిని పప్పుగానూ, పులుసుకూరగానూ, పచ్చడిగానూ, పొడికూరగానూ వండుకుంటారు. అయితే మెంతికూర ఆహారంగానే కాదు, ఆరోగ్యానికి, అందానికి కూడా ఎంతో ఉపయోగపడుతుంది. అదెలాగో చూద్దాం...

● పైత్యం అధికంగా ఉన్నప్పుడు మెంతి ఆకులను శుభ్రంగా కడిగి రసంగా చేసి, ఒక చెంచా తేనె కలిపి తీసుకుంటే త్వరగా తగ్గుతుంది.

● కామెర్లు వచ్చిన వారికి, లివర్ సిర్రోసిస్‌తో బాధపడుతున్నవారికి మెంతి ఆకులను దంచి కాచిన రసంలో తేనె కలిపి తాగిస్తే ఆకలి పెరిగి త్వరగా కోలుకుంటారు.

● నిద్రలేమి సమస్యతో బాధపడేవారు మెంతి ఆకులను రసంగా చేసి రాత్రి భోజనానికి ముందు తాగితే చక్కగా నిద్రపడుతుంది.

● మెంతి ఆకుల రసాన్ని పిప్పితో సహా నిమ్మకాయ పిండి భోజనానికి ముందు తాగితే స్థూలకాయులు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు మంచి ఫలితం కనిపిస్తుంది.

● మెంతి ఆకును దంచి పేస్ట్‌గా చేసి తలకు రాస్తే చుండ్రు, వెంట్రుకలు రాలడం తగ్గుతుంది. కురులు నల్లగా నిగనిగలాడతాయి. ఈ ఆకుల పేస్ట్‌గా ముఖానికి రాస్తే ముఖంపై మొటిమలు, మచ్చలు తగ్గుతాయి. ముఖం పొడి బారడం తగ్గుతుంది.

● తాజాగా ఉండే గుప్పెడు మెంతి ఆకులను తీసుకుని రోట్లో వేసి మెత్తగా నూరి, ఆ పేస్టును ముఖం మీద వైట్‌హెడ్స్ అధికంగా ఉండే చోట పట్టించి రాత్రంతా అలాగే ఉంచుకోవాలి. ఉదయం లేవగానే గోరువెచ్చటి నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకోవాలి. ఇలా చేస్తే కొన్ని రోజులకు మొటిమల బారి నుంచి విముక్తి లభిస్తుంది.

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ ॥ ఆదివారం
30-6-2019

ఈ పాటకు ట్యూన్ తెలుసా?

కటేసేయ్...దాచేయ్...

పల్లవి :

ఈ మంచుల్లో ప్రేమంచుల్లో ఎన్నెన్నో సంగతులు
నీరెండల్లో ఈ గుండెల్లో ఎన్నెన్నో సందడులు
కవ్వించే చీకటి కన్నుల్లో ఈ తడి ఇవ్వాళే వీడెనులే
ఉండుండి ఊహలు ఈ పిల్లగాలులు నిన్నే పిలిచెనులే

॥ఈ మంచుల్లో॥

చరణం : 1

కనులకు జతగా వలపుల కథనే కలలుగ కొసరనా
గలగల పలికే పెదవుల కొస నే కబురునై నిలవనా
నేడిలా మది విరిసెను ప్రేమలో
తేనెలే పెదవొలికెను జంటలో కలయికలో

॥ఈ మంచుల్లో॥

చరణం : 2

మలుపులు దాటి మనసులు మీటి నిలిచె నీ మమతలే
ఒకపరి జననం ఒకపరి మరణం నిలువునా తొలిచెలే
యవ్వనం మనసుకు తొలి మోహనం
చుంబనం వయసుకు ఒక వాయనం... అనుదినము

॥ఈ మంచుల్లో॥

చిత్రం : రంగం
రచన : వనమాలి
సంగీతం : హారీస్ జయరాజ్
గానం : శ్రీరామ్ పార్థసారథి, బాంబే జయశ్రీ

కాసుకో సుడోకు

4		2	5	8			7	
8		9			7		2	
6			1	2		3		
	8	1		7				
7				3				8
				1		6	5	
		7		9	8			3
	2		3			7		1
	9			5	1	8		2

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3x3 చదరం లోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

7	1	5	8	9	4	3	2	6
2	4	9	6	7	3	8	5	1
8	6	3	5	2	1	9	7	4
4	9	1	2	5	7	6	8	3
6	8	7	1	3	9	2	4	5
5	3	2	4	8	6	7	1	9
3	7	4	9	1	8	5	6	2
9	5	6	7	4	2	1	3	8
1	2	8	3	6	5	4	9	7

రామ్, నిధీ అగర్వాల్

పోరీ... ఉండిపో

ఇస్మార్ట్ శంకర్ మస్తు మాను. అట్లని హీరోయిన్లతో అన్నీ మాస్ పాటలే పాడుకుంటాడా ఏందీ? మెలోడీలు కూడా పాడుకుంటాడు. తన ప్రేయసిని ప్రేమగా ఉండిపోమంటాడు. రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఇస్మార్ట్ శంకర్'. డబుల్ దిమాక్ హైదరాబాద్ అన్నది క్యాప్షన్. నిధీ అగర్వాల్, నభా నటేశ్ హీరోయిన్లు. చార్మీ, పూరి జగన్నాథ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. మణిశర్మ కంపోజ్ చేసిన 'ఉండిపో ఉండిపో..' అనే మెలోడీ సాంగ్‌ను శనివారం రిలీజ్ చేశారు. అనురాగ్ కులకర్ణి పాడిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించారు. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకుంటున్న ఈ చిత్రం జూలై 12న రిలీజ్ కానుంది. ఈ చిత్రానికి కెమెరా: రాజ్ తోట.

దోసేస్తారు!

షూటింగ్‌లు, ప్రమోషన్‌లు, కొత్త సినిమా స్క్రిప్ట్‌లు వినడం... ఇలా ఆర్టిస్టుల లైఫ్ బిజీ బిజీగా ఉంటుంది. ఎప్పుడో కానీ కాస్త టైమ్ దొరకదు. ఆ టైమ్‌లో ఎవరికి నచ్చిన పని వారు చేస్తూ పని ఒత్తిడి నుంచి రిలాక్స్ అవుతుంటారు. సోనమ్ కపూర్, శ్రుతీహాసన్ లాంటి హీరోయిన్లు ఖాళీ సమయాల్లో బొమ్మలు వేస్తారు. శ్రియ, దిశా పాట్నీ, పరిణీతి కేటగిరీ వారు సముద్రతీరాలకు వాలిపోతారు. మిల్కీ బ్యూటీ తమన్నా మాత్రం వంటింట్లోకి దూరి గరిటె చేత పట్టుకుని దోశలు వేశారు. ఇందుకు సంబంధించిన వీడియోను తన ఇన్‌స్టాగ్రామ్ స్టేటస్ యాప్‌లో షేర్ చేసుకున్నారు. మరి.. దోశ టేస్ట్ ఎలా ఉందనే విషయం మాత్రం ఈ బ్యూటీనే అడగాలి. వెండితెరపై తన అందం, అభినయంతో ప్రేక్షకులు మనసులు దోచేసిన తమన్నా ఇప్పుడు కావాల్సినవాళ్లకు ఇంట్లో దోసెలు వేసి, వారి మనసుని కూడా దోసేస్తున్నారేమో! ఇక సినిమాల విషయానికి వస్తే.. సౌత్‌లో వరుస సినిమాలకు సైన్ చేస్తూ జోష్ మీద ఉన్న ఈ బ్యూటీ ఇటీవల 'బోలే ఛూడియా' అనే హిందీ సినిమాకు సైన్ చేశారు.

తమన్నా

తగ్గానండి!

అమెరికా పోలీసాఫీసర్ల చట్టాలను బాగా స్టడీ చేస్తున్నారు మన తెలుగు అమ్మాయి అంజలి. అక్కడి చట్టాలతో ఇక్కడి అమ్మాయికి పనేంటా అని ఆలోచనలో పడ్డారా? మరేం లేదు.. ఆమె 'నిశ్శబ్దం' సినిమాలో అమెరికన్ పోలీసాఫీసర్‌గా నటిస్తున్నారు. హేమంత్ మధుకర్ దర్శకత్వంలో అనుష్క, మాధవన్, అంజలి, షాలినీ పాండే, మైఖేల్ మ్యాడ్‌సన్ ముఖ్య పాత్రలుగా 'నిశ్శబ్దం' అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ సినిమా షూటింగ్ అమెరికాలో జరుగుతుంది. ఇటీవలే ఓ పాటను కూడా చిత్రీకరించారు. మాధవన్, అనుష్కలపై ప్రస్తుతం కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. బధిర యువతి (చెవుడు, మూగ) పాత్రలో అనుష్క నటిస్తున్నారు. ఇటీవలే అంజలిపై కొన్ని సన్నివేశాలను షూట్ చేయడం జరిగింది. ఈ చిత్రంలో చేస్తున్న పోలీసాఫీసర్ పాత్ర కోసం ఆమె ఎనిమిది కిలోల బరువు కూడా తగ్గారు. అంతే కాదండోయ్... కెరీర్‌లో అంజలి తొలిసారి పోలీసాఫీసర్ పాత్రలో నటిస్తుండటం విశేషం. ''నిశ్శబ్దం' సినిమాలో యూఎస్ పోలీసాఫీసర్‌గా నటిస్తున్నాను. ఈ పాత్ర కోసం ఫిజికల్‌గా కూడా చాలా కష్టపడాల్సి వచ్చింది. ముఖ్యంగా అమెరికా పోలీసుల బాడీ లాంగ్వేజ్, వారి చట్టాల గురించి స్పెషల్ కోర్స్ తీసుకున్నాను'' అన్నారు అంజలి.

అంజలి

తెర పైకి క్రికెటర్ బ్రావో

తక్కువ కాలంలోనే మంచి కాంబినేషన్‌తో సినిమాలు చేసి తమ ఉనికిని గట్టిగా చాటుకొన్న పీపుల్ మీడియా ఫ్యాక్టరీ ఓ షార్ట్ ఫిలింను ఎనౌన్స్ చేశారు. అది కూడా ప్రముఖ వెస్టిండీస్ ఆల్‌రౌండర్ డారెన్ బ్రావోతో కావడం విశేషం. ప్రస్తుతం సమంత ముఖ్య పాత్రలో 'ఓ బేబి', వెంకటేశ్, నాగచైతన్య కాంబినేషన్‌లో మల్టీస్టారర్ మూవీ 'వెంకీమామ' చిత్రాన్ని నిర్మిస్తోంది సంస్థ. అలాగే అనుష్క, మాధవన్ కాంబినేషన్‌లో మరో చిత్రాన్ని నిర్మిస్తోంది. ''డారెన్ బ్రావోతో ఓ షార్ట్ ఫిలింను ప్లాన్ చేశాం'' అని నిర్మాత టి.జి. విశ్వప్రసాద్ తెలిపారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా శనివారం బ్రావో, పీపుల్ మీడియా ఫ్యాక్టరీకి ఒప్పందం జరిగింది. కోయంబత్తూర్, తమిళనాడు, వెస్ట్‌ఇండీస్‌లోని ట్రినిడాడ్, టొబాగోలలో చిత్రీకరణ జరుపుకోనుంది. ఈ కార్యక్రమంలో బ్రావోతో పాటు, టి.జి.విశ్వప్రసాద్, నిర్మాత వివేక్ కూచిభొట్ల, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ నటరాజ్ పిళ్లై పాల్గొన్నారు.

వివేక్ కూచిభొట్ల, బ్రావో, నటరాజ్

ఇకపై జడ్జిమెంటల్ హై క్యా?

అందరిలా మనమూ లేమే? అని మానసికంగా ఇబ్బంది పడే వారు బాధపడకుండా ఎవరి ఇండివిడ్యువాలిటీని వారు ఎంజాయ్ చేయాలి. ఎవరి జీవితాన్ని వాళ్లు సెలబ్రేట్ చేసుకోవాలి అనే కాన్సెప్ట్‌తో తెరకెక్కిన చిత్రం 'మెంటల్ హై క్యా'. కంగనా రనౌత్, రాజ్‌కుమార్ రావ్ హీరోహీరోయిన్లుగా నటించారు. ప్రకాశ్ కోవెలముడి దర్శకత్వంలో ఏక్తా కపూర్ నిర్మించారు. జూలై 26న ఈ చిత్రం రిలీజ్‌కు రెడీ అయింది. 'మెంటల్ హై క్యా' టైటిల్‌ను ఇండియన్ సైకియాట్రిక్ సొసైటీ (ఐఎస్ఎస్) సంస్థ తీవ్రంగా వ్యతిరేకించింది. ఈ చిత్రం టైటిల్ మానసిక సమస్యలతో బాధపడేవారిని కించపరిచే విధంగా ఉందని ఆ సంస్థ కోర్టును ఆశ్రయించింది. దీంతో ఈ సినిమా టైటిల్‌లో స్వల్ప మార్పులు చేసి 'జడ్జిమెంటల్ హై క్యా' అని పేరు మార్చారు చిత్రబృందం. ఈ విషయాన్ని ఏక్తా కపూర్ స్పష్టం చేస్తూ – ''ఈ చిత్రం మానసికంగా ఇబ్బంది పడుతున్నవారిని తక్కువ చేసేలా ఉండదు. అలాగే టైటిల్‌తో ఎవరి సెంటిమెంట్స్‌నీ హర్ట్ చేయాలనే ఉద్దేశం మాకు లేనే లేదు. ఈ సినిమాలో మానసిక సమస్యలను సెన్సిటివ్‌గా డీల్ చేశాం'' అన్నారు.

కంగనా రనౌత్

గుణతో మంచి కెమిస్ట్రీ

మాలీవుడ్ నుంచి మరో భామ టాలీవుడ్ తలుపు తట్టారు. కార్తికేయ హీరోగా అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో అనిల్ కడియాల, తిరుమల్ రెడ్డి నిర్మించిన సినిమా 'గుణ 369'. ఈ సినిమాలోకి అనఘను కథానాయికగా తీసుకున్నట్లు చిత్రబృందం వెల్లడించారు. ''తమిళ చిత్రం 'నట్పే తునై'లో అనఘ నటించారు. ఆ సినిమాలోని కొన్ని సీన్లు చూసి 'గుణ 369' చిత్రంలో కథానాయికగా ఎంపిక చేసుకున్నాం. అనుఘ కూడా టాప్ రేంజ్‌కి వెళ్తుందనే నమ్మకం ఉంది'' అన్నారు అర్జున్. కార్తికేయ, అనఘ జోడీ బాగుంది. ఇద్దరి కెమిస్ట్రీ బాగా కుదిరింది. ఆమె స్టార్ మెటీరియల్ అని నా నమ్మకం. అనఘ స్వతహాగా క్లాసికల్ డ్యాన్సర్ కావడంతో డ్యాన్సుల విషయంలోనూ బాగా హెల్ప్ అయ్యింది. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం'' అన్నారు నిర్మాతలు. ఈ సినిమాకు చేతన్ భరద్వాజ్ సంగీతం అందించారు.

అనఘ

పిల్లలకోసం అక్షరం...

అక్షరం తెలిస్తే సమాజంలో ఎక్కడైనా బతకొచ్చు. నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చే క్రమంలో మన ప్రభుత్వాలు విద్యకు పెద్దపీట వేస్తున్నాయి. పిఎల్ క్రియేషన్స్ పతాకంపై మిమిక్రీ కళాకారునిగా 7000 ప్రదర్శనలిచ్చి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో స్థానం సంపాందించిన నటుడు లోహిత్ నిర్మాతగా మారి 'అక్షరం' అనే సినిమా నిర్మిస్తున్నారు. ప్రముఖ నటుడు జాకీ తోట ఈ చిత్రానికి దర్శకుడు. షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం రిలీజ్‌కు రెడీగా ఉంది. ఈ చిత్రం ట్రైలర్‌ను, ఫస్ట్ లుక్‌ను హీరో శ్రీకాంత్ విడుదల చేశారు. జాకీ మాట్లాడుతూ– ''నేను మొదటిసారిగా దర్శకత్వం చేసిన చిత్రం ఇది. సినిమా బాగా వచ్చింది. ప్రతి ప్రేక్షకుడు చూడాల్సిన చిత్రం 'అక్షరం'' అన్నారు. లోహిత్ మాట్లాడుతూ– ''విద్యావ వస్థలో ఉన్న లోపాలను చూపించే సినిమా ఇది. జాకీగారు సినిమా గురించి చెప్పినప్పుడు ఎగ్జైట్ అయ్యాను. ఈ సినిమాకి పరుచూరిగారు ఇచ్చిన సూచనలు మర్చిపోలేనివి'' అన్నారు. శ్రీకాంత్ మాట్లాడుతూ– ''అందరినీ ఆలోచింప చేసే విధంగా ఈ సినిమా ఉంటుంది. పిల్లల కోసం పేరెంట్స్ ఎంత కష్టపడతారో, వారి భవిష్యత్ కోసం ఏమేం చేస్తారో తెలిపే చిత్రమే 'అక్షరం'' అన్నారు.

లోహిత్, శ్రీకాంత్, జాకీ

ప్రేమికుల సంశయం

అనిరుధ్ కస్తూరి, దివ్య జంటగా మహేష్ చెంగారెడ్డి దర్శకత్వంలో తెరకెక్కిన సినిమా 'సంశయం'. ఈ సినిమా చిత్రీకరణ పూర్తయింది. త్వరలో మోషన్ పోస్టర్‌ను విడుదల చేయనున్నారు. మహేష్ మాట్లాడుతూ– ''ప్రేమించడానికి, ప్రేమించనని చెప్పడానికి మధ్య ఉండే సున్నితమైన అంశాలతో ఈ చిత్రాన్ని తెరకెక్కించాం. నేటి యువతరం ప్రేమను ఎలా రిసీవ్ చేసుకుంటుందో అన్న విషయాన్ని చర్చించాం. ప్రేమను కొత్త కోణంలో చూపించాం. నటీనటులంతా ఎన్ఆర్ఐలు కావడం విశేషం. అందరూ కొత్తవారే అయినప్పటికి అనుభవం ఉన్నవారిలా నటించారు. ఈ చిత్రానికి ఈ టైటిల్‌నే ఎందుకు పెట్టామనే విషయం సినిమా చూస్తేనే తెలుస్తుంది'' అని అన్నారు.

అనిరుధ్, దివ్య

నాని

నా పేరు సింబా

డిస్నీ సినిమాలను చిన్నపిల్లల నుంచి పెద్దవాళ్లవరకూ అందరూ ఎంజాయ్ చేస్తారు. డిస్నీ సినిమాల్లో స్పెషల్‌గా నిలిచే చిత్రం 'లయన్ కింగ్'. తండ్రి సింహం (ముఫాసా) చనిపోవడంతో తన రాజ్యాన్ని లయన్ కింగ్ (సింబా) ఎలా చూసుకుంది? అనే కథ ఆధారంగా ఈ యానిమేషన్ మూవీ 1994లో తెరకెక్కింది. తాజాగా ఈ చిత్రానికి కొత్త వెర్షన్‌ను తీసుకొస్తోంది డిస్నీ సంస్థ. ఈ సినిమాను ఇండియాలో పలు ప్రాంతీయ భాషల్లో డబ్ చేస్తున్నారు. తెలుగులో ముఫాసా పాత్రకు జగపతిబాబు, టిమోన్ అండ్ పుంబా పాత్రలకు అలీ, బ్రహ్మానందం డబ్బింగ్ చెప్పారు. తాజాగా సింబా పాత్రకు నాని డబ్బింగ్ చెప్పడం విశేషం. ''ఈ ఏడాది నన్ను తండ్రి పాత్రలో ('జెర్సీ' సినిమా) చూశారు. ఇప్పుడు కొడుకు పాత్రలో వినిపించబోతున్నాను. ఈ జూలై నాకో కొత్త పేరు రాబోతోంది. అదే సింబా'' అని ట్వీటర్‌లో పేర్కొన్నారు నాని.

కరీనా కపూర్

లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్

ప్రొఫెషనల్ లైఫ్‌ను, పర్సనల్ లైఫ్‌ని భలేగా బ్యాలెన్స్ చేస్తున్నారు బాలీవుడ్ బ్యూటీ కరీనా కపూర్. ప్రస్తుతం లండన్‌లో హాలిడే మోడ్‌లో ఉన్నారు కరీనా. తన టీవీ డ్యాన్స్ షో 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్' కోసం ఒక్క రోజు ముంబై వచ్చి, షూట్ కంప్లీట్ చేసుకుని మళ్లీ లండన్ ఫ్లైట్ ఎక్కారని బాలీవుడ్ సమాచారం. 'డ్యాన్స్ ఇండియా డ్యాన్స్ షో'లో కరీనా జడ్జ్‌గా వ్యవహరిస్తున్నారు. గత రెండు వారాలుగా ఒక్క రోజు కోసం ముంబై రావడం, లండన్ వెళ్లడం జరుగుతోందట. ఇక అక్షయ్ కుమార్ 'గుడ్‌న్యూస్' చిత్రం షూటింగ్‌ని పూర్తి చేసిన కరీనా.. త్వరలో 'అంగ్రేజీ మీడియం' మూవీ షూటింగ్‌లో జాయిన్ అవుతారు. ఇంకా కరణ్ జోహార్ 'తక్త్', ఆమిర్‌ఖాన్ 'లాల్‌సింగ్ చద్దా' సినిమాల్లో కరీనా హీరోయిన్‌గా నటించనున్న సంగతి తెలిసిందే. ఇలా... సినిమాలు, టీవీ షోలు, హాలిడేలతో 'మై లైఫ్ ఈజ్ బ్యూటీఫుల్' అంటున్నారు కరీనా.

కృతీ సనన్

టైమింగ్ ముఖ్యం

'పర్‌ఫెక్ట్ టైమింగ్‌లో కరెక్ట్ ఎక్స్‌ప్రెషన్ ఇవ్వకపోతే కామెడీ పండదు. కామెడీ పాత్రలు చేయడం అంత సులువేం కాదు' అంటున్నారు కృతీసనన్. హిందీ చిత్రం 'హౌస్‌ఫుల్ 4'లో ఆమె పాత్రలో మంచి కామిక్ యాంగిల్ ఉందట. ఈ విషయం గురించి కృతీ చెబుతూ– ''ఇవాళ్టి పరిస్థితుల్లో అందరి జీవితాల్లోనూ ఏదో రకమైన స్ట్రెస్ ఉంటోంది. అందుకే మా సినిమాలకు వచ్చే ఆడియన్స్‌ను ఎంటర్‌టైన్ చేసి బాగా నవ్వించాలి. ఇప్పుడు నేను చేస్తున్న 'హౌస్‌ఫుల్ 4, అర్జున్ పటియాలా' చిత్రాల్లోని నా పాత్రలో మంచి కామిక్ యాంగిల్ ఉంది. మనలో ఎంత యాక్టింగ్ స్కిల్ ఉన్నప్పటికీ కామెడీ చేయడానికి మాత్రం టైమింగ్ చాలా ముఖ్యం. లొకేషన్‌లో అక్షయ్‌కుమార్, రితేష్ దేశ్‌ముఖ్‌ల కామెడీ టైమింగ్‌ను చూసి ఎంతో నేర్చుకున్నాను'' అన్నారు కృతీ సనన్.

హర్షిత్

అందమైన ప్రేమకథ

హర్షిత్, వంశీకృష్ణ పాండ్య, శ్రీపద్మ, మాధవి, బిశ్వజిత్ నాథ్ ముఖ్య తారలుగా తెరకెక్కిన చిత్రం 'నేను లేను'. 'లాస్ట్ ఇన్ లవ్' అనేది ఉపశీర్షిక. రామ్‌కుమార్ దర్శకత్వంలో ఓ.యస్.యం విజన్–దివ్యాషిక క్రియేషన్స్ పతాకాలపై సుక్రి నిర్మించిన ఈ సినిమా జూలై 12న విడుదల కానుంది. రామ్‌కుమార్ మాట్లాడుతూ– ''అందమైన ప్రేమకథతో తెరకెక్కిన సైకలాజికల్ థ్రిల్లర్ చిత్రమిది. సన్నివేశాలు ఆద్యంతం ప్రేక్షకులను ఉత్కంఠపరుస్తాయి. ఈ సినిమా ట్రైలర్‌ని ఇప్పటి వరకూ కోటి మంది చూశారు. ట్రైలర్ లాగే సినిమా కూడా అందర్నీ ఆకట్టుకుంటుంది'' అన్నారు. ''ఇండియన్ సినిమా స్క్రీన్‌పై ఇప్పటి వరకు రాని సరికొత్త కాన్సెప్ట్‌తో వస్తున్న సినిమా ఇది'' అని సుక్రి అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఆశ్రిత్, కెమెరా: ఎ. శ్రీకాంత్, నిర్వాహణ: సురేష్ కూరపాటి, సహనిర్మాత: యషిక.

శ్రీతేజ్

ఏ సినిమా చూసినా అందులో నేనే హీరోని!

వైఎస్ రాజశేఖర రెడ్డి, చంద్రబాబు నాయుడు, దేవినేని నెహ్రూ.. ఈ మూడు పాత్రల్లో ఒదిగిపోయిన నటుడు శ్రీ తేజ్. ఈ పాత్రల ద్వారా ఇండస్ట్రీలో మంచి పేరు సంపాదించుకోవడంతో పాటు ప్రేక్షకుల్లో కూడా గుర్తింపు తెచ్చుకున్నారు. త్వరలో విడుదల కానున్న 'అక్షర'లో హీరోగా నటించడంతో పాటు మరికొన్ని చిత్రాలు సైన్ చేసిన శ్రీతేజ్ చెప్పిన విశేషాలు.

● 'కథానాయకుడు, మహానాయకుడు', 'లక్ష్మీస్ ఎన్టీఆర్'కన్నా ముందే నేను 'నా సామి రంగా', 'తీయని కలవో', 'కదిలే బొమ్మల కథ' సినిమాల్లో హీరోగా చేశా. అవి హిట్ కాలేదు. సినిమా హిట్ అయితేనే మేం జనంలోకి వెళ్లగలుగుతాం. లేకుంటే అది ఎంత మంచి సినిమా అయినా వెళ్లలేం. హిట్‌కి, ఫ్లాప్‌కి ఉన్న డిఫరెన్స్ అదే. ఎన్టీఆర్ 'కథానాయకుడు, మహానాయకుడు' సినిమాల్లో వైఎస్ రాజశేఖర రెడ్డి గారి పాత్ర చేశాను. అది మంచి పేరు తెచ్చింది. అలాగే 'లక్ష్మీస్ ఎన్టీఆర్'లో చేసిన చంద్రబాబునాయుడిగారి పాత్ర కూడా ప్రశంసలు తెచ్చింది.

● నాది విజయవాడ. బీకాం చదువుకున్నా. చిన్నప్పటి నుంచి యాక్టర్ అవ్వాలనే ఫ్యాంటసీలో ఉండేవాణ్ణి. 'టెర్మినేటర్' సినిమాని ఇంట్లో వీసీఆర్‌లో నాన్నగారు చూపించారు. స్కూల్ నుంచి వచ్చేటప్పుడు నేనే హీరోలా ఫీలై, ప్యాడ్‌ని గన్‌లా పట్టుకునేవాణ్ణి. ఏ సినిమా చూసినా అందులో హీరో పాత్రలో నన్ను ఊహించుకుంటూ అనుకరించేవాణ్ణి.

● ఏడాదికి 365 రోజులు అయితే అప్పట్లో నాకు 35 రోజులే పని. మిగతా రోజుల్లో ఖాళీ. ఈ టైమ్‌లోనే మానసికంగా బలంగా ఉండాలి. ఈలోపు మైండ్ ఖాళీగా ఉంటుంది. ఒక యాక్టర్‌కి ఎంత బాధ ఉన్నా సరే ఆ బాధ మొహంలో కనిపించకూడదు.. బాడీ ఫిట్‌గా ఉంచుకోవాలి. ఎప్పుడూ బ్రెయిన్‌లో ఒత్తిడి ఉండకూడదు. అందుకని సోషియల్ అవేర్‌నెస్ ప్రోగ్రామ్స్ ఏవైనా ఉంటే... డబ్బులు ఖర్చు పెట్టకపోయినా ఫిజికల్‌గా అయినా నా సహకారం ఉంటుంది కదా అని నా ఫ్రెండ్‌తో కలిసి హెల్పింగ్ నేచర్ వర్క్స్ ఉంటే చేసేవాణ్ణి. మొదటి నుంచీ హెల్పింగ్ నేచర్ ఉన్నవాణ్ణి నేను. క్రమశిక్షణగా ఉండటానికి ఎన్‌సీసీ ఉపయోగపడింది. స్పోర్టివ్‌గా ఉండటానికి స్పోర్ట్స్.. సినిమాలు చూస్తే ఒత్తిడి ఉండదు. ఒక మనిషిని అభివృద్ధి చేయడానికి ఒక్కో అంశం ఉపయోగపడుతుందని నా అభిప్రాయం.

● విడుదలకు సిద్ధమైన 'అక్షర'లో హీరోగా చేశాను. అయితే అన్ని సినిమాల్లోనూ హీరోగానే చేయాలని ఫిక్స్ కాలేదు. కథని ముందుకు నడిపించడానికి ప్రాధాన్యత ఉన్న ఏ పాత్ర అయినా చేయడానికి సిద్ధం. హిందీలో నవాజుద్దీన్ సిద్ధిఖీ, నసీరుద్దీన్ షా, ఇమ్రాన్ ఖాన్.. వీళ్లంతా మంచి మంచి పాత్రలు చేస్తున్నారు. వాళ్లలా చేయాలనుకుంటున్నాను.

ఆలయం.. ఆగమం

నిర్మాల్యప్రియుడు.. చండేశ్వరుడు

శివాలయాలలో నిర్మాల్యద్వారం పక్కనే ఒక చిన్న దేవాలయం లేదా ఒక గూడు ఉంటుంది. అక్కడ చండేశ్వరుడు ఉంటాడు. శివనిర్మాల్యాన్ని ఆయనకి సమర్పిస్తారు. శివనిర్మాల్యంపై అధికారం ఒక్క చండేశ్వరుడికే ఉంది. దాని వెనుక ఓ కథ.

పూర్వం యచ్ఛదత్తనుడు అనే అతనికి విచారశర్మ అనే కుమారుడుండేవాడు. ఇతడు వేదాధ్యాయి. రోజూ ఆవులను అడవికి తీసుకువెళ్లి మేపుకొని మళ్లీ ఊరిలోకి తీసుకువచ్చేవాడు. ప్రతిరోజూ అడవిలో ఇసుకతో శివలింగం చేసి ఆ ఆవులపాలతో అభిషేకించేవాడు. గిట్టనివాళ్ళు ఆవుపాలను నేలపాలు చేస్తున్నాడని అతని తండ్రికి చెప్పారు. దాంతో చండేశ్వరుడు పూజ చేస్తున్న చోటుకు వెళ్లి కోపంతో శివలింగాన్ని కాలితో తన్నాడు. యచ్ఛదత్తనుడు ఆగ్రహంతో ఊగిపోతూ తన దగ్గర ఉన్న కట్టెను తీసుకుని అతని కాలిపై కొట్టగానే అది గొడ్డలిగా మారి రెండు కాళ్లను నరికివేసింది. అఖండమైన అతడి శివభక్తికి మెచ్చిన శివుడు ప్రత్యక్షమై తన మెడలోని దండను తీసి అతడి తలపై చుట్టి శివనిర్మాల్యంపై అధికారాన్ని అనుగ్రహించాడు.

చేతిలో అంకుశాన్ని (గొడ్డలి) ఉంచుకొని రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ కూర్చుని, లేక నిలుచున్న భంగిమలో ఈ చండేశ్వరుడుంటాడు. శివాలయానికి వెళ్లిన భక్తులెవరైనా చండేశ్వరుని దర్శించి గుడిలో ఇచ్చిన పూలు మొదలైనవి ఆయన దగ్గర ఉంచి రావాలి. చండేశ్వరుడు లేని ఆలయంలో నంది వద్ద ఉంచాలి. చండేశ్వరుడున్న శివాలయంలో చేసే ప్రదక్షిణను చండప్రదక్షిణ అంటారు. ముందుగా చండేశ్వరుడి వద్దకు వెళ్లి సంకల్పించుకొని అక్కడ నుండి వచ్చిన దారినే నంది దగ్గరకు రావాలి. నంది నుండి ఎడమవైపుకు వెళ్లి చండేశ్వరుణ్ణి దర్శించాలి. తిరిగి నంది వద్దకు వచ్చి అక్కడ నుంచి కుడివైపుగా సోమసూత్రం దగ్గరకు వెళ్లాలి.అక్కడ నుండి తిరిగి నంది వద్దకు వచ్చి, అక్కడ నుండి చండేశ్వరుడి వద్దకు తిరిగి కుడివైపు సోమసూత్రం వరకూ వచ్చి తిరిగి చండేశ్వరుడి వద్దకు అక్కడ నుంచి నంది వద్దకు రావాలి. సోమసూత్రం దాటకపోవడమే ఈ ప్రదక్షిణలోని ఆంతర్యం.

– కందుకూరి వేంకట సత్యబ్రహ్మాచార్య, ఆగమ, శిల్పశాస్త్ర పండితులు

దాసోహమయ్యాను... అందుకే దగ్గరయ్యాను

నిర్వహణ: డి.వి.ఆర్. భాస్కర్

కథా నీతి

అష్టపత్నులు, పదహారు వేల గోపికలు ఉన్నప్పటికీ నిత్యమూ కృష్ణుడుని అంటి పెట్టుకుని గడిపే అవకాశం వేణువు మాత్రమే పొందింది. బృందావనంలో ఒకసారి గోపికలందరూ వేణువు మీద అసూయ పడ్డారు. వేణువు మీద అంత ఇష్టం ఎందుకో చెప్పమని కృష్ణుడిని చుట్టుముట్టారు. చిలిపి కృష్ణుడు కొంటెగా నవ్వి ఆ రహస్యం వేణువునే అడిగి తెలుసుకోమన్నాడు.

''మేమంతా కృష్ణుడి సాంగత్యం, సాన్నిహిత్యం, కడగంటి చూపు కోసం కళ్ళు కాయలు కాచేలా ఎదురు చూస్తుంటాము. ఎప్పటికో తప్ప ఆ అదృష్టం వరించదు. మరి నిత్యం కృష్ణుడితో ఉండే భాగ్యం నీకు దక్కింది. నీకేమైనా మాయలు తెలుసా? నీవేదైనా ప్రత్యేక వస్తువుతో తయారయ్యావా?'' అని గోపికలు వేణువుని ప్రశ్నించారు.

''మాయలు, మంత్రాలూ తెలియవు. మీరనుకునే విధంగా ప్రత్యేక వస్తువుతో తయారు కాలేదు. సుగంధం వెదజల్లడం కూడా తెలియని దాన్ని. మీకు ఇంకో విషయం కూడా చెప్పాలి. సొంతంగా సంగీతం ఆలపించడం కూడా నాకు తెలియదు'' అంది.

గోపికలు ఆశ్చర్యంతో ''నీ సొంత ఆలాపన కూడా చేయకుండా కృష్ణుడితో ఉండగలుగుతున్నావా? నమ్మలేకుండా ఉన్నాము. మరి నీ నుండి వినిపించే సుమధుర సంగీతం మాటేమిటి?'' అని అడిగారు.

''సొంత ఊహలు, సొంత ఆలోచనలు లేకుండా పూర్తిగా కృష్ణుడికి దాసోహమయ్యాను. నాకిష్టమైన సంగీతం ఎప్పుడూ ఆలపించలేదు. కృష్ణుడు ఇష్టపడి సృష్టించిన సంగీతాన్ని మాత్రమే ఆలపించాను. ఆయన సంగీత సాధనకు కేవలం ఒక సాధనం అయ్యాను. అందుకే దగ్గరయ్యాను'' అంది వేణువు వినమ్రంగా.

కృష్ణుడి సాన్నిధ్యం కావాలంటే ఏం చేయాలో బోధపడింది గోపికలకు.

– నారంశెట్టి ఉమామహేశ్వర రావు

సంగీత సాహిత్యం

ఉదాహరణ ఇంకేం కావాలి?

బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

నిజాం ప్రభువు ఆజ్ఞమేరకు రామదాసును కారాగారంలో బంధించి భటులు కొరడాలతో కొడుతుంటే..రక్తం ఏరులై ప్రవహిస్తుంటే..'ఓరామ నీ నామమెంత రుచిరా/పాలూతేనియలకన్నా పంచదార చిలకలకన్నా శ్రీరామ నీనామమెంతరుచిరా..'' అని తన్మయత్వంతో పాడుతున్నారు ఆయన. రామభక్తి చెక్కు చెదరలేదు, భార్యాబిడ్డలు ఏమయినారన్న బెంగలేదు. భద్రాచలంలో నా రాముడిని చూసి ఎన్నాళ్ళయిందో అన్న దిగులు తప్ప మరో ఆలోచనే లేదు. చిట్టచివరన ఓ రోజున ఆయనకి తేలు కుట్టింది. కడుపు నొప్పి వచ్చింది. భటులు ఆపకుండా చావగొడుతున్నారు. ఒళ్ళు హూనమయిపోతున్నది..వాటితో ఆయన బాధపడుతూ ''ఇక్ష్వాకు కుల తిలకా, ఇకనైనా పలుకవే రామచంద్రా''...అంటూ ''సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్ర/ఆ పతకమునకు పట్టె పదివేల వరహాలు రామచంద్ర/ కలికి తురాయి నీకు మెలుకువగ చేయిస్తి రామచంద్ర/ నీవు కులుకుచు తిరిగేవు ఎవరబ్బ సొమ్మని రామచంద్ర/నీ తండ్రి దశరథ మహరాజు పెట్టెనా రామచంద్ర/లేక నీ మామ జనక మహరాజు పంపెనా రామచంద్ర...'' అని నిందిస్తూనే... మళ్ళీ బాధపడి ''అయ్యో! ఇంత మాటన్నానా'' అని కొంచెం నొప్పి తగ్గగానే...''అబ్బ తిట్టితినని ఆయాస పడవద్దు రామచంద్ర/ఈ దెబ్బల కోర్వక అబ్బ తిట్టితి నయ్య రామచంద్ర'' అంటారు. అయినా తన రాముడు పలకక పోయేసరికి అక్కసుతో ''పలుకే బంగారమాయెనా కోదండ పాణీ'' అంటారు... భక్తి పారవశ్యత చూడండి. అయినా ఉలుకూ పలుకూ లేని రాముడి వ్యవహారం చూసి ''అసలు ఈ రామనామాన్ని ఎందుకు చేసిందమ్మా అద్రిజ, ఎందుకు చేసాడమ్మా గజేంద్రుడు... ఈయన రక్షించేవాడా? ఎంత పిచ్చివాణ్ణయిపోయానమ్మా...మా అమ్మ అలా కాదు చాలా కరుణామూర్తి, మా అమ్మ నామాట కాదనదు'' అంటూ... సీతమ్మ తల్లితో ఇలా మొరపెట్టుకున్నాడు...''నను బ్రోవమని చెప్పవే సీతమ్మ తల్లీ నను.. బ్రోవమని చెప్పవే/ నను బ్రోవమని చెప్పు నారీ శిరోమణి జనకుని కూతురా..జననీ జానకమ్మా!''అని చేతులు వెనక్కి పెట్టుకుని తల పక్కకి వాల్చేసి ''అమ్మా! నీవయినా చెప్పమ్మా, ఒక్కసారి కనపడమని చెప్పమ్మా, నన్ను రక్షించమని చెప్పమ్మా! మిమ్మల్ని చూడకుండా ఉండలేనమ్మా.. భద్రాచల రామచంద్రమూర్తిని ఈ కన్నులతో చూసేటట్లుగా అనుగ్రహించండమ్మా! ...'' అని వేడుకున్నాడు.

ఎంత కదిలిపోయిందో సీతమ్మ తల్లి...ఆ కీర్తన పూర్తి కాగానే... నిద్రలో ఉన్న తానీషాకు కల వచ్చింది. ఎవరో వచ్చి అప్పు తీర్చినట్లు. మెలకువ వచ్చి భార్యతో ఆ విషయం చెబుతుండగానే గంట మోగింది. భటులు వచ్చి ''అత్యవసరమంటూ ఎవరో రామదాసుగారి సేవకులమని వచ్చారు'' అని తెలిపారు. ప్రభువు బయటికి వచ్చాడు. మా రామదాసు గారి డబ్బు కట్టేస్తున్నాం. ఇవిగో ఆరు లక్షల బంగారు వరహాలు. ఇవి తీసుకుని రశీదిస్తే మేం పోతాం'' అని చెప్పి అవిచ్చారు. తానీషా అర్ధరాత్రి రశీదు రాసిచ్చాడు.

రశీదు పట్టుకుని వెళ్ళేటప్పటికి రామదాసు విషం తాగడానికి సిద్ధంగా ఉన్నారు. ఆ పాత్రను తొలగించి రామదాసుని విడిపించి మరునాడు దర్బార్ ఏర్పాటుచేసి ఇంత గొప్ప భక్తుడిని ఇబ్బందులపాలు చేసానని పశ్చాత్తాపపడి పట్టువస్త్రాలతో సత్కరించి తాను పుచ్చుకున్న ఆరులక్షల వరహాలు కూడా రామదాసుగారికే ఇచ్చి పల్లకీ ఎక్కించి పంపిస్తే ప్రజలందరూ ఆయనకు బ్రహ్మరథం పట్టారు. రాముడు తెచ్చిన ఆ వరహాలు ఇప్పటికీ భద్రాచలం సంస్థానంలో ఉన్నాయి. ఇది ఎప్పుడో కాలం తెలియని కాలం నాటి కథ కాదు. ఇటీవల జరిగిన చరిత్ర. భద్రాచలంలాంటి గుళ్ళల్లోనే కాదు, ఆ పరమేశ్వరుడు తన్ను నమ్మిన నిజమైన భక్తుల గుండెల్లో ఎప్పుడూ ఉంటూనే ఉంటాడని చెప్పడానికి ఇంతకంటే ఉదాహరణ మరింకేం కావాలి !

అత్తివరదుని అపురూప దర్శనం

తిరుమల కొండపై వెలసిన కలియుగ వైకుంఠవాసుడు శ్రీనివాసుని మొదలుకొని దేశవ్యాప్తంగా ఏగుడిలోని స్వామినైనా సహజంగా ప్రతిరోజూ దర్శించుకోవచ్చు. పూజించుకోవచ్చు. తమిళనాడు రాష్ట్రం కాంచీపురంలోని అత్తి వరదరాజస్వామి వారిని దర్శించుకోవాలంటే మాత్రం నలభై ఏళ్లు వేచి ఉండక తప్పదు. 1979లో దర్శనభాగ్యం కల్పించిన అత్తివరదరాజస్వామి మరలా నలభై ఏళ్ల తరువాత ఈ ఏడాది జూలై 1వ తేదీ నుంచి దర్శనమివ్వబోతున్నాడు. అనేక చారిత్రాత్మక విశిష్టత, విశేషాలు కలిగిన ఈ ఆలయ వివరాల్లోకి వెళితే...

దేశంలోని ప్రముఖ ఆధ్యాత్మిక నగరాలలో కాంచీపురం కూడా ఎంతో ప్రసిద్ధి చెందినదే. కాంచీపురం పేరు చెప్పగానే అందరికీ చప్పున స్ఫురించేది కామాక్షి అమ్మవారి ఆలయం. ఆలయాల నగరంగా బాసిల్లుతున్న కాంచీపురంలో వరదరాజ పెరుమాల్ ఆలయం అంటే వెంటనే గుర్తుకు రాదు.. బంగారు బల్లుల గుడి అంటే ఇట్టే పట్టేస్తారు. ఈ ఆలయంలోనే ఆది అత్తివరదరాజస్వామి వారు కొలువై ఉన్నారు.

అత్తివరదరాజస్వామి ఆవిర్భావం ఇలా...

అత్తివరదుడు సాక్షాత్ బ్రహ్మ చేత రూపుదిద్దుకున్నవాడని భక్తుల నమ్మకం. ఒకరోజు దేవలోకంలో మహాలక్ష్మీ, సరస్వతుల మధ్య తమలో ఎవరు గొప్ప అనే సందేహం ఏర్పడింది. తమ సందేహాన్ని బ్రహ్మదేవుని ముందు ఉంచగా ఆయన ఏ మాత్రం సంకోచించకుండా మహాలక్ష్మే గొప్ప అని చెప్పాడు. సరస్వతి కోపగించుకుని బ్రహ్మ చేతిలోని సృష్టి దంతాన్ని చటుక్కున లాగేసుకుంది. దీంతో సృష్టి నిలిచిపోగా బ్రహ్మదేవుడు వెంటనే మహావిష్ణువును కలుసుకుని పరిష్కారం కోరుతాడు. అందుకు మహావిష్ణువు కంచిలో అశ్వమేధ యాగం చేస్తే మంచి ఫలితం దక్కుతుందని సూచిస్తాడు. వెంటనే కాంచీపురానికి వెళ్లిన బ్రహ్మ అశ్వమేధయాగం చేస్తాడు. భార్యా సమేతంగా మాత్రమే యాగం చేయాల్సి ఉండగా సతీమణి సరస్వతి లేకుండానే ప్రారంభించాడు. ఇందుకు కోపగించుకున్న సరస్వతి ఆ యాగానికి ఎలాగైనా ఆటంకాలు కల్పించి నిలిపివేయాలని భావించింది. అయితే, బ్రహ్మదేవుడు గాయత్రి, సావిత్రి అమ్మవార్ల సహాయంతో యాగాన్ని ప్రారంభించాడు. దీంతో సరస్వతి వైకుంఠం నుంచి భూమిపైకి దిగివచ్చి కాంచీపురంలో వేగవతి నదిగా మారి యాగం జరుగుతున్న దిశ వైపు వరదలా దూసుకు రావడం ప్రారంభించింది. వేగవతి నదీ ప్రవాహం నుంచి రక్షించాల్సిందిగా బ్రహ్మదేవుడు శ్రీ మహావిష్ణువును ప్రార్థించాడు. అప్పుడు వేగవతి నదికి అడ్డంగా శ్రీ విష్ణువు శయన రూపుడై అడ్డుకోవడంతో వేగవతి నది ప్రవాహం దారిమళ్లింది. యాగం నిర్విఘ్నంగా పూర్తిచేసేందుకు అండగా నిలిచిన మహావిష్ణువుకు బ్రహ్మదేవుడు కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. ఆ సమయంలో దేవతలు, భక్తులు శ్రీ మహావిష్ణువును వరాలు కోరగా కోరుకున్న వారికి కోరిన దానికంటే ఎక్కువగా వరాలు ఇవ్వడం ద్వారా వరదరాజ (పెరుమాల్) స్వామిగా పేరుపొందారు.

అత్తివరదరాజస్వామి రూపుదాల్చిన వైనం

యాగనిర్వహణలో తనకు సహాయం చేసిన పెరుమాళ్‌కు అపురూపమైన విగ్రహం తయారు చేయించాలని బ్రహ్మదేవుడు నిర్ణయించాడు. విగ్రహాన్ని ఏ రూపంలో చేయాలని పెరుమాళ్‌నే అడగ్గా శంఖు, చక్ర, గదాధారుడై దర్శనం ఇచ్చాడు. చైత్ర మాసం శ్రవణా నక్షత్రంలో పుణ్యకోటి విమానంలో ఈ దర్శనం కల్పించాడు. బ్రహ్మదేవుడు ఆ రూపంలోనే మహావిష్ణువు విగ్రహాన్ని తయారు చేయాలని సంకల్పించాడు. ఎన్నేళ్లయినా చెడిపోకుండా ఉండేందుకు మహావిష్ణు విగ్రహాన్ని అత్తివృక్షం నుంచి కొయ్యను సేకరించి తయారు చేశాడు. అత్తి వృక్షంతో చేసినందున 'అత్తి' వేగవతి నదీ వరదను అడ్డుకోవడంతోపాటూ వరద ప్రవాహంలా వరాలు గుప్పించినందుకు 'వరద' అనే పదాలను కలుపుకుని అత్తి వరదరాజస్వామిగా పేరుగాంచినట్లు పురాణ గాథ చెబుతోంది. ఈ ఆది అత్తివరదరాజస్వామి ఒకప్పుడు ఈ ఆలయ మూలస్థానేశ్వరుడిగా ఉండేవాడు. అయితే ఆనాటి పాలకులైన మొగలాయిల వల్ల ఏర్పడిన మతకలహాలు, ఇతర ఉద్రిక్త పరిస్థితుల బారినపడకుండా ఆలయ ప్రాంగణంలో ఉన్న ఆనంద పుష్కరిణిలో అత్తివరదుడు భద్రపరచబడ్డాడని కొందరు అంటారు. యాగంలోని అగ్ని నుంచి అత్తి వరదరాజస్వామి ఉద్భవించడం వల్ల ఉష్ణాన్ని చల్లార్చుకోడానికే ఆయన కోనేటిలో శయనించారని మరో కథనం కూడా ఉంది. ఆలయ పూజారికి స్వామి వారు కలలో కనపడి కోనేటి లోపల పెట్టాలని, 40 ఏళ్లకు ఒకసారి బైటకు తీసి పూజించాలని సూచించినట్లు ప్రచారంలో ఉంది. కాంచీపురం సమీపంలోని పళయశిఖరం అనే చోట నుంచి రాయిని తీసుకువచ్చి రూపొందించిన మూలస్థానేశ్వరుడే ప్రస్తుతం గర్భాలయంలో ఉన్నట్లు తెలుస్తోంది. అతి పురాతనమైన ఈ ఆలయంలోని మూలవర్‌ను దేవరాజ పెరుమాళ్‌గానూ, అమ్మవారిని పెరుందేవిదానూ భక్తులు కొలుస్తుంటారు. అమ్మవారు, స్వామివార్లు ఆలయంలోని మూలసన్నిధిలో కొలువై ఉన్నారు. 108 వైష్ణవ దివ్యక్షే త్రాల్లో ఒకటైన ఈ ఆలయంలోని పుష్కరిణి లోపల ముగ్గురు ఆళ్వార్లు మంగళాశాసనం చేయబడిన ఈ అత్తిగిరి వరదరాజస్వామి జలశయనుడిగా కొలువున్నాడు.

బంగారు బల్లుల గాథ

కాంచీపురం దేవరాజ పెరుమాళ్ ఆలయాన్ని తెలుగువారు బంగారు బల్లి ఆలయంగా కూడా పిలుచుకుంటారు. కాంచీపురం వరదరాజ పెరుమాళ్ గర్భాలయ సమీపంలో పైకప్పు మీద బంగారు, వెండి బల్లుల రూపాలు, వాటి పక్కనే సూర్య, చంద్రుల రూపాలు ఉన్నాయి. భక్తులు ఈ బల్లులను తాకి దోషాల నివారించుకోవడం ఆనవాయితీగా మారింది.

1979 తరువాత ఇప్పుడే దర్శనం

నాలుగు దశాబ్దాలకు ఒకసారి భక్తులకు దర్శనభాగ్యం కల్పించే అత్తి వరదుడు గతంలో 1979లో పుష్కరిణిని నుంచి బైటకు వచ్చి పూజలందుకున్నాడు. అత్తివరదరాజస్వామి శయనుడై ఉన్న ఈ సరస్వతి పుష్కరిణి ఎన్నడూ ఎండిపోలేదని పురాణాలు చెబుతున్నాయి. ఆలయనిర్వాహకులు పుష్కరిణిలో నీటిని పూర్తిగా తొలగించి 12 అడుగుల పొడవు, 2.5 అడుగుల వెడల్పుగల స్వామివారిని బయటకు తీసి ఎదురుగా ఉన్న వసంతరాయల మండపంలో ఉంచుతారు. అంటే జూలై 1 నుంచి 18 వరకు 48 రోజులపాటు భక్తులకు దర్శన భాగ్యం కల్పిస్తారు. 24 రోజులు నిల్చుని, 24 రోజులు శయనుడిగా పూజలు అందుకుంటాడు. అత్తి వరదుడు పూజలందుకునే రోజు నుంచి ఐదేళ్లపాటూ దేశం సుభిక్షంగా, సస్యశ్యామలంతో, ఆర్థిక పరిపుష్టితో వర్ధిల్లినట్లు తేలిందని వాతావరణ నిపుణులు, శాస్త్రవేత్తలు 200 ఏళ్ల చరిత్రను అధ్యయనం చేసి మరీ ప్రకటించారు.

కిటకిటలాడుతున్న కాంచీపురం

ఇంటర్నెట్, వాట్సాప్ వంటి సామాజిక మాధ్యమాలు లేని రోజులైన 1979లో పెద్దసంఖ్యలో వచ్చిన భక్తులతో కాంచీపురం కిటకిటలాడిపోయింది. అయితే ప్రస్తుతం విపరీతంగా పెరిగిపోయిన సామాజిక మాధ్యమాలతో బహుళ ప్రచారం జరిగిపోవడంతో అత్తివరదుడి దర్శనానికి వచ్చే భక్తుల సంఖ్య ప్రపంచ రికార్డు సృష్టిస్తుందని అంచనా వేస్తున్నారు.

– కొట్రా నందగోపాల్, సాక్షి ప్రతినిధి, చెన్నై

సువార్త

దేవుడు వాడుకున్న ధనుస్సు



స్తెఫను క్రైస్తవంలో మొదటి హతసాక్షి. ఆదిమ కాలపు క్రైస్తవ ఉద్యమానికి పునాది రాయిలాంటి పరిచారకుడు. యేసు పరలోకారోహణం తర్వాత యెరూషలేములో యూదుల మధ్య ప్రభువు శిష్యులైన పేతురు, యాకోబు, యోహాను చేసిన పరిచర్య కారణంగా క్రైస్తవం బాగా వ్యాప్తి చెందింది. నాటి యెరూషలేము జనాభాయే లక్షమంది కాగా అక్కడి మొదటి చర్చిలో 20 వేల మంది దాకా యూదులే క్రైస్తవులై చేరారు. అలా చేరిన స్తెఫను పరిచారకుడైన వెంటనే యెరూషలేములోని సన్‌హెడ్రిన్ అనే యూదుల అత్యున్నత మత సభనుద్దేశించి ప్రసంగిస్తూ, ముష్కరులారా, మీరు ప్రవక్తలను చంపారు. ఆ ప్రవక్తలు ప్రకటించిన మెస్సీయా అయిన యేసును కూడా చంపారంటూ ఆరోపించడంతో, ఆగ్రహం పట్టలేక అతన్ని రాళ్లతో కొట్టి చంపారు (అపో.కా.7:51-60). అలా ఆవేశపడకుండా నిదానంగా మాట్లాడి ఉంటే, స్తెఫను ఇంకా ఎంతో కాలం బతికుండి మరెంతో పరిచర్య చేసి ఉండేవాడు కదా? అనిపిస్తుంది. కాని విశ్వాసంతో, పరిశుద్ధాత్మతో, కృపతో, బలంతో నిండిన అత్యంత అరుదైన దైవజనుడుగా స్తెఫను దేవుని అభీష్టం మేరకే అలా చేశాడు (అపో.కా.6:5,8). అలా రెచ్చిపోయిన మత చాందస యూదులు సౌలు అనే పరిసయ్యుని నాయకత్వంలో యెరూషలేములోని క్రైస్తవ విశ్వాసులందరిపైనా విరుచుకుపడగా, వాళ్లంతా యూదయ, సమరయ, సిరియా, లెబానోను, జోర్దాన్, గ్రీసు, టర్కీ తదితర ప్రాంతాలకు ప్రాణభయంతో పారిపోయారు. నిజానికి వాళ్లంతా యెరూషలేములోనే స్థిరపడి పోయే ఆలోచనలో ఉన్నపుడు. స్తెఫను హత సాక్ష్యం ద్వారా వారిని అనేకదేశాలకు చెదరగొట్టి అనేక దేశాల్లో వాళ్ళు యేసు ప్రేమను ప్రకటించేందుకు దేవుడే ఇలా ప్రణాళిక రచించాడు. అయితే సౌలు అనే ఆ పరిసయ్యుడే ఆ తర్వాత గొప్ప క్రైస్తవుడై పౌలుగా మారి అనేక దేశాల్లో చర్చీలు స్థాపించాడు. అంటే యూదులకు సువార్త చెప్పిన పేతురు తరం సేవకులకు, ఇతర దేశాల్లోని అన్యజనులకు సువార్త చెప్పిన పౌలు తరం సేవకులకు మధ్య స్తెఫనుది వంతెన లాంటి పరిచర్య అన్నమాట. యూదులే లక్ష్యంగా వాళ్ళ చుట్టే తిరుగుతున్న 'ఆదిమ పరిచర్య' దిశను, సౌలులాంటి మతమౌఢ్యమున్న వ్యక్తిని మార్చి, అన్యజనుల వైపునకు తిప్పిన ఘనత స్తెఫనుది.

స్తెఫను తన పరిచర్య ఫలాలను తాను బతికుండగా చూడలేదు. కాని చెదిరిపోయిన విశ్వాసులు, పౌలు తదితరుల పరిచర్యలో అనేకదేశాల్లో క్రైస్తవాన్ని హత్తుకొన్న ఆత్మలన్నీ తన అకౌంట్లోనే పడటం చూసి పరలోకంలోని స్తెఫను తప్పకుండా తన్మయత్వం చెంది ఉంటాడు. సేవలో అత్యంత పరోక్షంగానైనా అత్యద్భుతంగా ఇలా పరిచర్య ఫలాలను స్తెఫను అందించాడు. పేదలకు పదిరూపాయల పరిచర్య చేసి, వెయ్యి రూపాయల పరిచర్యగా పోస్టర్లేసుకొని మరీ ప్రకటించుకునే వాళ్ళ బాపతు పరిచర్య కాదు స్తెఫనుది. ఆత్మపూర్ణుడుగా స్తెఫను దేవుని సంకల్పానికి తలవంచి ప్రాణాలు కూడా వదులుకున్నాడు. తద్వారా విదేశాల్లోని అన్యజనులకు సువార్త ద్వారాలు తెరిచి లక్షలమందికి 'ఆత్మీయ తండ్రి' అయ్యాడు. ప్రభువు సంకల్పాలకు సంపూర్ణంగా తలవంచడం. ఏవో పొందడానికి కాదు, ప్రభువు కోసం ప్రాణాలతో సహా అన్నీ 'పోగొట్టుకోవడానికి' సిద్ధపడటమే పరిశుద్ధాత్మతో నింపబడటం అని స్తెఫను నిరూపించాడు. అంటే ప్రతివాడూ తనను తాను ఉపేక్షించుకొని నన్ను వెంబడించాలన్న యేసుబోధ స్తెఫనుకు బాగా అర్థమైంది. అన్యజనుల మధ్యకు దేవుడు విసిరిన 'సువార్త బాణం' పౌలు అయితే, దాన్ని విసిరేందుకు దేవుడు వాడుకొన్న ధనుస్సు స్తెఫను. విలియం కేరీ ఇండియాకు రావడానికి ఎదురు చూసిన 30 ఏళ్లలో ఒక్క ఆత్మను కూడా సంపాదించలేకపోయాడు. ఇండియాకొచ్చాక ఆయన బతికుండగా చూసిన సేవాఫలాలు కూడా అంతంత మాత్రమే. కాని ఇండియా లోని వివిధ భాషల్లోకి ఆయన తర్జుమా చేసిన బైబిల్ చదివి ఆయన మరణానంతరం ప్రభువును తెలుసుకున్నవారు మాత్రం లక్షల మంది. మనవంతు మనం పరిచర్య చేసి ఫలితాలను దేవునికప్పగించడం, పేరుప్రఖ్యాతులు, ధన ప్రలోభాలకు దూరంగా ఉంటూ పరిచర్య నుండి మౌనంగా తప్పుకోవడమే దేవునికి మహిమ తెచ్చే మహా గొప్ప పరిచర్య.

– రెవ.డా.టి.ఎ.ప్రభుకిరణ్

ఇస్లాం వెలుగు

సమస్యా దృష్టి.. సమస్యపై దృష్టి

ఒక వ్యక్తి కారులో ప్రయాణిస్తున్నాడు.హైవేపై కారు వేగంగా దూసుకుపోతోంది. కొంతదూరం ప్రయాణించిన తరువాత డ్రైవింగ్ కాస్త ఇబ్బందిగా అనిపించింది. కారుకేమన్నా అయిందో ఏమో.. అనుకుంటుండగానే కారు ఒక పక్కకు లాగినట్లు అనిపించింది. వెంటనే కారును వంతెనపై కాస్త పక్కకు తీసి ఆపేశాడు. తీరా చూస్తే వెనుక టైరుకు పంక్చర్ అయింది. 'అయ్యో.. ఈ నిప్పులు కురిసే ఎండలో టైరు మార్చడం ఎలా.?' అని తలపట్టుకున్నాడు. కాని తప్పదు.. మరో మార్గంలేదు. స్టెఫినీ తీసి జాకీ సహాయంతో టైరు విప్పి బోల్టులు పక్కన పెట్టాడు. టైరు లాగుతున్న క్రమంలో కాలు తగిలి నాలుగు బోల్టులూ నదిలో పడిపొయ్యాయి. 'కొంపమునిగింది. ఇప్పుడేం చెయ్యాలి? బోల్టులు లేకుండా టైరు ఎక్కించడం కుదరదు. ఎలా మరి?' అని ఆలోచిస్తూ నిస్సహాయ స్థితిలో తలపట్టుకుని కూర్చున్నాడు. అలా చాలా సమయం గడిచిపోయింది. అంతలో ఒక పశువుల కాపరి అటుగా రావడం గమనించినా, అతను పట్టించుకోలేదు. ఎందుకంటే అతని వల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదు. మాసిన బనీను, చేతిలో కర్ర.. అతనేం చేయగలడు. అనుకొని తిరిగి ఆలోచనల్లో మునిగి పొయ్యాడు. అంతలో ఆ కాపరి అతణ్ణి సమీపించి, 'అయ్యా.. ఏదో ఆందోళనగా కనబడుతున్నారు.? నేనేమైనా సహాయ పడగలనా?' అని ప్రశ్నించాడు. 'చెబితే నువ్వు ఆరుస్తావా.. తీరుస్తావా.. అదిగో టైరు బోల్టులు నాలుగూ నదిలో పడిపొయ్యాయి.' అన్నాడు చిరాగ్గా.. 'అయ్యా.. మీరొక పనిచేయండి. ఇక్కడికి పది కిలోమీటర్ల దూరంలో ఒక మెకానిక్ షెడ్డు ఉంది. మిగతా మూడు టైర్లకున్న బోల్టుల్లో ఒక్కొక్కదాన్ని తీసి ఈటైరుకు వేయండి. మూడేసి బోల్టులమీద మీరు నెమ్మదిగా పది కిలోమీటర్లు వెళ్ళిపోవచ్చు.' అన్నాడు.

ఆ వ్యక్తి గుడ్లప్పగించి కాపరివైపే చూశాడు. కోపం, చిరాకు మటు మాయమయ్యాయి. ఒక పశువుల కాపరికి వచ్చిన ఆలోచన తనకు రానందుకు ఆశ్చర్యపోతూ.. 'నీకీ ఆలోచన ఎలా వచ్చింది?' అడిగాడు. కృతజ్ఞతగా అతనివైపు చూస్తూ..

'అయ్యా..! మీరెంతవరకూ సమస్యపైనే దృష్టి పెట్టారు తప్ప, పరిష్కారం దిశగా ఆలోచించలేదు. నదిలో పడిపోయిన బోల్టులు తిరిగి రావని తెలిసినా వాటికోసమే ఆలోచించారు తప్ప, చెయ్యాల్సిన పనిపై దృష్టిసారించలేదు. నేను ప్రత్యామ్నాయం ఆలోచించాను. అదొక్కటే తేడా!' అన్నాడు కాపరి.

అవును, అల్లాహ్ మనిషికి బుద్ధిబలాన్ని ప్రసాదించాడు. దాన్ని వినియోగించుకోవాలి. ప్రత్యామ్నాయం ఆలోచించకుండా, సమస్యపైనే దృష్టిపెడితే పరిష్కారం లభించదు.

– ముహమ్మద్ ఉస్మాన్ ఖాన్

భాగవత చిత్రణ

సత్వగుణమున సద్భక్తి సంభవించు, భక్తియు తముగ,
జిత్తంబు భవ్యమగును
హృదయ పద్మంబున దోలినెరగబడిన యట్టి
నీకు నమస్కారమయ్యా వరద!

సందర్భం: ఇది శ్రీ యజ్ఞ వరాహమూర్తిని బ్రహ్మాదులు స్తుతించు సందర్భంలోని పద్యం. పరమేశ్వరా! నీవు యజ్ఞాధిపతివి, వేదమూర్తివి, దుష్టశిక్షణ, శిష్టరక్షణార్థం వరాహావతారం ధరించావు. సత్వగుణాన్ని పెంపొందించుకుంటే, మంచి భక్తి కలుగుతుంది. భక్తితో కూడిన మనస్సు పునీతమవుతుంది. అలాంటి పునీతమైన మనస్సనే పద్మంలో వెలసిన నీకు నమస్కారం అని భావం.

– డా. చెలికాని మురళీకృష్ణారావు

గురు సన్నిధి

మోక్షయోగి త్రిలింగస్వామి



అది హిమాలయ పర్వతసానువులలోని దట్టమైన అటవీప్రాంతం. అక్కడ ఓ యోగి కూర్చుని తపస్సు చేసుకుంటూ బాహ్యప్రపంచాన్ని మరచిపోయాడు. భీకరమైన గాండ్రింపుతో కళ్ళు తెరచాడా యోగి. ఎదురుగా తన వైపే చూస్తున్న పెద్దపులి. సరిగ్గా అప్పుడే వేటకోసం వచ్చిన రాజు... పులిని చంపేందుకు సిద్ధమయ్యాడు. యోగి రాజును వారించి, దానివల్ల భయం లేదని ప్రేమతో ఆ పెద్దపులి తల నిమిరి అక్కడినుండి పంపించివేశారు. ఆశ్చర్యపోయిన రాజుని నోరులేని జీవులను కూడా ప్రేమించమని ఉపదేశించారు. ఆ ప్రేమమూర్తే శ్రీ త్రిలింగస్వామి.

త్రిలింగ ప్రాంతం కనుక...

త్రిలింగస్వామి విజయనగరం దగ్గరలో హాలియా గ్రామంలో జన

సేతుపతి.. అఘోరాధిపతి?

సినిమా సినిమాకు గెటప్స్‌తో ప్రయోగాలు చేస్తుంటారు తమిళ హీరో విజయ్ సేతుపతి. ప్రస్తుతం ఎస్పీ జననాథన్ దర్శకత్వంలో 'లాభం' అనే సినిమాలో నటిస్తున్నారు. ఇందులో శ్రుతీహాసన్ హీరోయిన్. ఈ సినిమాలో

విజయ్ సేతుపతి

రెండు విభిన్న గెటప్స్‌లో విజయ్ సేతుపతి కనిపిస్తారట. తాజాగా ఈ సినిమాలో విజయ్ సేతుపతి లుక్ ఒకటి బయటకు వచ్చింది. పొడుగు జుట్టు, ఫుల్ గడ్డంతో ఆయన లుక్ ఉంది. ఇది అఘోరాల పాత్రలను పోలి ఉండబోతోందని చెన్నై టాక్. దీంతో సేతుపతి అఘోరాధిపతి అయ్యారు అని సరదాగా ఫ్యాన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంతకీ 'లాభం'లో విజయ్ సేతుపతి పాత్ర ఏంటో తెలియాలంటే సినిమా విడుదల వరకూ వేచి చూడాల్సిందే.

సల్మాన్

భాయ్ బంపర్ ఆఫర్ ఇచ్చారా?

నార్త్‌లో 'కబీర్ సింగ్' కలెక్షన్ల వర్షం కురుస్తోంది. షాహిద్ కపూర్‌కి సోలో హీరోగా ఇది తొలి వంద కోట్ల చిత్రం అవ్వడమే కాకుండా రెండొందల కోట్ల సినిమా కూడా కాబోతోందని టాక్. తన సూపర్ హిట్ 'అర్జున్ రెడ్డి' సినిమాను షాహిద్‌తో 'కబీర్ సింగ్'గా హిందీలో రీమేక్ చేశారు సందీప్ వంగా. ఈ సినిమా బ్లాక్‌బస్టర్ దిశగా నడుస్తోంది. హిందీకి సౌత్ సినిమా స్టామినా ఏంటో మరోసారి నిరూపిస్తోంది. ఇప్పుడు బాలీవుడ్‌లో బడా చాన్స్ కొట్టేశారట సందీప్ వంగా. సల్మాన్ హీరోగా టీ సిరీస్ సంస్థ నిర్మించబోయే సినిమాకు దర్శకుడిగా సందీప్ పేరుని పరిశీలిస్తున్నారట. 'కబీర్ సింగ్'కు టీ-సిరీస్ సంస్థ కూడా నిర్మాణ భాగస్వామి అనే సంగతి తెలిసిందే. మరి.. సల్మాన్‌తో సందీప్ సినిమా ఉంటుందా? అంటే వేచి చూడాల్సిందే. ఈ సినిమా సంగతి అలా ఉంచితే సందీప్ ప్రస్తుతం నెట్‌ఫ్లిక్స్‌కు 'లస్ట్ స్టోరీస్' తెలుగు వెర్షన్‌ను డైరెక్ట్ చేయనున్నారు.

సందీప్

నాగచైతన్య, వెంకటేశ్

వైజాగ్‌కు వెంకీమామ

సముద్ర తీర ప్రాంతమైన వైజాగ్‌కు హాయ్ చెప్పారు 'వెంకీమామ' అండ్ టీమ్. వెంకటేశ్, నాగచైతన్య హీరోలుగా కేఎస్ రవీంద్ర (బాబీ) దర్శకత్వంలో 'వెంకీమామ' అనే సినిమా తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో పాయల్ రాజ్‌పుత్, రాశీఖన్నా కథానాయికలుగా నటిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఓ షెడ్యూల్ ఇటీవల కాశ్మీర్‌లో జరిగింది. తదుపరి షెడ్యూల్ వైజాగ్‌లో జరగనున్నట్లు తెలిసింది. ఆల్రెడీ రాశీఖన్నా వైజాగ్‌లో ఉన్నారని సమాచారం. దీన్నిబట్టి.. ముఖ్య తారాగణంపై కీలక సన్నివేశాలను టీమ్ ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో నాగచైతన్య ఆర్మీ ఆఫీసర్‌గా కనిపిస్తారు. డి. సురేశ్ బాబు, టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు తమన్ స్వరకర్త.

ఇప్పుడు ఆ భయమే లేదు

శ్రీదా

''సినిమాలో నా స్క్రీన్ టైమ్ ఎంతసేపు?' అని ఆలోచించే యాక్టర్‌ని కాదు నేను. మనకిచ్చిన రోల్‌లో, మనకున్న స్క్రీన్ టైమ్‌లో ఒప్పుకున్న పాత్రకు, ఆ సినిమాకు మనమేం కొత్తదనం తీసుకురాగలం అని మాత్రమే ఆలోచిస్తాను. యాక్టర్‌గా చేసే ప్రతిదీ ఫుల్ లెంగ్త్ రోల్ అయ్యుండాలనీ సినిమా మొత్తం కనిపించాలనీ అనుకోను'' అన్నారు అదా శర్మ. రాజశేఖర్, అదా శర్మ జంటగా ప్రశాంత్ వర్మ దర్శకత్వంలో సి.కల్యాణ్ నిర్మించిన చిత్రం 'కల్కి'. ఈ సినిమా గత శుక్రవారం రిలీజ్ అయింది. ఈ సందర్భంగా అదా శర్మ పలు విశేషాలు పంచుకున్నారు.

◆ ప్రశాంత్ డైరెక్ట్ చేసిన 'అ!' సినిమా నచ్చింది. తనతో సినిమా చేయాలనుకున్నా. ప్రశాంత్ 'కల్కి' కథ చెప్పగానే నచ్చింది. హీరోయిన్ పాత్రలను ఆయన విభిన్నంగా రాస్తారు. ఈ సినిమాలోనూ నా పాత్ర డిఫరెంట్‌గా ఉంటుంది. తొలిసారి డాక్టర్ పాత్ర చేశా. ఈ పాత్ర అన్నీ కళ్ల ద్వారానే వ్యక్తపరుస్తుంది. తక్కువ మాట్లాడుతుంది. నిజజీవితంలో అందుకు పూర్తి విరుద్ధంగా ఉంటాను నేను. అందుకే ఈ పాత్ర చాలెంజింగ్‌గా అనిపించింది. ఇది పీరియాడికల్ మూవీ కాబట్టి రిఫరెన్స్ కోసం కొన్ని పాత సినిమాలు చూశాను. అప్పటి హీరోయిన్ల బాడీ లాంగ్వేజ్ ఎలా ఉంటుంది? అనే విషయాలను గమనించాను. పాత తరం నటీమణుల్లో వహీదా రెహమాన్, వైజయంతి మాల నాకు ఇష్టమైన హీరోయిన్లు.

◆ రాజశేఖర్‌గారిలాంటి ఎక్స్‌పీరియన్స్ ఉన్న యాక్టర్‌తో వర్క్ చేయడం సంతోషంగా ఉంది. ఎంతో అనుభవం ఉన్నప్పటికీ తొలి సినిమా చేస్తున్న హీరోకి ఉండే ఎగ్జైట్‌మెంట్‌తో ఈ సినిమాకు వర్క్ చేశారాయన. తను సీనియర్, నేను జూనియర్ అనే ఫీలింగ్ సెట్లో ఎప్పుడూ లేదు. చాలా పాజిటివ్ పర్సన్.

◆ 'క్షణం' తర్వాత ఎలాంటి సినిమాలు చేయాలనే విషయంలో చాలా జాగ్రత్తగా ఉన్నాను. తెలుగు సినిమాలు వరుసగా ఎందుకు చేయడం లేదని తెలుగు ఫ్యాన్స్ అడుగుతుంటారు. హిందీ, తెలుగు, తమిళం ఇలా అన్ని భాషల్లో సినిమాలు చేస్తున్నాను. సో.. హిందీలో వరుసగా రెండు సినిమాలు చేస్తే తెలుగు సినిమాల్లో కనిపించడం తగ్గుతుంది. ఇప్పుడు తెలుగు సినిమా చేయాలి, ఆ తర్వాత హిందీ సినిమా చేయాలి అనే స్ట్రాటజీతో ప్లానింగ్ చేయలేను.

◆ ప్రస్తుతం హిందీలో 'కమాండో 3', మ్యాన్ టు మ్యాన్' సినిమాలు కమిట్ అయ్యాను. 'కమాండో' సిరీస్‌లో వస్తున్న మూడో చిత్రమిది. సాధారణంగా ఫ్రాంచైజీ సినిమాల్లో హీరోయిన్స్‌ను మారుస్తారు. కానీ మూడో సినిమాలోనూ నేనే హీరోయిన్‌గానే కొనసాగుతున్నాను. 'మ్యాన్ టు మ్యాన్'లో అబ్బాయిగా నటిస్తున్నాను. వీటితో పాటు ఓ వెబ్ సిరీస్, రెండు షార్ట్ ఫిల్మ్స్‌లో నటిస్తున్నాను.

◆ నా వర్క్‌ని బాగా ఎంజాయ్ చేస్తాను. ఎందుకంటే యాక్టర్ అవ్వాలన్నది నా డ్రీమ్. కొందరు వాళ్ల ప్రొఫెషన్‌ని ఇష్టపడరు. ఉదయాన్నే లేచి అబ్బా.. ఇవాళ కూడా ఆఫీస్‌కి వెళ్లాలా? అని బాధపడతారు. నేను మాత్రం వీకెండ్స్ కూడా వర్క్ చేయడానికి ఇష్టపడతాను. అందరికీ హీరోయిన్ అయ్యే చాన్స్ రాకపోవచ్చు. మనకి వచ్చిన చాన్స్‌ని కష్టపడి నిలబెట్టుకోవాలి. అందుకే నా జాబ్‌ను లక్కీగా ఫీల్ అవుతాను.

◆ ఏ కథ అంగీకరించినా అది నా నిర్ణయమే. 'క్షణం' ఓకే చేసినప్పుడు చిన్న సినిమా ఎందుకు? అన్నారు. కానీ నా నిర్ణయాలను ప్రేక్షకులు బాగా రిసీవ్ చేసుకుంటున్నారు. ఇప్పుడు ఏదైనా కొత్త పాత్రలో కనిపించాలన్నా, కొత్త కొత్త డ్రస్సులతో రెడ్ కార్పెట్ మీద నడవాలన్నా ఏ భయం లేకుండా ధైర్యంగా చేస్తున్నాను. కొత్త కాస్ట్యూమ్స్‌తో స్టైల్ స్టేట్‌మెంట్‌లు ఇవ్వగలుగుతున్నాను. మిగతా హీరోయిన్స్ ఇవి చేయాలంటే ఒకటికి రెండుసార్లు ఆలోచించాలేమో? కానీ ఇప్పుడు నాకా భయం పోయింది.

శర్వానంద్

హీరోనా? విలనా?

కొందరికి అతను విలన్. మిగతా వారికి అతను హీరో. ఇంతకీ అతను హీరోనా? విలనా? ఆ సంగతి ఆగస్ట్‌లో తెలుస్తుంది. శర్వానంద్ హీరోగా సుధీర్ వర్మ దర్శకత్వంలో తెరకెక్కిన గ్యాంగ్‌స్టర్ డ్రామా 'రణరంగం'. పీడీవీ ప్రసాద్, నాగ వంశీ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ చిత్రం టీజర్‌ను శనివారం రిలీజ్ చేశారు. ''దేవుడిని నమ్మాలంటే భక్తి ఉంటే సరిపోతుంది. అదే మనుషుల్ని నమ్మాలంటే ధైర్యం కావాలి. కోపాన్ని, దాహాన్ని ఒకడు శాసించే పరిస్థితుల్లో మనం ఉండకూడదు'' అంటూ ఈ టీజర్‌లో శర్వానంద్ చెప్పే డైలాగులు ఓ హైలెట్. అలాగే టైటిల్, టీజర్ చూస్తుంటే సినిమా హై వోల్టేజ్ యాక్షన్ డ్రామాగా ఉండబోతోందని అర్థం చేసుకోవచ్చు. రెండు డిఫరెంట్స్ షేడ్స్‌లో శర్వానంద్ ఈ సినిమాలో కనిపించనున్నారు. కాజల్ అగర్వాల్, కల్యాణి ప్రియదర్శన్ హీరోయిన్లుగా నటించారు. ఆగస్ట్ 2న విడుదల కానున్న ఈ చిత్రానికి కెమెరా: దివాకర్ మణి, సంగీతం: ప్రశాంత్ పిళ్లై.

కొత్త చాప్టర్ స్టార్ట్ చేస్తున్నా

ఎ.ఎల్. విజయ్

తమిళ దర్శకుడు ఏఎల్ విజయ్ మళ్లీ పెళ్లికి సిద్ధమయ్యారు. డాక్టర్ ఐశ్వర్యాను జూలైలో వివాహం చేసుకోబోతున్నట్లు ప్రకటించారాయన. 'నాన్న, అభినేత్రి, లక్ష్మీ (ప్రభుదేవా డ్యాన్స్ మూవీ)' సినిమాలతో తెలుగు ప్రేక్షకులకు ఏఎల్ విజయ్ పరిచయమే. తాజాగా పెళ్లి విషయాన్ని స్వయంగా ప్రకటిస్తూ - ''జీవితంలో ఒక్కొక్కరి ప్రయాణం ఒక్కోలా ఉంటుంది. నా జీవితంలో ఆనందం, బాధ, సక్సెస్, ఫెయిల్యూర్ అన్నీ ఉన్నాయి. అన్ని సమయాల్లో నాకు తోడుగా నిలబడిన మీడియా ఫ్రెండ్స్‌ను నా ఫ్యామిలీలా భావించాను. నా ప్రైవసీని, ఎమోషన్స్‌ను మీడియా వాళ్లు చాలా గౌరవించారు. డాక్టర్ ఆర్.ఐశ్వర్యను త్వరలోనే వివాహం చేసుకోబోతున్నాను అనే విషయాన్ని మీతో పంచుకోవడం నాకు చాలా ఆనందంగా ఉంది. జూలైలో కుటుంబ సభ్యుల మధ్య మా పెళ్లి వేడుక జరగనుంది. జీవితంలో కొత్త చాప్టర్ ప్రారంభించబోతున్నందుకు మీ అందరి ఆశీస్సులు కావాలి'' అని విజయ్ తెలిపారు. ఇది పెద్దలు కుదిర్చిన వివాహం అని, జూలై 11న పెళ్లి జరగబోతోందని సమాచారం. 2014లో నటి అమలా పాల్‌ను ప్రేమ వివాహం చేసుకున్న విజయ్ 2017లో విడాకులు తీసుకున్న సంగతి తెలిసిందే.

డేనియల్

బాండ్ ఈజ్ బ్యాక్

జమైకా లొకేషన్‌లోకి జేమ్స్ బాండ్ తిరిగొచ్చారు. డేనియల్ క్రెగ్ హీరోగా క్యారీ జోజీ ఫుకునాగ దర్శకత్వంలో బాండ్ సిరీస్‌లో 25వ చిత్రం తెరకెక్కుతున్న సంగతి తెలిసిందే. ఇటీవల జమైకాలో జరిగిన ఈ సినిమా షూటింగ్ సమయంలో ఓ యాక్షన్ సీక్వెన్స్‌లో భాగంగా హీరో డేనియల్ కాలికి గాయమైన సంగతి గుర్తుండే ఉంటుంది. దాదాపు నెల రోజుల విరామం తీసుకున్న క్రెగ్ తిరిగి సెట్‌లోకి అడుగుపెట్టారు. జమైకా యాక్షన్ షూట్‌లో జాయిన్ అయ్యారు. ఆస్కార్ విన్నింగ్ యాక్టర్ రమీ మాలిక్ ఈ సినిమాలో విలన్‌గా నటిస్తున్నారు. నోమి హ్యారిస్, లియా సేడౌస్ కీలక పాత్రధారులుగా తెరకెక్కుతున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్‌లో రిలీజ్ కానుంది.

టైగర్ ష్రాఫ్

ఫైటర్ హీరో!

బాలీవుడ్‌లో యాక్షన్ సన్నివేశాల స్టాండర్డ్‌ను సినిమా సినిమాతో పెంచుకుంటూ వెళ్తున్న యంగ్ హీరో టైగర్ ష్రాఫ్. యాక్షన్ సన్నివేశాలే 'భాగీ' సిరీస్‌ను బాక్సాఫీస్ వద్ద బ్లాక్‌బస్టర్‌గా నిలుపుతున్నాయి అనొచ్చు. తాజాగా ఈ సిరీస్‌లో మూడో పార్ట్ 'భాగీ 3'తో సిద్ధమయ్యారు టైగర్. ఈ సినిమాలో స్టంట్స్‌ను సొంతంగా కంపోజ్ చేసుకుంటున్నారట టైగర్. ఆల్రెడీ మిక్స్‌డ్ మార్షల్ ఆర్ట్స్‌లో టైగర్ ష్రాఫ్‌కు మంచి అనుభవం ఉంది. కానీ 'భాగీ 3' యాక్షన్ మరింత కొత్తగా ఉండటం కోసం కుంగ్ ఫూ, కిక్ బాక్సింగ్‌లో శిక్షణ పొందుతున్నారట. 2020 మార్చి 6న 'భాగీ 3' థియేటర్స్‌లోకి రానుంది.



సాక్షి స్పోర్ట్స్
ఆదివారం
30-6-2019

ఎన్‌సీఏకు ద్రవిడ్ నేతృత్వం

భారత క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ రాహుల్ ద్రవిడ్ మరో గురుతర బాధ్యతను తన భుజాలపై వేసుకున్నాడు. ప్రతిష్టాత్మక జాతీయ క్రికెట్ అకాడమీ (ఎన్‌సీఏ) అతను 'హెడ్'గా వ్యవహరిస్తాడు. జూలై 1నుంచి ద్రవిడ్ తన కొత్త పాత్రలోకి ప్రవేశిస్తాడు. తన విధుల్లో భాగంగా అతను ఇక్కడ యువ క్రికెటర్లకు మార్గనిర్దేశనం చేస్తాడు. జూనియర్ క్రికెట్ మ్యాచ్‌ను రూపొందించడంతో పాటు మహిళా క్రికెటర్లను తీర్చిదిద్దడం కూడా అతని విధుల్లో భాగంగా ఉంటాయి. ద్రవిడ్ ఇప్పటికే భారత 'ఎ', అండర్-19 టీమ్‌లకు కోచ్‌గా పని చేస్తున్నాడు.

ప్రపంచకప్ పాయింట్ల పట్టిక

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ర-రద్దు, నె.ర.రే-నెట్ రన్‌రేట్, పా-పాయింట్లు

జట్టు	ఆ	గె	ఓ	ర	నె.ర.రే.	పా
ఆస్ట్రేలియా	7	6	1	0	0.906	12
భారత్	6	5	0	1	1.160	11
న్యూజిలాండ్	7	5	1	1	1.028	11
పాకిస్తాన్	8	4	3	1	-0.792	9
ఇంగ్లండ్	7	4	3	0	1.051	8

జట్టు	ఆ	గె	ఓ	ర	నె.ర.రే.	పా
బంగ్లాదేశ్	7	3	3	1	-0.133	7
శ్రీలంక	7	2	3	2	-1.186	6
దక్షిణాఫ్రికా	8	2	5	1	-0.080	5
వెస్టిండీస్	7	1	5	1	-0.320	3
అఫ్గానిస్తాన్	8	0	8	0	-1.418	0

ఇంగ్లండ్‌కు ఇరకాటం...

భారత్‌కు చెలగాటం

మోర్గాన్

మూడు వారాల్లోనే ఎంత మార్పు...? ప్రపంచ కప్ హాట్ ఫేవరెట్ ఎవరంటే...? తక్కుమని ఇంగ్లండ్ అని చెప్పేవారు. ఇదే సమయంలో టీమిండియా సత్తాపై సందేహాలు లేకున్నా ఎలా ఆడుతుందోనన్న అనుమానాలు ఉండేవి. మరిప్పుడు...? ఆతిథ్య దేశం అత్యంత సంక్లిష్ట సందర్భంలో ఉంటే... కోహ్లి సేన జైత్రయాత్రతో సాగిపోతోంది. సెమీ ఫైనల్ గడపముంగిట రెండు జట్లూ భిన్నమైన సమీకరణాలతో నిలిచాయి. మరి... నేటి సమరంలో భారత్ ఫటాఫట్ ఆటతో ముందుకెళ్తుందా? ఇంగ్లండ్ తాడోపేడో తేల్చుకుంటుందా?

నేడు ఆతిథ్య జట్టుతో టీమిండియా పోరు

గెలిస్తే సెమీస్ బెర్తూ ఖరారు • 'నాకౌట్' ఒత్తిడిలో మోర్గాన్ సేన

బర్మింగ్‌హామ్: ప్రపంచ కప్‌లో ఎదురైన ప్రతి జట్టునూ ఓడిస్తూ అప్రతిహతంగా సాగిపోతున్న టీమిండియాకు తమ శక్తియుక్తులను పరీక్షించుకునే మ్యాచ్. జోరుమీదున్న మన జట్టు ఆదివారం ఇక్కడి ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో ఆతిథ్య ఇంగ్లండ్‌ను ఢీకొననుంది. వరుస విజయాలతో కోహ్లి సేన నిండైన ఆత్మవిశ్వాసంతో బరిలో దిగనుండగా... ఏమాత్రం తేడా వచ్చినా నాకౌట్ రేసు నుంచి ఔటయ్యే పరిస్థితి ప్రత్యర్థిది. ప్రధాన పేసర్ ఆర్చర్ పక్కటెముకల నొప్పితో ఇబ్బంది పడుతున్నా ఆడించేంత క్లిష్టమైన మలుపులో ఉంది ఇంగ్లండ్. దీన్నిబట్టే ఆ జట్టు ఎంత ఒత్తిడిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. మరి... మరో విజయంతో టీమిండియా సెమీస్ బెర్తును ఖాయం చేసుకుంటుందా? అత్యవసరమైన గెలుపుతో ఇంగ్లండ్ ఆశలు నిలుపుకొంటుందా? చూడాలి.

మధ్యాహ్నం గం.3 నుంచి స్టార్ స్పోర్ట్స్1లో ప్రత్యక్ష ప్రసారం

నాలుగులో అతడిపైనే నమ్మకం!

మిగతా జట్టంతా యథావిధిగా ఉన్నా... టీమిండియా బ్యాటింగ్ ఆర్డర్‌లో నాలుగో స్థానంపై చర్చకు అంతే ఉండటం లేదు. ఆల్‌రౌండర్ విజయ్ శంకర్ సామర్థ్యంపై సందేహాలే దీనికి కారణం. బ్యాటింగ్‌లో ధాటిగా పరుగులు రాబట్టలేని అతడికి గత రెండు మ్యాచ్‌ల్లో బౌలింగ్ అవకాశమూ ఇవ్వలేదు. జట్టులో శంకర్ అవసరమా? అనే వాదన వస్తోంది. కానీ, శుక్రవారం కోహ్లి మాటలను బట్టి చూస్తే శంకర్‌కు మరో చాన్స్ దక్కేలా కనిపిస్తోంది. అంటే భారత్ మార్పుల్లేని జట్టుతోనే బరిలో దిగనుంది. పెద్ద జట్టుతో మ్యాచ్ కాబట్టి ధావన్ లేని లోటు కనిపించకుండా ఓపెనింగ్‌లో రాహుల్ భారీ ఇన్నింగ్స్ ఆడాల్సి ఉంది. హార్దిక్, ధోని, జాదవ్ తలో చేయి వేస్తే ప్రత్యర్థికి భారీ లక్ష్యాన్ని నిర్దేశించవచ్చు.

కొట్టినోడే బాల్ తీసుకు రావాలి!

భారత జట్టు ప్రాక్టీస్‌లో ధోని 'గల్లీ క్రికెట్ రూల్'ను పాటించాడు. ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో సాధన చేస్తున్న సమయంలో అతను కొట్టిన షాట్‌కు బంతి వెళ్లి దగ్గరలో ఉన్న పొదల్లో పడింది. మాజీ కెప్టెన్ చెట్లలోకి వెళ్లి వెతికి మరీ బంతిని బయటకు తీసుకు రావడం విశేషం!

పేసర్లకు సరైన సవాల్

భారత పేసర్లు బుమ్రా, షమీలకు ఈ మ్యాచ్ సరైన సవాల్‌గానే చెప్పాలి. తొలుత భువీ, తర్వాత షమీ తోడుగా బుమ్రా దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియా, పాకిస్తాన్, వెస్టిండీస్‌లను కట్టడి చేసినప్పటికీ ఇంగ్లండ్ వాటికి భిన్నం. సొంతగడ్డ అనుకూలతకు తోడు రాయ్, బట్లర్, మోర్గాన్ వంటి హార్డ్ హిట్టర్లున్న ఆతిథ్య జట్టును ఆపగలిగితే బుమ్రా-షమీ ద్వయానికి ఇక తిరుగుండదనే చెప్పొచ్చు. షమీ బంతులను చూస్తుంటే బుమ్రా మించిన ప్రమాదకారిలా ఉన్నాడు. అయితే, ఏమాత్రం తేడా వచ్చినా ఇంగ్లండ్ బ్యాట్స్‌మెన్ చెలరేగిపోతారు. కాబట్టి ఎంత ఊపులో ఉన్నా గాడి తప్పకుండా బౌలింగ్ చేయడం ముఖ్యం. మరి ఈ సవాలును భారత పేస్ ద్వయం ఎలా ఛేదిస్తుందో చూడాలి.

కోహ్లి శతకానికి చకోర పక్షిలా...

రోహిత్, రూట్, వార్నర్, ఫించ్, విలియమ్సన్... ఇలా అగ్రశ్రేణి బ్యాట్స్‌మెన్ అంతా రెండేసి సెంచరీలు బాదేశారు. బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకీబ్ సైతం రెండుసార్లు 100 మార్కును దాటాడు. వీరందరి కంటే ఓ మెట్టు పైనే ఉండే విరాట్ కోహ్లినే ఇంకా శతకాన్ని అందుకోలేదు. టోర్నీలో 19 సెంచరీలు నమోదైనా భారత కెప్టెన్ బ్యాట్ నుంచి మాత్రం మూడంకెల ఇన్నింగ్స్ జాలు వారలేదు. వరుసగా నాలుగు అర్ధ సెంచరీలతో అద్భుత ఫామ్‌లో ఉన్న కోహ్లి... ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో ఆ ముచ్చట తీర్చుకుంటే చూసి తరించాలన్నది అభిమానుల కోరిక.

ముఖాముఖి రికార్డు

ఇరు జట్ల మధ్య ఇప్పటివరకు 99 మ్యాచ్‌లు జరగ్గా భారత్ 53 మ్యాచ్‌ల్లో నెగ్గింది. 41 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ విజయం సాధించింది. రెండు టై కాగా, మూడింట్లో ఫలితం తేలలేదు. ప్రపంచ కప్‌లో భాగంగా ఏడు మ్యాచ్‌ల్లో తలపడగా చెరో మూడింట్లో నెగ్గాయి. ఒకటి 'టై'గా ముగిసింది.

రెచ్చిపో... రోహిత్

దక్షిణాఫ్రికా, పాకిస్తాన్‌పై అద్భుత శతకాలతో అదరగొట్టిన ఓపెనర్ రోహిత్... అఫ్గాన్‌పై ఖాతా తెరవలేదు. మంచి టచ్‌లో ఉండగా విండీస్‌పై దురదృష్టవశాత్తు అంపైర్ నిర్ణయానికి బలయ్యాడు. ఇప్పుడు అతడు మళ్లీ చెలరేగాల్సిన సమయం వచ్చింది. ఆర్చర్, వుడ్, వోక్స్‌లను రోహిత్ భారీ షాట్లతో దంచేస్తే అవతలి ఎండ్‌లో రాహుల్ సమయోచితంగా ఆడే వీలుంటుంది. తద్వారా కోహ్లిపైనా భారం తగ్గుతుంది. ఈ త్రయం అటుఇటుగా 40 ఓవర్ల వరకు క్రీజులో ఉంటే... ఆస్ట్రేలియాపై తరహాలోనే హార్దిక్‌ను ముందు పంపి స్కోరును అమాంతం పెంచుకోవచ్చు.

ఇంగ్లండ్ ఎలానో?

వరుసగా రెండు పరాజయాలు... అందులోనూ శ్రీలంక చేతిలోనూ ఓటమితో ఇంగ్లండ్ ఒక్కసారిగా ఆత్మరక్షణలో పడిపోయింది. కండరాల గాయంతో ఓపెనర్ జేసన్ రాయ్ దూరమవడంతో జట్టు సాధారణంగా మారిపోయింది. రూట్ నిలకడ చూపుతున్నా మోర్గాన్, బట్లర్ కీలక సమయంలో విఫలమవడం దెబ్బకొట్టింది. మరో ఓపెనర్ బెయిర్ స్టో భారీ స్కోర్లు చేయలేకపోతున్నాడు. రాయ్ పునరాగమనంతో ఆతిథ్య జట్టుకు ఊపిరి వచ్చినట్లైంది. ప్రస్తుతానికి వారికి ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ ఫామ్ ఒక్కటే ఊరట. ఇలాంటి పరిస్థితుల్లో టీమిండియా పేస్ ద్వయం, మణికట్టు స్పిన్నర్లు చహల్, కుల్దీప్‌లను ఎలా కాచుకుంటారన్నది ఆసక్తికరం. పేసర్లు ఆర్చర్, వుడ్ భారత టాపార్డర్‌ను త్వరగా ఔట్ చేస్తేనే జట్టుకు ప్రయోజనం. వీరుగనుక కోహ్లి బృందాన్ని నిలువరించలేకపోతే స్టోక్స్ సహా స్పిన్నర్లు రషీద్, మొయిన్ అలీ చేసేందుకు ఏమీ ఉండదు.

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్, రాహుల్, కోహ్లి (కెప్టెన్), విజయ్, ధోని, జాదవ్, పాండ్యా, చహల్, కుల్దీప్, షమీ, బుమ్రా.

ఇంగ్లండ్: రాయ్, బెయిర్‌స్టో, రూట్, మోర్గాన్ (కెప్టెన్), బట్లర్, స్టోక్స్, అలీ, రషీద్, ఆర్చర్, వోక్స్, వుడ్.

1992 నుంచి మనకు ఓటమే లేదు

ప్రపంచ కప్‌లో చివరిసారిగా ఇంగ్లండ్ చేతిలో భారత్ 1992లో ఓడింది. 1996, 2007, 2015 కప్‌లలో రెండు జట్లు ఎదురుపడలేదు. 1999లో ఇంగ్లండ్‌ను సొంతగడ్డపైనే టీమిండియా ఓడించింది. దక్షిణాఫ్రికా ఆతిథ్యమిచ్చిన 2003లో మనదే పైచేయి. అయితే, 2011లో భారత్ వేదికగా జరిగిన కప్‌లో 338 పరుగుల భారీ లక్ష్యాన్ని ఇంగ్లండ్ సమం చేసి ఔరా అనిపించింది.

పిచ్, వాతావరణం

మ్యాచ్‌కు వేదికైన ఎడ్జ్‌బాస్టన్ మైదానం పిచ్ టోర్నీలోనే బ్యాటింగ్‌కు అత్యంత అనుకూలమైనదిగా చెబుతున్నారు. ఇరు జట్ల సామర్థ్యాన్ని బట్టి చేస్తే భారీ స్కోర్లు ఖాయం. మ్యాచ్‌కు వర్షం ముప్పు లేదు.

అయ్యో అఫ్గాన్!

గెలుపు అంచుల దాకా రావడం వేరు... మ్యాచ్ గెలవడం వేరు... అఫ్గానిస్తాన్ జట్టుకు ఇప్పుడు ఈ రెండింటి మధ్య తేడా అర్థమై ఉంటుంది. ఈ కప్‌లో భారత్‌ను గడగడలాడించిన ఆ టీమ్ శనివారం పాకిస్తాన్‌ను దాదాపు ఓడించే స్థితిలో నిలిచింది. కానీ మరోసారి ఆ జట్టు అరుదైన అవకాశాన్ని చేజార్చుకుంది...పేలవ ఫీల్డింగ్‌కు తోడు కెప్టెన్ గుల్‌బదిన్ నైబ్ చెత్త నాయకత్వం అఫ్గన్‌కు వరుసగా ఎనిమిదో పరాజయాన్ని మిగిల్చాయి. మరో వైపు ఈ మ్యాచ్‌లో ఓడితే సెమీస్ అవకాశాలు దాదాపుగా కోల్పోయే పరిస్థితిలో నిలిచిన పాక్ ఎట్టకేలకు గట్టెక్కింది. బౌలింగ్‌లో షాహిన్ అఫ్రిది సత్తా చాటి ప్రత్యర్థిని కట్టడి చేయగా... తీవ్ర ఒత్తిడిలో ఇమాద్ వసీమ్ అద్భుత బ్యాటింగ్‌తో జట్టును గెలిపించాడు.

గెలవాల్సిన మ్యాచ్‌లో ఓటమి

- 3 వికెట్లతో పాకిస్తాన్ విజయం
- ఇమాద్ ఆల్‌రౌండ్ ప్రదర్శన
- సెమీస్ రేసులో పాక్

లీడ్స్: 228 పరుగుల లక్ష్య ఛేదనలో తడబడిన పాక్ ఒక దశలో 45 ఓవర్లలో 6 వికెట్లకు 182 పరుగులు చేసింది. 5 ఓవర్లలో 46 పరుగులు అంటే 9కి పైగా రన్‌రేట్‌తో కష్టసాధ్యమైన పరిస్థితి! కానీ అఫ్గానిస్తాన్ కెప్టెన్ గుల్బదిన్ విజయాన్ని బంగారు పళ్లెంలో పెట్టి ప్రత్యర్థికి అందించాడు. ప్రధాన స్పిన్నర్లు రషీద్, ముజీబ్‌లకు కలిపి 3 ఓవర్లు, అంతకుముందు ఓవర్లో 2 పరుగులే ఇచ్చిన లెగ్‌స్పిన్నర్ షిన్వారికి మరో 2 ఓవర్లు మిగిలి ఉన్నాయి. పాక్ బ్యాట్స్‌మెన్ స్పిన్‌లో తీవ్రంగా ఇబ్బంది పడుతున్న దశలో వీరి బౌలింగ్ అఫ్గాన్‌కు అరుదైన విజయాన్ని అందించేదే. కానీ అప్పటికే అందరికంటే ఎక్కువ పరుగులు ఇచ్చిన నైబ్ అత్యుత్సాహంతో బౌలింగ్‌కు సిద్ధమయ్యాడు. ఈ ఓవర్లో చెలరేగిన ఇమాద్ మూడు ఫోర్లు సహా ఏకంగా 18 పరుగులు రాబట్టి పాక్ పని సులువు చేశాడు. ఒక్కసారిగా 18 బంతుల్లో 18 పరుగులకు సమీకరణం మారిపోగా, 16 బంతుల్లోనే పాక్ పని పూర్తి చేసింది.

శనివారం ఇక్కడి హెడింగ్లీ మైదానంలో జరిగిన లీగ్ మ్యాచ్‌లో పాకిస్తాన్ 3 వికెట్ల తేడాతో అఫ్గాన్‌పై గెలుపొందింది. ఫలితంగా తమ సెమీస్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన అఫ్గాన్ 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 227 పరుగులు చేసింది. అస్గర్ అఫ్గాన్ (35 బంతుల్లో 42; 3 ఫోర్లు, 2 సిక్సర్లు), నజీబుల్లా జద్రాన్ (54 బంతుల్లో 42; 6 ఫోర్లు) టాప్ స్కోరర్లుగా నిలిచారు. షాహిన్ అఫ్రిది 4 వికెట్లతో ప్రత్యర్థిని దెబ్బ తీశాడు. అనంతరం పాకిస్తాన్ 49.4 ఓవర్లలో 7 వికెట్లకు 230 పరుగులు సాధించింది. 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' ఇమాద్ వసీం (54 బంతుల్లో 49 నాటౌట్; 5 ఫోర్లు) అద్భుత బ్యాటింగ్‌తో చివరి వరకు నిలిచి జట్టును గెలిపించగా... బాబర్ ఆజమ్ (51 బంతుల్లో 45; 5 ఫోర్లు), ఇమామ్ ఉల్ హఖ్ (36) రాణించారు.

స్కోరు వివరాలు

అఫ్గానిస్తాన్ ఇన్నింగ్స్ : రహ్మత్ షా (సి) బాబర్ (బి) ఇమాద్ 35; గుల్బదిన్ (సి) సర్ఫరాజ్ (బి) షాహిన్ 15; హష్మతుల్లా (సి) ఇమాద్ (బి) షాహిన్ 0; ఇక్రామ్ (సి) హఫీజ్ (బి) ఇమాద్ 24; అస్గర్ (బి) షాదాబ్ 42; నబీ (సి) ఆమిర్ (బి) రియాజ్ 16; నజీబుల్లా (బి) షాహిన్ 42; షిన్వారి (నాటౌట్) 19; రషీద్ (సి) ఫఖర్ (బి) షాహిన్ 8; హమీద్ (బి) వహాబ్ 1; ముజీబ్ (నాటౌట్) 7; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం (50 ఓవర్లలో 9 వికెట్లకు) 227.**

వికెట్ల పతనం: 1-27, 2-27, 3-57, 4-121, 5-125, 6-167, 7-202, 8-210, 9-219.

బౌలింగ్: ఇమాద్ 10-0-48-2, ఆమిర్ 10-1-41-0, షాహిన్ 10-0-47-4, హఫీజ్ 2-0-10-0, వహాబ్ 8-0-29-2, షాదాబ్ 10-0-44-1.

పాకిస్తాన్ ఇన్నింగ్స్: ఫఖర్ ఎల్బీడబ్ల్యూ (బి) ముజీబ్ 0; ఇమామ్ (స్టంప్డ్) ఇక్రామ్ (బి) నబీ 36; బాబర్ ఆజమ్ (బి) నబీ 45; హఫీజ్ (సి) హష్మతుల్లా (బి) ముజీబ్ 19; హారిస్ సొహైల్ ఎల్బీడబ్ల్యూ (బి) రషీద్ 27; సర్ఫరాజ్ రనౌట్ 18; ఇమాద్ (నాటౌట్) 49; షాదాబ్ రనౌట్ 11; వహాబ్ నాటౌట్ 15; ఎక్స్‌ట్రాలు 10; మొత్తం (49.4 ఓవర్లలో 7 వికెట్లకు)230.

వికెట్ల పతనం: 1-0, 2-72, 3-81, 4-121, 5-142, 6-156, 7-206.

బౌలింగ్: ముజీబ్ 10-1-34-2, హమీద్ 2-0-13-0, నైబ్ 9.4-0-73-0, నబీ 10-0-23-2, రషీద్ 10-0-50-1, షిన్వారీ 8-0-32-0.

ట్రెంట్ బౌల్ట్ హ్యాట్రిక్

ట్రెంట్ బౌల్ట్

- ఆస్ట్రేలియా 243/9
- అర్ధ సెంచరీలతో ఆదుకున్న ఖాజా, క్యారీ

లండన్: పేసర్ ట్రెంట్ బౌల్ట్ (4/51) హ్యాట్రిక్‌కు తోడు నీషమ్ (2/28), ఫెర్గూసన్ (2/49) రాణించడంతో శనివారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఆస్ట్రేలియాను న్యూజిలాండ్ కట్టడి చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఆసీస్ ప్రత్యర్థి బౌలర్ల దెబ్బకు 92 పరుగులకే ఐదు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు వార్నర్ (16), కెప్టెన్ ఫించ్ (8) సహా, స్మిత్ (5), మ్యాక్స్‌వెల్ (1) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. ఈ దశలో వన్‌డౌన్ బ్యాట్స్‌మన్ ఉస్మాన్ ఖాజా (129 బంతుల్లో 88; 5 ఫోర్లు), వికెట్ కీపర్ అలెక్స్ క్యారీ (72 బంతుల్లో 71; 11 ఫోర్లు) నిలిచారు. ఆరో వికెట్‌కు వీరు 107 పరుగులు జోడించి జట్టును గట్టెక్కించారు. ఇన్నింగ్స్ ఆఖరి ఓవర్లో బౌల్ట్ విజృంభించి ఖాజా, స్టార్క్ (0), బెహ్రెన్‌డార్ఫ్ (0)లను వరుస బంతుల్లో ఔట్ చేసి హ్యాట్రిక్ సాధించాడు. దీంతో ఆసీస్ నిర్ణీత ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 243 పరుగులు చేసింది. ఈ ప్రపంచ కప్‌లో భారత పేసర్ మొహమ్మద్ షమీ తర్వాత హ్యాట్రిక్ సాధించిన రెండో బౌలర్ బౌల్ట్.

వన్డే కెరీర్‌లో రెండో హ్యాట్రిక్ సాధించిన బౌల్ట్... ప్రపంచ కప్‌లో ఈ ఘనత నమోదు చేసిన తొలి న్యూజిలాండ్ బౌలర్‌గా రికార్డులకెక్కాడు.

అలెక్స్ క్యారీ

హ్యాట్రిక్ సాధించిన క్రమం...

ఇన్నింగ్స్ 50వ ఓవర్

మూడో బంతి - ఖాజా (బ) బౌల్ట్
నాలుగో బంతి - స్టార్క్ (బ) బౌల్ట్
ఐదో బంతి - బెహ్రెన్‌డార్ఫ్ (ఎల్బీడబ్ల్యూ) బౌల్ట్

కడపటి వార్తలు అందే సరికి న్యూజిలాండ్ 30 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 108 పరుగులు చేసింది. విలియమ్సన్ (40), గప్టిల్ (20), నికోల్స్ (8) పెవిలియన్‌కు చేరారు.

వరద నీటితో కుంటాల జలపాతం

కుంటాలకు జలకళ

నేరడిగొండ (బోథ్): రాష్ట్రంలోనే ఎత్తయిన జలపాతం కుంటాలకు జలకళ వచ్చింది. ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలంలోని ఈ జలపాతం ఇన్నాళ్లు నీరు లేక బోసిపోయింది. ప్రస్తుతం రెండుమూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో జలపాతంలోకి వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలకళను సంతరించుకుంది. ఇక ఇక్కడ పర్యాటకుల సందడి పెరగనుంది.

హైవేపై బస్సు బోల్తా

- నలుగురికి తీవ్ర గాయాలు
- వనపర్తి జిల్లాలో ఘటన

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లాలో ఆర్టీసీ బస్సు బోల్తా పడి నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. 44వ నంబర్ జాతీయ రహదారిపై కొత్తకోట మండలం కనిమెట్ట శివారులో ఈ ప్రమాదం జరిగింది. కాచిగూడ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు శుక్రవారం రాత్రి 8 గంటలకు 15 మంది ప్రయాణికులతో ఏపీలోని కడప నుంచి హైదరాబాద్‌కు బయలుదేరింది. ఇద్దరు డ్రైవర్లు ఉన్న ఈ బస్సును మొదటి డ్రైవర్ కర్నూల్ వరకు నడిపి అనంతరం రెండో డ్రైవర్ రవీందర్‌కు స్టీరింగ్ ఇచ్చాడు. రాత్రి 2 గంటల సమయంలో బస్సు కనిమెట్ట సమీపంలోకి రాగానే రోడ్డు పక్కకు దూసుకెళ్లి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ రవీందర్‌తో పాటు కర్నూల్ జిల్లా గడ్డివేములకు చెందిన జయరామయ్య, హైదరాబాద్‌లోని చర్లపల్లికి చెందిన సహదేవ్‌రెడ్డి, నిర్మల్ జిల్లాకు చెందిన దస్తగిరిలకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు గాయపడిన వారిని 108లో వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించారు. మిగతా ప్రయాణికులను మరో బస్సులో హైదరాబాద్‌కు పంపించారు. దస్తగిరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు పంపించారు. ఈ సంఘటనపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపారు.

సర్పంచ్ అయినా పండ్ల అమ్మకం

పండ్లు అమ్ముతున్న మంగ

బతుకుదెరువు కోసం పండ్లమ్ముకుంటున్న ఈ మహిళ ఓ గ్రామ సర్పంచ్. కుటుంబ పోషణ కోసం పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తోంది. నల్లగొండ జిల్లా కట్టంగూర్ మండలం బొల్లెపల్లి సర్పంచ్‌గా మంగ ఇటీవల ఎన్నికైంది. సర్పంచ్ అయినా ఎప్పటి మాదిరిగానే జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్ సమీపంలో పండ్లు అమ్ముకుంటోంది. కుటుంబ పోషణకు ఇబ్బందిగా ఉండడంతో తిరిగి అదే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నానని ఆమె తెలిపింది.

కంది భజరంగ్‌ప్రసాద్, సాక్షి ఫొటోగ్రాఫర్, నల్లగొండ

పొలంలో బయటపడిన గుహ ఆనవాళ్లు

మునగాల: సూర్యాపేట జిల్లా మునగాల మండలం వెంకట్రాంపురం గ్రామపంచాయతీ పరిధిలో గల ఎస్ఎంపేట రెవెన్యూ గ్రామంలో శనివారం ఓ వ్యవసాయ భూమిలో పురాతన గుహ ఆనవాళ్లు బయటపడ్డాయి. సుంకర రామారావు అనే రైతు భూమిని భిక్షం అనే కౌలురైతు సాగు చేస్తున్నాడు. ఈ క్రమంలో కౌలురైతు ట్రాక్టర్‌తో భూమిని దున్నుతుండగా నాగళ్లకు ఓ బండరాయి తగిలింది. దీంతో ఆ బండరాయిని తొలగించగా దానికింద 6 అడుగుల లోతు, మూడు అడుగుల వెడల్పు గల గుహ (సొరంగం) ఆనవాలు కనిపించింది. ఈ గుహ ముఖద్వారం మనిషి ప్రవేశించేందుకు వీలుగా ఉంది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు ఈ గుహను చూసేందుకు తరలివస్తున్నారు. ఇదిలా ఉండగా గతంలో ఈ ప్రాంతంలో గురప్ప దేవాలయం ఉండేది. ఇందుకు సంబంధించిన పలు రకాల విగ్రహాలు, పురాతన కట్టడాలకు సంబంధించిన ఆనవాళ్లు బయటపడ్డాయి. పూర్వ కాలంలో ఈ ప్రాంతంలో ఓ పురాతన దేవాలయం ఉండేదని గ్రామపెద్దలు చెబుతున్నారు. వ్యవసాయ భూమిలో గుహ వెలుగు చూసిన సంఘటనను స్థానికులు వీఆర్ఏ ద్వారా తహసీల్దార్‌కు సమాచారం ఇచ్చారు.

ఆరో మోటార్‌కు మరోసారి వెట్‌రన్

కాళేశ్వరం కన్నెపల్లి పంపుహౌస్‌లో మోటార్‌కు పరీక్షలు

కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్‌లో చేపట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పరిధి కన్నెపల్లి పంపుహౌస్‌లోని ఆరో మోటార్‌కు శనివారం ఇరిగేషన్ అధికారులు, ఏజెన్సీ ప్రతినిధులు మరోసారి వెట్‌రన్ నిర్వహించారు. కన్నెపల్లి పంపుహౌస్‌లో 11 మోటార్లకు 9 మోటార్లు బిగించారు. 10, 11 మోటార్ల పనులు జరుగుతున్నాయి. ఇందులో ఆరో మోటారును ఈ నెల 21న సీఎం కేసీఆర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. అయితే శనివారం మరోసారి 45 నిమిషాల పాటు మోటార్ నడువగా డెలివరీ సిస్టం వద్ద నీటిని ఎత్తి పోసింది. ఆ నీరు గ్రావిటీ కాల్వ గుండా సుమారు 7 కిలో మీటర్ల వరకు చేరింది. పైపులైన్లకు సంబంధించిన లీకేజీలను అధికారులు సరిచేస్తున్నారు. జూలై మొదటి వారంలో గోదావరి, ప్రాణహితకు వరదలు వచ్చే వరకు మోటార్లకు వెట్‌రన్ ప్రక్రియ కొనసాగుతుందని ఇరిగేషన్ అధికారులు పేర్కొన్నారు. ఈ ఖరీఫ్‌కు నీరందించడానికి మోటార్ల పనితీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తున్నారు. ఈ ప్రక్రియ మొత్తం రాష్ట్ర ప్రభుత్వ ఇరిగేషన్ సలహాదారు పెంటారెడ్డి, ఈఎన్‌సీ నల్ల వెంకటేశ్వర్లు, ఎస్ఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ రమణారెడ్డి, డీఈఈ సూర్యప్రకాశ్‌ల పర్యవేక్షణలో నిర్వహించారు.

పది మంది టీచర్ల సస్పెన్షన్

సమయ పాలన పాటించడం లేదని కలెక్టర్ ఆదేశం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: విధుల్లో సమయపాలన పాటించడం లేదంటూ మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ రొనాల్డ్‌రోస్ పది మంది ఉపాధ్యాయులపై వేటు వేశారు. శనివారం ఉదయం 9.15 గంటలకు జిల్లా కేంద్రంలోని గాంధీరోడ్డు బాలికల ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. 16 మంది ఉపాధ్యాయులకు గానూ ముగ్గురు సెలవులో ఉండగా ప్రార్థన సమయానికి కేవలం నలుగురు మాత్రమే పాఠశాలకు హాజరయ్యారు. పిల్లలతో ప్రార్థనలో పాల్గొన్న కలెక్టర్ పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. ప్రార్థన అయిపోయాక కూడా మిగతా ఉపాధ్యాయులు రాకపోవడం, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేస్తూ వెళ్లిపోయారు. కాగా, ఆయన పదిమందిపై సస్పెన్షన్ వేటు వేయాలని విద్యాశాఖ అధికారులకు ఆదేశించినట్లు సమాచారం. ఈ విషయంపై డీఈఓ రాజేశ్‌ను వివరణ కోరగా ఆ ఉపాధ్యాయులను సస్పెండ్ చేస్తున్నట్లు చెప్పారు.

తెలంగాణ ప్రభుత్వం
పంచాయతీ రాజ్ శాఖ, ఆదిలాబాద్
NIT No.1-45 ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన తేది: 24.06.2019
PIU ఆదిలాబాద్‌లో అంగన్‌వాడీ బిల్డింగ్స్ నిర్మాణం, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయుట, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం మొ॥ పనులు చేపట్టుట కొరకు దిగువ సంతకందారుచే టెండర్లు కోరబడుచున్నవి. మొత్తం ECV: రూ. 400.00 లక్షలు. టెండర్ డాక్యుమెంట్లు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్‌ప్లేస్‌లో 02.07.2019 నుండి 09.07.2019 వరకు లభిస్తాయి. తదుపరి వివరాలకు www.tender.telangana.gov.in ను దర్శించండి.
సం/- జిల్లా పంచాయతీ రాజ్ ఇంజినీర్, (PIU) ఆదిలాబాద్
DIPR RO.No.479-DP/CL/Advt/1/2019-20, Dt: 29.06.2019

తిరుమల తిరుపతి దేవస్థానములు: తిరుపతి
SE-II సర్కిల్
ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన
ADV. No.11/TA/SE-II/TTD/Tpt/2019-20 తేది: 28-06-2019
SE-II సర్కిల్‌లో అరవై ఆరు (66) పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్‌పై ఇ-టెండర్లు కోరబడుచున్నవి. NIT నంబర్లు దిగువ విధంగా ఉన్నవి:

S.E-II	NIT నం.లు: 85 నుండి 93/SE-II/2019-20	(9 పనులు)
E.E-I	NIT నం.లు: 50 మరియు 76/EE-I/2019-20	(27 పనులు)
E.E-V	NIT నం.లు: 38 నుండి 66/EE-V/2019-20	(29 పనులు)
E.E-VIII	NIT నం.: 5/EE-VIII/2019-20	(1 పని)

వివరాల కోసం www.tirupati.org కి లేదా www.tirumala.org కి లాగాన్ చేయండి. పని వివరాల కోసం https://tender.eprocurement.gov.inకు లాగిన్ చేయండి.
Roc. No.PR4/13907/Adv.No.139/PRO/2019, Dt:29-06-2019 ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్

138 మున్సిపాలిటీల్లో గులాబీ జెండా

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధీమా

- రాష్ట్రంలో 60 లక్షల టీఆర్ఎస్ సభ్యత్వాలు
- క్రియాశీల సభ్యులకు గుర్తింపు కార్డులు
- సర్కార్ చేసింది అప్పు కాదు.. భవిష్యత్తుకు పెట్టుబడి
- సిరిసిల్లలో మోడల్ గ్రంథాలయం ప్రారంభం

సిరిసిల్ల: రాష్ట్రంలోని 138 మున్సిపాలిటీల్లోనూ గులాబీ జెండా ఎగురుతోందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ధీమా వ్యక్తం చేశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో శనివారం ఆయన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా పరిషత్ ఎన్నికల్లో 32 జెడ్పీలను టీఆర్ఎస్ దక్కించుకోవడం దేశ చరిత్రలో ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. తెలంగాణ సాధించిన పార్టీగా టీఆర్ఎస్ రాష్ట్రానికి శ్రీరామ రక్షగా ప్రజలు భావిస్తున్నారని కేటీఆర్ వివరించారు. 2018 శాసనసభ ఎన్నికల్లో 50 శాతం ఓట్లతో 75 శాతం మంది ఎమ్మెల్యేలను ప్రజలు గెలిపించారని, లోక్‌సభ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు అందించారని, స్థానిక సంస్థల ఎన్నికల్లో తిరుగులేని శక్తిగా టీఆర్ఎస్ నిలిచిందని కేటీఆర్ చెప్పారు.

జూలై నుంచి రెట్టింపు పింఛన్లు

జూలై నుంచి ఆసరా పింఛన్లు రెట్టింపు చేసి చెల్లిస్తామని కేటీఆర్ తెలిపారు. పింఛన్లు కేంద్ర ప్రభుత్వం చెల్లిస్తోందని కొందరు సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారని, పింఛన్లకు ఢిల్లీ నుంచి వచ్చేది సున్నా అని కేటీఆర్ పేర్కొన్నారు. రాష్ట్రాన్ని అప్పుల పాలు చేశారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని, అవి అప్పులు కాదు.. భవిష్యత్తుకు పెట్టుబడి అని వివరించారు. రాష్ట్రంలో జూలై 20వ తేదీ నాటికి 60 లక్షల టీఆర్ఎస్ సభ్యత్వాలు చేరిస్తే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఇందులో 35 శాతం క్రియాశీల సభ్యత్వాలు ఉంటాయని పేర్కొన్నారు. ప్రతీ సభ్యత్వాన్ని కంప్యూటరీకరణ చేస్తామన్నారు. ప్రతి కార్యకర్త ఆధార్ నంబరు, ఫోన్ నంబరుతో సహా సమగ్ర సమాచారాన్ని పార్టీ కేంద్ర కార్యాలయంలో రికార్డు చేస్తున్నామని చెప్పారు. క్రియాశీల కార్యకర్తలకు పార్టీ పరంగా గుర్తింపు కార్డులు జారీ చేస్తామని, ఇళ్లలో కూర్చుని బోగస్ సభ్యత్వాలు నమోదు చేయొద్దని సూచించారు. కార్యకర్తలకు రూ.2 లక్షల ప్రమాద బీమా కోసం ఏటా రూ.15 కోట్లు ప్రీమియంగా చెల్లిస్తున్నామని వివరించారు. సిరిసిల్లలో టీఆర్ఎస్ భవన నిర్మాణం కోసం తన వంతుగా నెల జీతం రూ.2.50 లక్షలు విరాళంగా అందిస్తున్నట్లు ప్రకటించారు. వేదికపై ఉన్న టీఆర్ఎస్ నేతలు కేటీఆర్‌ను స్ఫూర్తిగా తీసుకుని రూ.40 లక్షల మేర భవనానికి విరాళాలు అందించారు. దసరా నాటికి అద్భుతమైన టీఆర్ఎస్ భవనం సిద్ధం చేస్తామన్నారు.

మోడల్ డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

జిల్లా కేంద్రంలో డాక్టర్ సి.నారాయణరెడ్డి స్మారక మందిరం పేరుతో మోడల్ డిజిటల్ లైబ్రరీని కేటీఆర్ ప్రారంభించారు. రూ.3.60 కోట్ల వ్యయం నిర్మించిన భవనాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎక్కడాలేని విధంగా సిరిసిల్లలో మోడల్ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. పిల్లలకు పుస్తక పఠనంపై ఆసక్తి తగ్గిపోతున్న ఈ రోజుల్లో తెలుగు భాషావృద్ధికి దోహదపడేలా ఆధునిక హంగులతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశామన్నారు. డిజిటల్ నెట్‌వర్క్‌తో కంప్యూటర్లను ఏర్పాటు చేసినట్లు కేటీఆర్ తెలిపారు. గొప్ప సమాచార, విజ్ఞాన కేంద్రంతో గ్రంథాలయం ఉంటుందన్నారు.



శనివారం కేటీఆర్ చేతుల మీదుగా టీఆర్ఎస్ సభ్యత్వాన్ని తీసుకుంటున్న సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ సామల పావని

15 రోజులు.. 11,810 మందికి పట్టాలు

నిర్మల్ జిల్లాలో విజయవంతంగా 'భూ ప్రక్షాళన'

- ఏళ్లు తిరిగినా కాని పనులు.. నిమిషాల్లో పూర్తి
- తహసీల్దార్లు, వీఆర్ఓలు, ఆపరేటర్లు అంతా ఒకేచోట
- అప్పటికప్పుడే రైతుల భూసమస్యలు పరిష్కారం
- వర్క్‌షాప్ చేపట్టిన ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్‌రావు

నిర్మల్: రెవెన్యూ ఆఫీసుల చుట్టూ సంవత్సరాల పాటు తిరిగినా పూర్తి కాని రైతుల సమస్యలు నిమిషాల్లో పరిష్కారమయ్యాయి. రైతులను తమ ఇంటికి, ఆఫీసులకు తిప్పించుకుంటున్న అధికారులు, రైతుల భూసమస్యలను దగ్గరుండి పరిష్కరించారు. దీంతో కేవలం 15 రోజుల్లోనే 11,810 కొత్త పాసుపుస్తకాలు జారీ అయ్యాయి. భూసంబంధిత, పట్టా దారు పాసుపుస్తకాల సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు, సంబంధిత రైతులు రైతుబంధు డబ్బులు పొందేలా చేసేందుకు నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్‌రావు ప్రత్యేక వర్క్‌షాప్ ప్రారంభించారు. ఈ నెల 15 నుంచి జిల్లాలోని 19 మండలాల తహసీల్దార్లు, వీఆర్ఓలు, కంప్యూటర్ ఆపరేటర్లను కలెక్టరేట్‌కే రప్పించారు. ప్రతిరోజూ ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు వీరంతా కేవలం భూసమస్యల పరిష్కారంపైనే దృష్టి పెట్టాలని ఆదేశించారు. వారికి కావాల్సిన కంప్యూటర్లు తదితర ఏర్పాట్లను చేశారు. అన్ని మండలాల తహసీల్దార్లు తమ వద్ద పెండింగ్‌లో ఉన్న భూ సమస్యల పరిష్కారం కోసం ఆపరేటర్ల వద్దే కూర్చుని చేయించారు. పాసు పుస్తకాల్లో రెండో పేజీలో తప్పుల సవరణ, తర్వాత ప్రింటింగ్ కూడా అప్పటికప్పుడు చేయించారు. ఆర్‌డీఓ, జేసీల డిజిటల్ సంతకాల ప్రక్రియ కూడా వర్క్‌షాప్‌లోనే పూర్తిచేశారు.

స్వయంగా ఫిర్యాదుల స్వీకరణ

తహసీల్దార్లు వర్క్‌షాప్‌లో ఉండగా, ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్‌రావు రైతుల నుంచి తానే స్వయంగా ఫిర్యాదులను స్వీకరించారు. 15 రోజుల పాటు ప్రతిరోజూ తాను కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకు వినతులను తీసుకుంటూ.. రైతుల ముందే వాటిని తహసీల్దార్లకు వివరించి, అప్పటికప్పుడు పరిష్కరింపజేశారు. తప్పు చేసిన వీఆర్ఓలకు ఓ స్థాయిలో సీరియస్ క్లాస్ తీసుకున్నారు. భూములున్నా పట్టా పాసుపుస్తకాలు రాకుండా.. కొత్త పుస్తకాలొచ్చినా అందులో మొత్తం భూమి లేకుండా.. అసలు సర్వే నంబర్లే పడకుండా.. ఉన్న సమస్యలన్నింటినీ వేగంగా పరిష్కరించేలా చర్యలు తీసుకున్నారు.

ఇన్‌చార్జి కలెక్టర్ ప్రత్యేక దృష్టి

జిల్లాలో భూసమస్యలు, రెవెన్యూ సిబ్బంది కారణంగా రైతులు ఇబ్బంది పడుతున్న తీరుపై ఇన్‌చార్జి కలెక్టర్ భాస్కర్‌రావు స్వయంగా పరిశీలించారు. ఈ నెల మొదటి వారంలో రెండు, మూడు రోజుల పాటు జిల్లాలోని పలు మండలాలలో ఆకస్మికంగా పర్యటించారు. నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వారిని కలుసుకున్నారు. చిన్న సమస్యను కూడా ఆఫీసుల్లో పరిష్కరించని రెవెన్యూ సిబ్బంది తీరును గ్రహించిన ఆయన, సమస్యలకు పరిష్కారం చూపాలని నిర్ణయించుకున్నారు. దీంతో భూసమస్యల కోసం ప్రత్యేక వర్క్‌షాప్‌ను ప్రారంభించారు.

త్వరితగతిన పరిష్కరించేందుకే..

–ఏ.భాస్కర్‌రావు, ఇన్‌చార్జి కలెక్టర్, నిర్మల్

జిల్లాలో పేరుకుపోయిన భూసంబంధిత సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేశాం. ఇందులో భాగంగా మండలాల్లో చిన్న సమస్యలతోనే ఏళ్లగా సమస్యలు పెండింగ్‌లో ఉండటాన్ని గ్రహించాం. వాటిని త్వరితగతిన పరిష్కరించేందుకు వర్క్‌షాప్ నిర్వహించాం. ఇందులో గణనీయంగా రైతులు, భూసంబంధిత సమస్యలను పరిష్కరించాం. 15 రోజుల పాటు కొనసాగిన ఈ ప్రత్యేక వర్క్‌షాప్ ముగిసినా.. మండలాల వారీగా నిరంతరం కొనసాగిస్తూనే ఉంటాం. ప్రతీ రైతుకు పాసుపుస్తకం వచ్చేదాకా ఈ పనిచేస్తాం.

మండలాల వారీగా సమస్యలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

15 రోజుల్లో పూర్తి చేసినవి

కొత్త పుస్తకాలు అందించినవి	: 11,810
డిజిటల్ సంతకాలు చేసినవి	: 3,746
పాసుపుస్తకంలో రెండో పేజీ ముద్రణ	: 5,684
తప్పుల సవరణ చేసినవి	: 693
ఆధార్‌తో బయోమెట్రిక్ చేసినవి	: 421
వారసత్వ భూమార్పిడి చేసినవి	: 5,045
ముటేషన్‌కు సంబంధించినవి	: 4,717

'సహకార' సంఘ సభ్యులకు

పింఛన్ పథకం

- ముల్కనూర్ సొసైటీలో 700 మందికి వర్తింపు
- మొదటి విడతగా 450 మందికి నెలకు 500 చొప్పున చెల్లింపు

భీమదేవరపల్లి: వరంగల్ అర్బన్ జిల్లా భీమదేవరపల్లి మండలం ముల్కనూర్ సహకార సంఘం సీనియర్ సభ్యులకు విశ్వనాథరెడ్డి వృద్ధాప్య పింఛన్ పథకం అమలుకు శ్రీకారం చుట్టారు. 65 ఏళ్లు నిండిన 700 మంది సభ్యులకు నెలకు రూ.500 చొప్పున పింఛన్ ఇవ్వనున్నట్లు బ్యాంక్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి ప్రకటించారు. ఈ మేరకు వ్యవస్థాపక అధ్యక్షుడు అల్గిరెడ్డి కాశీవిశ్వనాథరెడ్డి 33వ వర్ధంతి సభలో శనివారం ఆయన చెక్కులు పంపిణీ చేశారు. మొదటి విడతగా 450 మంది సభ్యులకు ఏప్రిల్, మే నెలలకు సంబంధించి రూ.వెయ్యి చొప్పున అందించారు. 1956 సంవత్సరంలో భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ప్రారంభమైన ముల్కనూర్ సహకార గ్రామీణ బ్యాంకు అంచెలంచెలుగా ఎదుగుతూ నేడు 7వేల పైచిలుకు సభ్యులతో రూ.300కోట్ల ఆర్థిక లావాదేవీలు సాగిస్తూ లాభాల బాటలో పయనిస్తోంది. బ్యాంకు.. సభ్యులకు సకాలంలో రుణాలు, విత్తనాలు, ఎరువులు అందించడమే కాకుండా పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తోంది. సభ్యుడు మృతి చెందిన పక్షంలో లక్ష వరకు రుణాన్ని మాఫీ చేస్తోంది. కాగా ఈ పథకం అమలు చేయడం పట్ల రైతుల్లో ఆనందం వ్యక్తమవుతుంది.

బీజేపీ అంటే రాహుల్‌కు భయం

- అందుకే అధ్యక్ష పదవి వద్దంటున్నారు: మురళీధర్‌రావు

సాక్షి, సంగారెడ్డి: దేశమంతా భారతీయ జనతా పార్టీ వైపు చూస్తోందని, తమ పార్టీని, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని చూసి రాహుల్ గాంధీకి భయం పట్టుకున్నదని ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి మురళీధర్‌రావు అన్నారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని టీఎన్‌జీవో భవన్‌లో శనివారం 'సంస్థాగత పథం–సభ్యత్వ నమోదు–2019 సన్నాహక కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మురళీధర్‌రావు మాట్లాడుతూ..స్వాతంత్ర్యం వచ్చిన తరువాత వరుసగా రెండోసారి కాంగ్రెసేత ప్రభుత్వం కేంద్రంలో ఏర్పడిందన్నారు. భారతీయ జనతా పార్టీ గతంలో ఎన్నడూలేని విధంగా సంస్థాగతంగా బలపడుతోందని చెప్పారు. దీంతో పార్టీ ఎదుగుదల, ప్రధాని నరేంద్ర మోదీకి వస్తున్న ఆదరణ చూసి జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్న రాహుల్ గాంధీ ఆ పదవిని వదులుకుంటున్నారని అన్నారు. కొన్ని పార్టీలు కులాలు, మతాలపేరుతో నడుస్తున్నాయని ఆయన ధ్వజమెత్తారు. ఒక్క బీజేపీయే కార్యకర్తలు నడిపించే సిద్ధాంతం గల పార్టీ అని పేర్కొన్నారు. జనసంఘ్ పేరుతో ప్రారంభమైన బీజేపీ అంచెలంచెలుగా ఎదిగి వరుసగా రెండోసారి కేంద్రంలో అధికారంలోకి వచ్చే ఉన్నత స్థానానికి ఎదిగిందన్నారు. టీఆర్ఎస్‌కు ప్రత్యామ్నాయం బీజేపీయేనన్నారు. ఆ పార్టీ నిజాం, రజాకార్ల వారసులకు తొత్తుగా మారిందన్నారు. చట్టానికి వ్యతిరేకంగా ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ ఇవ్వాలని టీఆర్ఎస్ కోరుతున్న విషయాన్ని ప్రజలు గమనించాలని కోరారు. ప్రధాని నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫసల్ బీమా యోజన, ఆయుష్మాన్, ప్రధానమంత్రి ఆవాస్‌యోజన తదితర పథకాలను రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేయడంలేదని ఆరోపించారు.

సర్పంచ్, కార్యదర్శులే కూలీలు

అశ్వాపురం: భద్రాద్రి జిల్లా అశ్వాపురం మండల పరిధిలోని మల్లెలమడుగు గ్రామ పంచాయతీలో నూరు శాతం మరుగుదొడ్లు నిర్మించి ఓడీఎఫ్‌గా తీర్చిదిద్దేందుకు సర్పంచ్ చిన్నకృష్ణవేణి, కార్యదర్శి జయ సుధ అహర్నిశలు కృషి చేస్తున్నారు. శనివారం పంచాయతీలో మరుగుదొడ్ల నిర్మాణం పెద్దఎత్తున చేపట్టడంతో కూలీల కొరత ఏర్పడింది. దీంతో సర్పంచ్, కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ వేల్పుల అమృత, వీఓఏ వేల్పుల కవిత, గుమస్తా ఏడెల్లి శ్రీను, వార్డుమెంబర్లు కూలీలుగా మారి ఇటుకలు, ఇసుక, సిమెంట్ మోశారు. సర్పంచ్ కృష్ణవేణి మాట్లాడుతూ.. జూలై 15 వరకు గ్రామపంచాయతీని బహిరంగ మలవిసర్జన రహిత గ్రామంగా ప్రకటించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు.

రూపాయికే ఆరోగ్య పథకం

బూట్‌హౌజ్, రీడింగ్ రూంలు, వృద్ధులకు ఆశ్రమం

కరీంనగర్ బల్దియాలో మరో నాలుగు కొత్త పథకాలు: మేయర్

కరీంనగర్ కార్పొరేషన్: రూపాయికే అంతిమయాత్ర కార్యక్రమం అమలు చేసి రాష్ట్రస్థాయిలో గుర్తింపు పొందిన కరీంనగర్ బల్దియా.. అదే స్ఫూర్తితో మరో నాలుగు పథకాలకు శ్రీకారం చుట్టింది. మేయర్ రవీందర్ సింగ్ శనివారం ఈ కొత్త పథకాల గురించి వివరించారు. పబ్లిక్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసి ఒక్క రూపాయికే రక్త, మూత్ర, బీపీ చెకప్ చేసే విధంగా పథకాన్ని రూపొందించామని తెలిపారు. కార్పొరేషన్ ఆవరణలోనే పబ్లిక్ హెల్త్ సెంటర్ ఏర్పాటు చేసి ఈటల రాజేందర్ సహకారంతో ఒక డాక్టర్, ఒక ల్యాబ్ టెక్నీషియన్‌ను నియామకం చేస్తామన్నారు. వైద్య పరీక్షల కోసం వేల రూపాయల ఖర్చును భరించలేని పేదల కోసం ఈ పథకం ఉపయోగపడుతుందన్నారు. ఇప్పటికీ చెప్పులు లేకుండా నడిచే వారు ఉన్నారని వారందరికీ చెప్పులు అందించే విధంగా బూట్‌హౌజ్ పథకం ప్రవేశపెడుతున్నట్లు తెలిపారు. పాత చెప్పులు, బూట్ల జతలు తీసుకొచ్చి రిపేర్లు చేసి అందిస్తామన్నారు. ఇందుకోసం కళాభారతిలో షెడ్డును నిర్మాణం చేస్తున్నామని తెలిపారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న కమ్యూనిటీ హాళ్లలో నాలుగు రీడింగ్ రూంలు ఏర్పాటు చేసి ఒకటి మహిళలకు కేటాయిస్తామని పేర్కొన్నారు. మున్సిపల్, మెప్మా ఆధ్వర్యంలో సేవా దృక్పథంలో నడుస్తున్న నైట్ షెల్టర్‌లోనే అనాథ వృద్ధులకు ఆశ్రయం కల్పిస్తామన్నారు. రెండు పూటల భోజనం, బెడ్, ఫ్యాన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

ఆరు మున్సిపాలిటీలకు 'పెసా' దెబ్బ

మణుగూరు, పాల్వంచ, సారపాక, భద్రాచలంలో ఎన్నికల్లేవు

- ఆసిఫాబాద్, మందమర్రి మున్సిపాలిటీలదీ అదే పరిస్థితి
- ఏళ్ల తరబడి ప్రత్యేక పాలనే

